www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 18-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 154 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: ద్వాదశి రా.11:25 తదుపరి త్రయోదశి, నక్షత్రం: పుష్యమి ఉ.6:32 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.7:38-9:16, దుర్ముహూర్తం: ఉ.10:08-10:56, మ.2:58-3:46, అమృతఘడియలు: తె. 5:27 మొదలు, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:00, సూర్యాస్తమయం: 6:00 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేపాల్ ‘రెస్క్యూ’ విజయవంతం

చిక్కుకుపోయిన ఏపీవాసుల తరలింపు పూర్తి

మానస సరోవరం నుంచి వచ్చిన చివరి బృందం

కఠ్మాండూ నుంచి ఢిల్లీ మీదుగా 86 మంది హైదరాబాద్‌కు

మొత్తం 361 మందిని తీసుకొచ్చిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో అశాంతి, రాజకీయ సంక్షోభం నేపథ్యంలో అక్కడ చిక్కుకుపోయిన ఆంధ్రప్రదేశ్ ప్రజలందరినీ రాష్ట్ర ప్రభుత్వం సురక్షితంగా తీసుకవచ్చింది. తాజాగా మానస సరోవరంలో చిక్కుకున్న 86 మంది సభ్యుల బృందం బుధవారం సాయంత్రం కఠ్మాండూ విమానాశ్రయం నుంచి బయలుదేరారు. వీరు ఢిల్లీ మీదుగా హైదరాబాద్ చేరుకున్న తర్వాత

మిగతా 2వ పేజీలో...

నేటి నుంచే అసెంబ్లీ

ప్రశ్నోత్తరాలతో ప్రారంభం కానున్న ఉభయసభలు

10 రోజులు నిర్వహించే అవకాశం.. బీఏసీ భేటీలో తుది నిర్ణయం

స్పీకర్, మండలి చైర్మన్ ఉన్నత స్థాయి సమీక్ష.. సభ్యులకు ఇబ్బందులు రాకుండా చూడాలి.. సమాధానాలు సకాలంలో వారికి అందాలి

వైసీపీ సభ్యులకు మళ్లీ విజ్ఞప్తి చేస్తున్నా.. నన్ను గౌరవించకున్నా సభాపతి స్థానాన్ని గౌరవించి అసెంబ్లీకి రండి.. చర్చకు అవకాశమిస్తాం: స్పీకర్



14

అహం అడ్డొచ్చే అసెంబ్లీకి డుమ్మా!

మండలిలో ప్రతిపక్ష నేతగా బొత్స

క్యాబినెట్ ర్యాంకు, కొంత ఎక్కువసేపు మాట్లాడే వీలు

శాసనసభలో జగన్ ఎమ్మెల్యే మాత్రమే

పార్టీ బలం ఆధారంగానే సమయం

జగన్ హోదా బాధ వెనుక కథ ఇదీ!

అందుకే రానంటూ మారాం!

ఇంటి దగ్గరైతే సొంత మీడియా ముందు గంటలకొద్దీ ఉపన్యాసాలకు అవకాశం

ప్రశ్నలు అడిగేవారే ఉండరు

అడిగినా ఆయన జవాబు చెప్పరు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తనకు ప్రతిపక్ష నేత హోదా ఇస్తే తప్ప.. అసెంబ్లీకి రాన ంటూ వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ భీష్మించడం వెనుక వేరే కథ ఉందా? ఆ పార్టీ వర్గాలు కూడా అవుననే అంటున్నాయి. పార్టీకి సభలో ఎంత మంది సభ్యులు ఉన్నా.. ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టామా లేదా అన్నదానికే రాజకీయ పార్టీలు

మిగతా 14వ పేజీలో...



'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభానికి ముందు వైద్య శిబిరాన్ని సందర్శించి చిన్నారికి చుక్కల మందు వేస్తున్న సీఎం చంద్రబాబు

ఇల్లాలి ఆరోగ్యం.. ఇంటికి సౌభాగ్యం

సంపన్న, ఆరోగ్య, సంతోష రాష్ట్రమే లక్ష్యం

మహిళే బెస్ట్ ఫైనాన్స్ మినిస్టర్.. కార్పొరేట్ల కంటే డ్వాక్రా, మెప్మాలే గ్రేట్

తీసుకున్న రుణం ఠంచనుగా కడతారు.. ప్రతి ఒక్కరికీ 2.5 లక్షలబీమా

ఐదు కోట్ల మందికి ఆరోగ్య కార్డులు.. మహిళలకు ఎన్టీఆర్ ఆస్తి ఇచ్చారు

33% కోటాతో పెద్దఎత్తున వారిని నరేంద్ర మోదీ సభలోకి తేనున్నారు

నేను, నిర్మల ఎకనామిక్స్ చేశాం.. 'స్వస్థ్ నారీ..' సభలో సీఎం వ్యాఖ్యలు

డబుల్ ధమాకా!

డబుల్ ఇంజన్ సర్కార్‌తో డబుల్ డిజిట్ గ్రోత్

పరిశ్రమల అభివృద్ధికి ఇదే సరైన సమయం

దేశాన్ని పటిష్ఠ నాయకత్వం నడిపిస్తోంది

జీసీసీలకు ప్రపంచ కేంద్రంగా భారత్

ఏపీలో పరిశ్రమలకు సత్వర అనుమతులు

లాజిస్టిక్ సౌకర్యాల పెంపుపై ప్రత్యేక ఫోకస్

ఆగస్టుకల్లా భోగాపురం విమానాశ్రయం రెడీ

గంటలో గమ్యం చేరేలా విమానాశ్రయాలు

సీఐఐ జీసీసీ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో సీఎం

జీసీసీలు అంటే గుర్తొచ్చేది భారతీయులే

అవి బ్యాక్ ఆఫీసులు కాదు.. ఫ్యూచర్ రెడీ సెక్టార్

వీటి అభివృద్ధికి ఏపీ అనుకూలం: నిర్మల



విశాఖలో నిర్వహించిన జీసీసీ సదస్సులో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, భారత పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులు

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి ఇదే సరైన సమయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సరైన నాయకత్వం దేశాన్ని నడిపిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయడం వల్ల డబుల్ ఇంజన్ సర్కార్‌తో డబుల్ డిజిట్ గ్రోత్ సాధ్యమైందని చెప్పారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)కు భారత్ ప్రపంచ కేంద్రంగా మారుతోందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు ఎల్లవేళలా అందుబాటులో

మిగతా 13వ పేజీలో...



విశాఖ సదస్సులో ఆర్థిక మంత్రి నిర్మలకు జ్ఞాపిక బహూకరిస్తున్న సీఎం చంద్రబాబు

140 కోట్ల మందికి జీఎస్టీ లబ్ధి

ఖర్చులు తగ్గి, చేతిలో డబ్బు ఉంటుంది

రెండు స్లాబ్‌లతో తగ్గనున్న భారం

దోచుకోవడానికి జీఎస్టీ తీసుకురాలేదు

పన్ను విధానాన్ని క్రమబద్ధీకరించాం

పన్ను చెల్లింపుదారులను పెంచాం

జీఎస్టీ సంస్కరణల లక్ష్యం వికసిత్ భారత్

నిర్మలా సీతారామన్ వెల్లడి

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు లబ్ధి చేకూర్చేలా జీఎస్టీ 2.0 సంస్కరణలు తెచ్చామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ మహిళాపక్షపాతి అని, వారి కోసం ప్రత్యేకంగా ఆయన కార్యక్రమాలు రూపొందిస్తున్నారని తెలిపారు. బుధవారం విశాఖలోని 'వి' కన్వెన్షన్ సెంటర్‌లో నెక్స్ట్ జనరేషన్ జీఎస్టీ రిఫార్మ్స్ (తర్వాతి తరం జీఎస్టీ సంస్కరణలు) పేరుతో జరిగిన అవగాహన సదస్సులోను, ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభ కార్యక్రమంలోనూ

మిగతా 13వ పేజీలో...

బెంగళూరుకు బ్లాక్‌బక్ బైబై!

తొమ్మిదేళ్లుగా గుంతల రోడ్లతో విసుగు

ఇంకో ఏడేళ్లకూ పూడుస్తారన్న నమ్మకం లేదు

అందుకే వేరే చోటకు తరలిపోతున్నాం

సీఈవో రాజేశ్ యవాజీ సంచలన ప్రకటన

విశాఖ రావాలంటూ వెంటనే లోకేశ్ ఆహ్వానం

స్వచ్ఛ నగరాల్లో విశాఖ ఐదో స్థానంలో ఉంది

గుణాత్మక మౌలిక వసతులు కల్పిస్తున్నాం

మహిళలకు సురక్షితమైన నగరం కూడా

బ్లాక్‌బక్‌ను ఇక్కడికి మార్చే అంశాన్ని పరిశీలించాలని ఐటీ మంత్రి లోకేశ్ వినతి

దీంతో కర్ణాటక పారిశ్రామిక వర్గాల్లో కలకలం

సిద్దూ ప్రభుత్వం వెంటనే స్పందించాలని పారిశ్రామికవేత్తల పిలుపు

గుంతలన్నీ నవంబరులోగా పూడుస్తామని డీకే శివకుమార్ హామీ

BLACKBUCK

బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వానికి బెంగళూరులోని ప్రముఖ లాజిస్టిక్స్ టెక్ కంపెనీ బ్లాక్‌బక్ షాకిచ్చింది. గుంతలమయమైన రహదారులు, ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, అందుకే తమ కంపెనీని బెంగళూరు నుంచి తరలించాలని నిర్ణయించామని ఆ సంస్థ సీఈవో రాజేశ్ యవాజీ బుధవారం 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఆ వెంటనే ఆంధ్రప్రదేశ్ ఐటీ మంత్రి లోకేశ్ స్పందించారు. విశాఖకు వచ్చేయాలని

మిగతా 12వ పేజీలో...

అభివృద్ధిలో వేగం



ఏపీలో సానుకూల వాతావరణం.. సమర్థ నాయకత్వంతో ముందుకు

చంద్రబాబు వల్లే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు

చేతల్లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్.. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

విశాఖలో అతిపెద్ద డేటా సెంటర్.. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

ఏపీ-యూకే బిజినెస్ ఫోరం రోడ్‌షోలో లోకేశ్.. ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో చర్చలు

12

త్వరలో బీసీ చట్టానికి తుది రూపం

స్థానిక ఎన్నికల్లో 34% రిజర్వేషన్లు

కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు

బీసీ మంత్రుల సమావేశంలో నిర్ణయం

యువగళం, ఎన్నికల హామీలపై చర్చ

2

అమరావతి 'అసైన్డ్' రైతులకు శుభవార్త

ల్యాండ్ ఓనర్‌షిప్ సర్టిఫికెట్‌లో ఆ పదం తొలగింపు

ఇకపై పట్టా భూమిగా పేర్కొనాలని ప్రభుత్వ ఉత్తర్వులు

సీఎం చంద్రబాబు ఆదేశాలతో తొలగిన కష్టాలు

13



ఈవీఎంపై అభ్యర్థుల కలర్ ఫొటోలు

సులభంగా చదివేలా పెద్ద అక్షరాలతో పేర్లు

ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకత పెంపునకు

ఎన్నికల కమిషన్ నిర్ణయం

బిహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే అమలు

అన్ని రాష్ట్రాల సీఈవోలకూ లేఖలు

2



ఇజ్రాయెల్ బాంబుల దాడితో నేలమట్టమైన ఓ భవంతి వద్ద పాలస్తీనీయులు

ఇజ్రాయెల్ అధీనంలోకి గాజా!

ఇప్పటికే 75% భూభాగం స్వాధీనం

వైమానిక దాడుల్లో పలు భవనాలు నేలమట్టం

ఉధృతంగా భూతల దాడులు కొనసాగిస్తున్న సైనం

తీర ప్రాంతాలకు తరలిపోతున్న గాజా వాసులు

రెండేళ్ల యుద్ధంలో 65 వేలకు చేరిన మృతులు

ఇజ్రాయెల్‌పై ఆంక్షల యోచనలో ఈయూ

2

'అస్త్ర సన్యాసం' నిజమేనా?

ఆయుధాలు వదిలేందుకు నక్సల్స్‌సిద్ధమయ్యారా?

ఏది అసలు..? ఏది నకిలీ?.. లేఖలపై ప్రజాసంఘాల భిన్నాభిప్రాయాలు

మైండ్‌గేమ్ అంటున్న పోలీసులు.. చీలిక దిశగా మావోయిస్టు పార్టీ?

సాహిత్య విమర్శకుడు ఆచార్య ఎస్వీ రామారావు కన్నుమూత



40కి పైగా విమర్శనా పుస్తకాలు రచించిన ఎస్వీ

తెలుగు పాఠ్యపుస్తకాల రూపకల్పనలో పాత్ర

11

చిదిమేసిన టిప్పర్

రాంగ్‌రూట్‌లో దూసుకొచ్చి కారును ఢీకొట్టిన టిప్పర్

కారులోని ఏడుగురూ దుర్మరణం

ఆస్పత్రిలోని బంధువు పరామర్శకు కొత్త కారులో వెళ్తుండగా ఘోరం

అదే ఆస్పత్రికి చివరకు విగతజీవులుగా చేరిన విషాదం

మాంసం ముద్దలైన మృతదేహాల వెలికితీతకు గంట సమయం

నెల్లూరు జిల్లాలో ఘోర ప్రమాదం.. డ్రైవర్ తప్ప అందరూ బంధువులే



నెల్లూరు జిల్లా పెరమన వద్ద జరిగిన ప్రమాదంలో కారును తొక్కేసిన టిప్పర్

సంగం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో ఉన్న బంధువును పరామర్శించేందుకు కారులో బయలుదేరిన వాళ్లంతా విగతజీవులుగా మారి అదే ఆస్పత్రికి చేరిన పెను విషాదమిది. మరో 15, 20 నిమిషాల్లో గమ్యస్థానం చేరతారనగా... మృత్యువులా దూసుకొచ్చిన టిప్పర్ వారి కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులోని ఏడుగురూ మాంసంముద్దల్లా మారగా, వారు ప్రయాణిస్తున్న కారు నుజ్జునుజ్జయింది. టిప్పర్ కింద ఇరుక్కుపోయిన కారును బయటకుతీయడానికి పోలీసులకు 2 గంటలు, ఆపై మృతదేహాల వెలికితీతకు మరో గంట సమయం పట్టింది. నెల్లూరు జిల్లా సంగం మండలం పెరమన వద్ద ముంబై జాతీయరహదారిపై బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో

మిగతా 12వ పేజీలో...

టిప్పర్.. హారర్!

వాహనదారుల పాలిట మృత్యుశకటాలు

అధిక లోడు, మితిమీరిన వేగంతో భయోత్పాతం

రోడ్లపై అడ్డూ అదుపూ లేకుండా హల్‌చల్

చాలా బండ్లు రాజకీయ నాయకుల చేతుల్లోనే

ఫీజు కడితేనే సర్టిఫికెట్!

ఉన్నత విద్యాసంస్థల అల్టిమేటం

విద్యార్థుల జీవితాలతో ఆటలు

సర్టిఫికెట్లు ఇవ్వని ఆర్జీయూకేటీ

పీజీ అనుమతికి ఏఎన్‌యూ నో

ప్రభుత్వ ఫీజు బకాయిలే కారణం

ఇప్పటికి ఆరు క్వార్టర్లు పెండింగ్

అప్పు చేసి ఫీజు కడుతున్న వైనం

కట్టలేనివారు ఉన్నతవిద్యకు దూరం

జగన్ విధానమే సమస్యకు కారణం

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన ఓ విద్యార్థికి ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. కానీ, సర్టిఫికెట్లు క్యాంపస్‌లోనే ఉండిపోయాయి. ఫీజు కట్టలేదనే కారణంతో అధికారులు సర్టిఫికెట్లు నిలిపివేశారు. దీంతో ఆ విద్యార్థి ఉద్యోగం కోల్పోయే దుస్థితి ఏర్పడింది.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విద్యార్థుల జీవితాలతో ఉన్నత విద్యాశాఖ ఆటలాడుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంటు కింద ప్రభుత్వం సొమ్ము చెల్లించకపోవడంతో విద్యార్థులు తమ అమూల్యమైన అవకాశాలను కోల్పోతున్నారు. ప్రభుత్వ పరిధిలోని విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలే ఫీజుల కోసం విద్యార్థులను ఇక్కట్ల పాల్జేస్తున్నాయి. 'ఫీజు కట్టు.. సర్టిఫికెట్

మిగతా 13వ పేజీలో...

'అస్త్ర సన్యాసం' నిజమేనా?

» మావోయిస్టుల లేఖలు అసలైనవేనా?

హైదరాబాద్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రాణంతో సమానంగా చూసుకుంటున్న ఆయుధాలను వదిలేస్తామని మావోయిస్టులు నిజంగానే నిర్ణయించారా? ఆయుధాలను వదిలేస్తామంటూ మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట విడుదలైన లేఖ నిజమైనదేనా? లేఖల పేరిట మైండ్‌గేమ్ ఆడుతున్నారా? అంటే.. భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మావోయిస్టు పార్టీ పంథాకు పూర్తి విరుద్ధమైన అంశాలు అభయ్ పేరిట విడుదలైన లేఖలో ఉండడం, లేఖపై అభయ్ ఫొటో ముద్రించి ఉండడం, ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడం కోసమంటూ ఈమెయిల్, ఫేస్‌బుక్ ఐడీలు ఇవ్వడంచూస్తుంటే అది పక్కాగా నకిలీ లేఖేనని ప్రజా సంఘాల నేతలు, మాజీ మావోయిస్టులు పేర్కొంటున్నారు. ఈ లేఖ నిజమైనదే అయితే మాత్రం మావోయిస్టు పార్టీ చీలిక దిశగా పయనిస్తోందన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి మావోయిస్టు పార్టీ కేంద్ర అధికార ప్రతినిధి ఇటీవల ఓ లేఖ విడుదల చేశారు. అందులో ఆపరేషన్ కగార్‌ను ప్రస్తావిస్తూ.. తమ పార్టీ క్యాడర్ పలు సందర్భాల్లో పోలీసులను సమర్థంగా ఎదుర్కొంటోందని, పోలీసులకు జరిగిన నష్టాన్ని, మరణాలను వెల్లడించడం లేదని పేర్కొన్నారు. ఇటీవల మావోయిస్టు సీనియర్ నేత పోతుల పద్మావతి డీజీపీ జితేందర్ సమక్షంలో లొంగిపోయిన క్రమంలో మావోయిస్టు లేఖ, గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్ల మరణాలపై 'ఆంధ్రజ్యోతి' విలేకరి అడిగిన ప్రశ్నకు.. మైండ్‌గేమ్‌లో భాగంగానే మావోయిస్టులు ఆ లేఖను జారీ చేసి ఉండొచ్చని డీజీపీ బదులిచ్చారు. గతంలో మావోయిస్టులకు దీటుగా రకరకాల కోబ్రాలను రంగంలోకి దింపి లేఖలు విడుదల చేసిన చరిత్ర పోలీసులకూ ఉంది. మావోయిస్టులతో చర్చలు జరపాలని శాంతి సంఘాలు కోరుతుండగా.. ఆయుధాలు వదిలి లొంగిపోవాలని, చర్చల ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పలుమార్లు స్పష్టం చేశారు.

మావోయిస్టు పార్టీలో సమన్వయ లోపం?

ఆయుధాలు వదిలిపెట్టే విషయంలో మావోయిస్టు పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు సమాచారం. ఆపరేషన్ కగార్ ప్రారంభమైన తర్వాత మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, పొలిట్‌బ్యూరో మధ్య సమాచార, సమన్వయ లోపం ఉన్నట్లు తెలుస్తోంది. పోతుల పద్మావతి లొంగుబాటుకు సంబంధించి మే నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. తాను లొంగిపోవాలనుకుంటున్న విషయాన్ని పద్మావతి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరు ప్రసాదరావు ద్వారా కేంద్ర కమిటీ బాధ్యులకు, పొలిట్ బ్యూరోకు తెలియజేసింది. కానీ, వారి నుంచి అనుమతి రావడానికి నాలుగు నెలలు పట్టింది. అంటే పార్టీలో సమాచార వ్యవస్థ ఎంత నిదానంగా ఉందన్న విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. మావోయిస్టు పార్టీ నూతన సారథిగా పోటీలో ఉన్న మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ తనకు ఆ స్థానం దక్కకపోవడంతోనే ఈ లేఖ విడుదల చేశారా? పార్టీ నుంచి ఆయన విడిపోవడానికి నిర్ణయించుకున్నారా? లేక మల్లోజుల పేరిట లేఖను సృష్టించి, పార్టీలో ఆయనపై అనుమానాలు రేకెత్తించడానికి పోలీసులు చేసిన ప్రయత్నమా? అన్న విషయంలో వామపక్ష మేధావుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి

చింతూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని రెండు వేర్వేరు జిల్లాల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్లలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దులోని గడ్చిరోలి జిల్లా ఏటపల్లి అటవీ ప్రాంతంలో సీ-60 కమాండోలు కూంబింగ్ నిర్వహించారు. ఈక్రమంలో తారసపడిన మావోయిస్టులు, కమాండోల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. అలాగే, బీజాపూర్ జిల్లా గంగులూర్ అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ జవాన్లు సంయుక్తంగా జరిపిన కాల్పుల్లో మరో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. వారు ఎవరన్నదీ గుర్తించాల్సి ఉంది. ఇక అబూజ్‌మాడ్ పరిధిలోని నారాయణపూర్ జిల్లాలో 12మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో ఐదుగురు మహిళా మావోయిస్టులతో పాటు ఏరియా కమిటీ సభ్యులు సురేంద్రనేతం అలియాస్ సుధాకర్, డోబా సలాం అలియాస్ మహేష్ సలాం ఉన్నారు. మరోవైపు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా నక్సలైట్లు మృతి చెందారు. కాగా, కాంకేర్ జిల్లాలో పోలీసులు బుధవారం మోస్ట్ వాంటెడ్ మావోయిస్టుల పోస్టర్లు, బ్యానర్లను విడుదల చేశారు. వాటిపై ఉన్న మావోయిస్టుల ఆచూకీ తెలిపిన వారికి బహుమతి కూడా ఇస్తామని ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఆచూకీ తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇస్తున్నారు.

మీరు పరమ భక్తులంటున్నారు కదా..
వెళ్లి విష్ణువునే ప్రార్థించండి

» 'ఖజురహో' వ్యాజ్యంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: ఖజురహోలోని జావరీ ఆలయంలో మొఘలుల కాలంలో విధ్వంసానికి గురైన 7 అడుగుల విష్ణుమూర్తి విగ్రహాన్ని పునరుద్ధరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. రాకేశ్ దలాల్ అనే వ్యక్తి ఈ పిటిషన్ వేశారు. మొఘలుల దండయాత్రల్లో ఆ విగ్రహం తల నరికారని.. దాన్ని పునరుద్ధరించాలంటూ ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవట్లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. సుప్రీం సీజే జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజే మాసిహ్‌తో కూడిన ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్ రాగా.. ఈ అంశం ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిధిలో ఉందని పేర్కొంటూ దాన్ని విచారించేందుకు ధర్మాసనం తిరస్కరించింది. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్.. "మీరు విష్ణుమూర్తికి పరమభక్తులని చెబుతున్నారు కదా.. వెళ్లి దీనిపై ఏదైనా చేయాలని ఆ దేవుణ్నే అడగండి. వెళ్లి ప్రార్థించండి" అని పిటిషనర్‌కు సలహా ఇచ్చారు.

రైతుల్లో కొందరిని అరెస్టు చేస్తేగానీ పంట వ్యర్థాల దహనం మానరు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: దేశ రాజధానిలోని కాలుష్యంపై విచారణ సందర్భంగా బుధవారం సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. పొలాల్లో పంట దుబ్బులను కాల్చడం కారణంగా కాలుష్యం పెరుగుతుండడాన్ని తీవ్రంగా పరిగణించింది. అలా చేస్తున్న కొందర్ని జైల్లో వేస్తేనే రైతులకు సరైన సందేశం వెళ్తుందని అభిప్రాయపడింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ మాట్లాడుతూ "రైతులు ప్రత్యేకమైనవారు, కాదనడం లేదు. వారి కారణంగానే అన్నం తింటున్నాం. అలాగని పర్యావరణాన్ని రక్షించకుండా ఉండలేం" అని అభిప్రాయపడ్డారు.

గ్యాంగ్‌స్టర్ ఛోటా రాజన్ బెయిల్ రద్దు

హత్య కేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న గ్యాంగ్‌స్టర్ ఛోటా రాజన్‌కు బాంబే హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను బుధవారం సుప్రీంకోర్టు రద్దు చేసింది. 2001లో ముంబయికి చెందిన హోటల్ యాజమాని జయా శెట్టి హత్య చేసిన కేసులో రాజన్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ 2024లో ప్రత్యేక కోర్టు తీర్పు చెప్పింది. బాంబే హైకోర్టు ఆ శిక్షను రద్దు చేయడంతో పాటు, వేరే కేసులో జైలు జీవితం అనుభవిస్తున్న అతడికి తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. దీనిని సవాలు చేస్తూ సీబీఐ చేసిన అప్పీలుపై సుప్రీం ధర్మాసనం విచారణ జరిపింది. 27 ఏళ్ల పాటు పరారీలో ఉండి, నాలుగు కేసుల్లో శిక్ష పడ్డ ముద్దాయిని విడుదల చేయడం ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది.

జపాన్‌కు పాకిస్థాన్ నకిలీ ఫుట్‌బాల్ జట్టు

» ఎయిర్‌పోర్ట్ నుంచే తిప్పి పంపిన అధికారులు

లాహోర్, సెప్టెంబరు 17: జపాన్‌లో అడుగుపెట్టిన ఓ పాకిస్థాన్ నకిలీ ఫుట్‌బాల్ జట్టు గుట్టురట్టయింది. దీంతో వెనక్కి పంపేసినట్టు ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎఫ్ఐఏ) బుధవారం వెల్లడించింది. 22మందితో ఉన్న నకిలీ ఫుట్‌బాల్ జట్టును జపాన్‌కు పంపడంలో మానవ అక్రమరవాణా నెట్‌వర్క్ ప్రమేయం ఉన్నట్టుగా పేర్కొంది. 15 రోజుల వీసాతో ఈ జట్టు జూన్‌లో జపాన్‌కు చేరుకుంది. నకిలీ ఆటగాళ్లు ఫుట్‌బాల్ కిట్స్ ధరించడమే కాకుండా పాక్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ వద్ద రిజిస్టర్ అయి ఉన్నామని, ఓ జపనీస్ క్లబ్‌తో మ్యాచ్‌లు ఆడాల్సి ఉందని చెప్పారు. వీరిపై అనుమానంతో జపనీస్ ఇమ్మిగ్రేషన్ అధికారులు ప్రశ్నించారు. నకిలీ జట్టుగా గుర్తించి విమానాశ్రయం నుంచే వెనక్కి పంపించారు.



తీర ప్రాంతాలకు తరలిపోతున్న గాజా ప్రజలు



ఇజ్రాయెల్ దాడులతో గాజాలో కూలిపోయిన భవనాలు

గాజా నేలమట్టం

గాజా సిటీపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం

» తీరప్రాంతాలకు వెళ్లిపోతున్న గాజా వాసులు

» రెండేళ్ల యుద్ధంలో 65 వేలకు చేరిన మృతులు

గాజా, టెల్‌అవీవ్, సెప్టెంబరు 17: ఇజ్రాయెల్ వైమానిక దాడులతో పాటు భూతల దాడులు కూడా తోడవడంతో గాజా ధ్వంసమైపోతోంది. బహుళ అంతస్థుల భవనాలు క్షణాల్లో నేలమట్టమవుతున్నాయి. గాజాపై ఇప్పటికే 75 శాతం నియంత్రణ తెచ్చుకున్న ఇజ్రాయెల్ పూర్తి పట్టుకోసం భూతల దాడులు ముమ్మరం చేసింది. దీనికి తోడు గాజా సిటీలో ఇప్పటికీ 3 వేల మంది హమాస్ ఉగ్రవాదులు ఉన్నారని వారిని అంతమొందిస్తేనే తమ లక్ష్యం నెరవేరుతుందంటూ దాడులు కొనసాగిస్తోంది. గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం సృష్టిస్తోందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెలువడినా ఐడీఎఫ్ ఉధృతంగా దాడులు చేస్తోంది. దాడులు విధ్వంసకరంగా మారడంతో గాజా సిటీ నుంచి వేలాది మంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తీరప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. తీర ప్రాంత రహదారి పూర్తిగా వాహనాలతో నిండిపోయింది. సిటీని వీడాలన్న ఐడీఎఫ్ హెచ్చరికలతో ముందుగానే మూడున్నర లక్షల మంది తీరప్రాంతాలకు వెళ్లిపోగా భూతల దాడుల తర్వాత మరో 3 లక్షల మంది గాజా నగరాన్ని విడిచిపెట్టారని సమాచారం. ఇజ్రాయెల్ దాడుల్లో గత రెండేళ్లలో 65,062 మంది పాలస్తీనియన్లు మృతిచెందగా 1,65,697 మంది గాయపడ్డారు.

యెమెన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

యెమెన్‌లోని హొడైడాలో ఉన్న హౌతీల ఆయుధ స్థావరాలపై ఇజ్రాయెల్ భారీగా వైమానిక దాడులు జరిపింది. దీంతో హౌతీలు తమ గగనతల రక్షణ వ్యవస్థను క్రియాశీలం చేశారు. ఈ కారణంగా ఇజ్రాయెల్ విమానాలు తికమకపడి వెనుతిరిగాయని హౌతీల అధికార ప్రతినిధి ప్రకటించారు. ఆ తర్వాత హౌతీలు ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు ప్రయోగించడంతో జెరుసలెంతో పాటు టెల్ అవీవ్‌లో సైరన్లు మోగాయి. హౌతీల రాకెట్లను కూల్చేశామని ఐడీఎఫ్ ప్రకటించింది.

ఈయూ ఆంక్షల యోచన

గాజాపై భారీ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్‌పై ఆంక్షలు విధించాలని యూరోపియన్ యూనియన్ యోచిస్తోంది. అయితే ఏకాభిప్రాయం కుదరడం లేదు. జర్మనీ, హంగేరీ, చెక్ రిపబ్లిక్ వంటి దేశాలు వ్యతిరేకిస్తుండగా స్పెయిన్, ఐర్లాండ్ దేశాలు ఆంక్షలను సమర్థిస్తున్నాయి. మరోవైపు తమపై ఆంక్షలు విధించాలన్న ఈయూ యోచనను ఇజ్రాయెల్ తప్పుబట్టింది.



గాజా సరిహద్దుల్లో ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు

భారత కాన్సులేట్‌ను ముట్టడిస్తాం

» కెనడాలోని ఖలిస్థానీ సంస్థ 'సిక్స్ ఫర్ జస్టిస్' హెచ్చరిక

» నేడు కాన్సులేట్‌కు వెళ్లొద్దని ఇండో-కెనడియన్లకు సూచన

వాంకోవర్, సెప్టెంబరు 17: కెనడాలోని వాంకోవర్ నగరంలో ఉన్న భారత కాన్సులేట్‌ను గురువారం 12 గంటలపాటు ముట్టడించనున్నామని ఖలిస్థానీ వేర్పాటువాద సంస్థ 'సిక్స్ ఫర్ జస్టిస్' హెచ్చరించింది. అందువల్ల గురువారం భారత కాన్సులేట్‌కు వెళ్లొద్దని ఇండో-కెనడియన్లకు ఒక ప్రకటనలో సూచించింది. భారత కాన్సులేట్ కెనడాలో గూఢచర్య నెట్‌వర్క్‌ను నడుపుతోందని, ఖలిస్థానీలపై నిఘా పెట్టిందని ఆ ప్రకటనలో ఆరోపించింది. దీనిపై కాన్సులేట్‌ను జవాబుదారీ చేయాలనే డిమాండుతో ఖలిస్థాన్ అనుకూలురైన సిక్కులు ఈ ముట్టడి నిర్వహించనున్నట్టు తెలిపింది. 'హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత ఏజంట్ల పాత్ర గురించి దర్యాప్తు జరుగుతోందని రెండేళ్ల క్రితమే నాటి ప్రధాని జస్టిన్ ట్రూడో పార్లమెంటుకు తెలిపారు. రెండేళ్లు దాటినా భారత కాన్సులేట్‌లు కెనడాలో గూఢచర్య నెట్‌వర్క్‌లను నడుపుతూనే ఉన్నాయి. ఖలిస్థాన్ ఉద్యమకారులపై నిఘా కొనసాగిస్తూనే ఉన్నాయి' అని ఆ ప్రకటనలో ఆరోపించింది. కెనడాలోని భారత నూతన రాయబారి దినేశ్ పట్నాయక్ లక్ష్యంగా ఆయన ఫొటోతో ఒక పోస్టరును కూడా విడుదల చేసింది. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత ఇరుదేశాల మధ్య రెండేళ్లుగా దెబ్బతిన్న సంబంధాల పునరుద్ధరణలో భాగంగా భారత్, కెనడా దేశాలు పరస్పరం కొత్తగా రాయబారులను నియమించుకొన్న వారం రోజులకే ఖలిస్థానీల నుంచి తాజా బెదిరింపులు రావడం గమనార్హం. 2023 జూన్‌లో వాంకోవర్‌లోని ఒక సిక్కు ఆలయం బయట ఇద్దరు సాయుధులు నిజ్జర్‌ను కాల్చిచంపారు. ఈ హత్యలో భారత ఏజెంట్ల పాత్ర ఉందని కెనడా ఆరోపించింది. నాటి భారత రాయబారితోపాటు అనేకమంది దౌత్యవేత్తలను దేశం నుంచి బహిష్కరించింది. కెనడా ఆరోపణలను తోసిపుచ్చిన భారత్ కూడా అంతే తీవ్రంగా స్పందించింది. కెనడా రాయబారి సహా ఆ దేశానికి చెందిన ఆరుగురు సీనియర్ దౌత్యవేత్తలను భారత్ నుంచి వెళ్లిపోవాలని ఆదేశించింది.

లోకం తీరు



భారత్‌పై దాడుల సూత్రధారి
మసూద్ అజహరే

పార్లమెంటుపై దాడి, ముంబయి పేలుళ్లు అతడి పనేనన్న జైషే కమాండర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: ఉగ్రవాదులు తమ భూభాగంలో లేరంటూ పాకిస్థాన్ చెబుతున్న మాటలు అబద్ధమని మరోసారి తేలింది. ఉగ్రవాద సంస్థ అయిన జైష్ ఎ మహమ్మద్‌లో కమాండర్‌గా పనిచేసిన మసూద్ ఇల్యాస్ కశ్మీరీ చెప్పిన దానిప్రకారం భారత్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉగ్రవాద కార్యకలాపాలకు రూపకల్పన పాకిస్థాన్‌లోనే జరిగింది. వెలుగులోకి వచ్చిన ఓ వీడియోలో ఇందుకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు ఉన్నాయి. దీని ప్రకారం జైష్ ఎ మహమ్మద్ సంస్థ అధిపతి మజూద్ అజహర్ భారత్‌పై జరిగిన ఉగ్రవాద దాడులకు ప్రణాళికలు రూపొందించాడు. అయిదేళ్లపాటు తిహాడ్ జైలులో శిక్ష అనుభవించిన అతడు అక్కడి నుంచి తప్పించుకొని పాక్‌కు పారిపోయాడు. బాలాకోట్‌లో స్థావరం ఏర్పాటు చేసుకొని ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించాడు. ఈ స్థావరంపైనే 2019లో భారత్ వైమానిక దాడులు చేయడం గమనార్హం. ఆ వీడియో ప్రకారం..ఇల్యాసీ మాట్లాడుతూ- "తిహాడ్ జైలు నుంచి తప్పించుకున్న మసూద్ అజహర్ పాకిస్థాన్ వచ్చాడు. తన విజన్, మిషన్, కార్యకలాపాలను అమలు చేయడానికి బాలాకోట్ నేల అతడికి ఆశ్రయం ఇచ్చింది. అక్కడ నుంచే ఢిల్లీ, ముంబయి దాడులకు ప్లాన్ చేశాడు. ఆ విధంగా ఆ దేశాన్ని భయపెట్టాడు' అని చెప్పడం అందులో ఉంది. భారత్ వ్యతిరేక ఉగ్రవాద కార్యకలాపాలకు బాలాకోట్ కేంద్రంగా మారిందన్న విషయాన్ని బహిరంగంగా వెల్లడించాడు. ఇదే సందర్భంగా ఒసామా బిన్ లాడెన్‌ను అమరవీరుడిగా కీర్తించాడు. పాక్ మిలటరీ శిక్షణలోనే ఉగ్రవాద స్థావరాలు పనిచేస్తున్నాయంటూ ఎప్పటి నుంచో భారత్ చెబుతున్న మాటలు నిజమని తేలింది.

నేపాల్ 'రెస్క్యూ' విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

గురువారం వారి వారి స్వస్థలాలకు తరలించనున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ విజయవంతంగా ముగియనున్నట్టు అధికారులు తెలిపారు. నేపాల్ నుంచి ఏపీ ప్రజలందరూ సురక్షితంగా వచ్చేయడంతో ఢిల్లీ ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను మూసివేస్తున్నారు. నేపాల్‌లో చిక్కుకున్న మొత్తం 361 మంది ఏపీ వాసులలో 275 మందిని ప్రభుత్వం ఇదివరకే స్వరాష్ట్రానికి తీసుకొచ్చి వారి స్వస్థలాలకు చేర్చింది. ఈ నెల 9న రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలు ప్రారంభించి, వారం రోజుల పాటు కొనసాగించింది. నేపాల్‌లో పరిస్థితి తీవ్రతను గుర్తించిన వెంటనే సీఎం చంద్రబాబు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు మంత్రి లోకేశ్ ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయించారు. ఈ మొత్తం ఆపరేషన్‌ను రియల్ టైమ్ గవర్నెన్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా లోకేశ్ వ్యక్తిగతంగా పర్యవేక్షించారు. నేపాల్ నుంచి ఏపీ ప్రజలను తీసుకువచ్చి విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, కర్నూలు, అనంతపురం, నంద్యాల తదితర ప్రాంతాల్లోని వారి ఇళ్లకు ప్రభుత్వం చేర్చింది.

మిథున్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వండి: సిట్ పిటిషన్

విజయవాడ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిని ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం మిథున్‌రెడ్డి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మద్యం కేసులో మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఆయన్ను కస్టడీకి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు.

నిజాం పాలనలో ఎన్నో దారుణాలు

హైదరాబాద్ విమోచన దినాన్ని గత పాలకులు పట్టించుకోలేదు

» మేం వచ్చాకే 'సెప్టెంబరు 17'ను అధికారికంగా ప్రకటించాం

» మధ్యప్రదేశ్‌లో సభలో ప్రధాని మోదీ

ధార్(మధ్యప్రదేశ్), సెప్టెంబరు 17: నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానంలో అనేక దారుణాలు జరిగాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. నిజాం పాలకుల చెర నుంచి హైదరాబాద్‌కు విముక్తి కల్పించడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలకపాత్ర పోషించారన్నారు. ఉక్కు మనిషి పటేల్ చొరవతోనే హైదరాబాద్ సంస్థానం భారత్‌లో భాగమైందని కొనియాడారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో ప్రధాని మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. "ఈ రోజు సెప్టెంబరు 17. ఇది మరో చరిత్రాత్మక దినం. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎంతో ధైర్యసాహసాలు చూపించి హైదరాబాద్‌ను దేశంలో విలీనం చేశారు. భారత సైన్యం నిజాం అకృత్యాల నుంచి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కల్పించింది. దానికి గుర్తుగా హైదరాబాద్ విమోచన దినం నిర్వహిస్తున్నాం" అని ప్రధాని చెప్పారు. ఇంతటి ఘన విజయాన్ని కొన్ని దశాబ్దాల పాటు జరుపుకోలేకపోయామంటూ ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వం వచ్చాకే సెప్టెంబరు 17ను హైదరాబాద్ విమోచన దినంగా అధికారికంగా ప్రకటించినట్లు చెప్పారు.

'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్' ప్రారంభం

తన పుట్టిన రోజునాడు మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తున్న ప్రధాని మోదీ.. 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్, రాష్ట్రీయ పోషణ్ మాహ్' కార్యక్రమాలను ప్రారంభించారు. మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం కోసం ఈ పథకాలను ప్రారంభించినట్లు తెలిపారు. వికసిత్ భారత్‌కు మహిళలు, యువత, పేదలు, రైతులు నాలుగు స్తంభాలని పేర్కొన్నారు. నారీ శక్తి దేశాభివృద్ధికి పునాది అన్నారు. పహల్గాం ఉగ్రదాడులను ప్రస్తావించిన మోదీ.. ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశామని చెప్పారు. అణుముప్పులకు నవ భారతం భయపడదన్నారు. 'స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్' అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈసీఐసీ బుధవారం నుంచి అక్టోబరు 2 వరకు దేశవ్యాప్తంగా తన అధీనంలోని 160 ఆస్పత్రుల్లో, 1600కు పైగా డిస్పెన్సరీల్లో మహిళల కోసం హెల్త్‌క్యాంప్‌లు నిర్వహించనుంది. ఈ క్యాంపుల్లో ఉచితంగా రోగనిర్ధారణ పరీక్షలు చేయనున్నారు.

మోదీకి శుభాకాంక్షల వెల్లువ

ప్రధాని మోదీకి 75 ఏళ్లు నిండడంతో పలువురు ప్రముఖులు, ప్రపంచ నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వ లక్షణాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా 15 రోజుల పాటు పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేందుకు బీజేపీ నిర్ణయించింది. ఉన్నత లక్ష్యాలు సాధించేలా దేశాన్ని మలిచారని ప్రధానిని ప్రశంసిస్తూ రాష్ట్రపతి ముర్ము జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఖర్గే, రాహుల్ గాంధీ కూడా శుభాకాంక్షలు తెలిపారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్, శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిశ నాయకే తదితరులు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు.



ధార్‌లో పసిపాపతో ఆడుకుంటున్న మోదీ

మోదీ బాల్యంపై పాఠశాలల్లో సినిమా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: మోదీ బాల్యంలో జరిగిన ఘటనల ఆధారంగా రూపొందిన 'చలో జీతే హై' చిత్రాన్ని బడుల్లో ప్రదర్శించనున్నారు. ఈ సినిమా ప్రదర్శనపై అనుబంధ పాఠశాలలకు తగిన ఆదేశాలు జారీ చేయాలని సీబీఎస్ఈ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి (ఎన్‌వీఎస్) ఉన్నతాధికారులకు కేంద్ర విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ అర్చనా శర్మ అవస్థీ ఇటీవల లేఖలు రాశారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వం, బాధ్యత, సేవా గుణాలను పెంపొందించే దిశగా ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, 32 నిమిషాల నిడివితో 2018లో విడుదలైన ఈ చిత్రం 2019లో బెస్ట్ నాన్-ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో జాతీయ అవార్డు కైవసం చేసుకుంది.

ఈవీఎంపై అభ్యర్థుల కలర్ ఫొటోలు

» ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకతకు ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓటింగ్ ప్రక్రియలో మరింత పారదర్శకతను తెచ్చేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. బిహార్ ఎన్నికల నేపథ్యంలో ఎస్ఐఆర్, ఓట్ల చోరీ వంటి ఆరోపణలవేళ ఓటింగ్ విధానంలో ఎలక్షన్ కమిషన్ కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల (ఈవీఎం) బ్యాలెట్ పేపర్లు, అభ్యర్థి ఫొటో స్పష్టంగా ఉండేలా కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. వీటిని బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈమేరకు అన్ని రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల ప్రధానాధికారు(సీఈవో)లకు లేఖలు రాసింది. ఈవీఎం బ్యాలెట్ పేపర్ల రూపకల్పన, ముద్రణలో స్పష్టత, అందరికీ కనిపించేలా, స్పష్టంగా చదవగలిగేలా మార్గదర్శకాలను సవరించినట్టు ఈసీఐ పేర్కొంది. నోటాతో సహా అభ్యర్థులందరి పేర్లు ఒకే రకమైన ఫాంట్‌లో ఓటర్లు సులభంగా చదవగలిగేలా తగినంత పెద్ద ఫాంట్ సైజులో ముద్రించనున్నట్లు స్పష్టం చేసింది. బిహార్ ఎన్నికల నుంచే రంగు ఫొటోలు, పెద్ద ఫాంట్‌తో ఈవీఎం బ్యాలెట్ పేపర్లకు శ్రీకారం చుట్టనున్నట్టు తెలిపింది.

ప్రధాన మార్పులు ఇవే..

- **కలర్ ఫొటోలు:** ఇకపై ఈవీఎం బ్యాలెట్ పత్రంపై అభ్యర్థుల ఫొటోలు నలుపు, తెలుపు రంగులో కాకుండా కలర్‌లో ప్రింట్ చేస్తారు. ఫొటోలో మూడు వంతుల భాగం అభ్యర్థి ముఖం స్పష్టంగా కనిపించేలా ముద్రిస్తారు.
- **పెద్ద సీరియల్ నంబర్లు:** అభ్యర్థుల సీరియల్ నంబర్లు, నోటా గుర్తును పెద్దగా, స్పష్టంగా కనిపించేలా బోల్డ్ అక్షరాలతో (30 ఫాంట్ సైజు) ముద్రిస్తారు.
- **ఒకే రకమైన ఫాంట్:** అభ్యర్థులందరి పేర్లు, నోటా ఆప్షన్‌ను సులభంగా చదవగలిగేలా ఒకే రకమైన పెద్ద ఫాంట్‌లో ఉంటాయి.

త్వరలో బీసీ చట్టానికి తుది రూపం

» స్థానిక ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు

» కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు

» బీసీ మంత్రుల సమావేశంలో నిర్ణయం

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు మంత్రి లోకేశ్ చేసిన యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు త్వరలో బీసీ చట్టానికి తుదిరూపం తీసుకురానున్నట్లు మంత్రి సవిత తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అమరావతి సచివాలయంలో మంత్రి సవిత నేతృత్వంలో బీసీ మంత్రులు సహా హోంమంత్రి అనిత, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ బుధవారం భేటీ అయ్యారు. అనంతరం మంత్రి సవిత మీడియాతో మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీల అభ్యున్నతికి పాటుపడుతోందన్నారు. బీసీలను అన్ని రంగాల్లో ముందంజలో నిలపడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. 2025-26 బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.47 వేల కోట్లకుపైగా కేటాయించారని చెప్పారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 'బీసీ రక్షణ చట్టం' రూపకల్పనకు నిర్ణయించినట్టు తెలిపారు. బీసీలు ఆత్మగౌరవంతో జీవించడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. గత జగన్ ప్రభుత్వం బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేసిందని తెలిపారు. వేలాది మందిపై తప్పుడు కేసులు పెట్టడమే కాకుండా, కుటుంబాలపై దాడులు చేశారని, ఆస్తులు కూడా ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నేతలు అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు వంటివారిపై తప్పుడు కేసులు పెట్టారన్నారు. బీసీలు దశాబ్దాలుగా అనుభవిస్తున్న 34శాతం రిజర్వేషన్లను 24శాతానికి కుదించారని తెలిపారు. 'యువగళం' పాదయాత్రలో బీసీల రక్షణకు చట్టం చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారని, బీసీలు గౌరవ ప్రదమైన జీవనం సాగించడమే లక్ష్యంగా బీసీ రక్షణ చట్టం తెస్తున్నామని చెప్పారు. త్వరలోనే కార్పొరేషన్ల రుణాలను పునరుద్ధరిస్తామన్నారు. కాగా, మంత్రి సవిత ఆధ్వర్యంలో జరిగిన బీసీ మంత్రుల సమావేశం సుదీర్ఘంగా సాగింది.

శ్రీవారి ఆర్జిత సేవల డిసెంబరు కోటా నేడు విడుదల

తిరుమల, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జిత సేవల డిసెంబరు నెల కోటాను టీటీడీ ఆన్‌లైన్ ద్వారా గురువారం ఉదయం 10 గంటలకు విడుదల చేయనుంది. ఈసేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు భక్తులు నమోదు చేసుకోవచ్చు. అంగప్రదక్షిణ టోకెన్లు కూడా ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా కేటాయించనున్నారు. ఈ టికెట్లు, టోకెన్లను పొంది..సెప్టెంబరు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నాం 12 గంటలలోపు సొమ్ము చెల్లించినవారికి డిప్ ద్వారా టికెట్లు మంజూరు చేస్తారు. ఇక, 22వ తేదీ ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను విడుదల చేయనున్నారు. మధ్యాహ్నాం 3 గంటలకు వర్చువల్ సేవలకు కూడా కేటాయిస్తారు.



సీఎంకు శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రండి

» సీఎంకు టీటీడీ చైర్మన్, ఈవో ఆహ్వానం

తిరుమల, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్న తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును టీటీడీ ఆహ్వానించింది. బుధవారం ఉదయం వెలగపూడిలోని క్యాంపు కార్యాలయంలో సీఎంను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యురాలు జానకిదేవి కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భం గా సీఎంకు శ్రీవారి తీర్థప్రసాదాలు అందించారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను ముఖ్యమంత్రికి వివరించారు.

రాష్ట్రంలో పనిచేస్తున్న 309 మంది పాలిటెక్నిక్ కాంట్రాక్టు లెక్చరర్లకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకి కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. తమకు న్యాయం చేసే విధంగా పోస్టులను మినహాయించి మిగిలిన పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేసుకునేలా పాలసీ నిర్ణయం తీసుకోవాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

నేడు సీమ, దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ, దక్షిణ కోస్తా మీదుగా బంగాళాఖాతం వరకూ, దక్షిణ కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకూ వేర్వేరుగా ఉపరితల ద్రోణులు విస్తరించాయి. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఎండ తీవ్రత కొనసాగడంతో వాతావరణ అనిశ్చితి నెలకొంది. ఈ ప్రభావంతో బుధవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. ప్రకాశం జిల్లా ఒంగోలులో 6.4, ఉమ్మడి చిత్తూరు జిల్లా నిండ్రలో 5.9, కె.ఉప్పలపాడులో 5.3, వేములపాడులో 4.7, చిలకపాడులో 4.5, విజయనగరం జిల్లా రాజాంలో 4, కాకినాడలో 3.9 సెంటీమీటర్ల వాన పడింది. రానున్న 24 గంటల్లో రాయలసీమలో అనేకచోట్ల, కోస్తాలో పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని, రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, గురువారం రాష్ట్రంలో అక్కడక్కడ పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఒకటీరెండు చోట్ల, అలాగే కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, ఈనెల 22న లేదా 23న ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించనుందని, అది అల్పపీడనంగా మారుతుందా? లేదా? అనేది రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని ఇస్రో వాతావరణ నిపుణుడు ఒకరు తెలిపారు. ఈనెల 26న లేదా 27న మధ్య బంగాళాఖాతంలో ఇంకో ఉపరితల ఆవర్తనం ఆవరించనుందన్నారు. ఇది బలపడే అవకాశం ఉందని అంచనా వేశారు.

మావోయిస్టుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

» దీన్ని కేంద్ర ప్రభుత్వం తన విజయంగా చెప్పుకోవడం విడ్డూరం

» పెళ్లి చేసుకుని కాపురం చేయనన్న చందంగాకేసీఆర్, జగన్‌ల తీరు: నారాయణ

గుంటూరు(తూర్పు), సత్తెనపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆయుధాలను వదిలి సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ పాటించాలనే మావోయిస్టుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు సీపీఐ జాతీయ కార్యదర్శి కే. నారాయణ అన్నారు. గుంటూ రు, సత్తెనపల్లిలో జరిగిన విలేకరుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. శాంతి చర్చలకు కోసమే తీసుకున్న ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వ విజయంగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో స్పష్టమైన వైఖరి ఉన్న నక్సలైట్లును టెర్రరిస్టులతో పోలుస్తున్న మోదీ, అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. గిరిజనులను బెదిరించి సహజవనరులను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం కుటిల రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగబద్ధంగా బీసీలకు 42 శాతం సీట్లు ఇవ్వాలని, ఇది విజయవంతం అయ్యేందుకు సీపీఐ ఉద్యమాన్ని చేపడుతుందన్నారు. చండీగఢ్‌లో 21 నుంచి 25 వరకు జరిగే జాతీయ మహాసభల్లో అనేక అంశాలను చర్చించనున్నట్టు తెలిపారు. కేసీఆర్, జగన్‌లు అసెంబ్లీకి వెళ్లక పోవడం పెళ్లి చేసుకుని కాపురం చేయననే చందాగా ఉందని ఎద్దేవాచేశారు. శాసన సభ్యులుగా ప్రమాణం చేసి అసెంబ్లీకి వెళ్లకుండా ఎమ్మెల్యే రాయితీలు, జీతాలు, డీఏలు తీసుకుంటున్నారని విమర్శించారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కావాలంటే ఒక లెక్క ఉంటుందని, దాని ప్రకారం మాత్రమే హోదా ఇస్తారన్నారు.

సీపీఎస్ రద్దుపై అసెంబ్లీలో చర్చించాలి: ఏపీసీపీఎస్ఈఏ

విజయవాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ రద్దు గురించి గురువారం నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ఏపీ సీపీఎస్ఈఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరీమీ రాజేశ్వర రావు బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దుకు కావాల్సిన చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref:B1/78/2025 | ఫారం నెం.VI (ఎ) | Dt.17.09.2025

(2013, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ (19) సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం, జగన్నాథపురం గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద వర రామచంద్రపురం మండలం, కొప్పల్లి గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునస్థాపనల క్రింద, వారికి భూమిని కేటాయించు నిమిత్తము భూమి అవసరమైనట్లు శ్రీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మరియు ఆర్ అండ్ ఆర్ ఆఫీసర్, చింతూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా వారు భావించినందున 2013 భూసేకరణ పునరావాసం,పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలనుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఏ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం.జె-12011/74/2005-1ఎ1, తేది.25.10.2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43 (1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పునస్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది.10.05.2020వ తేదిన జారీ చేసిన జి.ఓ.యం.యస్. నెం.42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు, వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4)ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు / ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా కలెక్టర్ / ప్రత్యేక కలెక్టర్, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : ఏలూరు | మండలం : జీలుగుమిల్లి | గ్రామం : జగన్నాథపురం

వరుస సంఖ్య	సర్వే నంబరు	భూమి తరగతి	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు (తండ్రి/భర్త పేరు)	హద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు, నిర్మాణాలు, మొదలైనవి ఏమైనా ఉంటే వాటి వివరాలు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	2-1	జి.డి.	0.48	0.48	వీరంకి వెంకటేశ్వరరావు తండ్రి: సూరన్న	SY NO. 4	SY NO. 1	Veerenki Mutyam Land	R&B Road	
2	2-1B	జి.డి.	0.49	0.49	వీరంకి వీర్రాజు తండ్రి: సూరన్న					
3	2-1C	జి.డి.	0.49	0.49	వీరంకి వీరభద్రుడు తండ్రి: సూరన్న					
4	4	జి.డి.	4.10	4.10	శ్రీగల జగదేశ్వర రావు తండ్రి: రామచంద్ర రావు	SY NO. 6	Veerenki Veera Babu Land	SYNO.4 Srigala raghavendra rao Land	R&B Road	జీడిమామిడి-266 గుమ్మడి -1 కొబ్బరి -1
5	5	జి.డి.	1.23	1.23	శ్రీగల జగదేశ్వర రావు తండ్రి: రామచంద్ర రావు					
6	4	జి.డి.	2.05	2.05	శ్రీగల రాజేశ్వరరావు తండ్రి: చిన్నప్పరావు	Uddhavarapu Suri Babu Land	SYNO.4 Srigala raghavendra Rao Land	SYNO.4 Srigala nageswara Rao Land	SYNO.4 Srigala jagadeswara Rao Land	
7	5	జి.డి.	0.62	0.62	శ్రీగల రాజేశ్వరరావు తండ్రి: చిన్నప్పరావు					
8	4	జి.డి.	2.05	2.05	శ్రీగల రాఘవేంద్రరావు తండ్రి: చిన్నప్పరావు	SYNO.4 Srigala Rajeswara Rao Land	Veerenki Mutyam Land	SYNO.4 Srigala Satyanarayana Land	SYNO.4 Srigala jagadeswara Rao Land	మామిడి -1
9	5	జి.డి.	0.61	0.61	శ్రీగల రాఘవేంద్రరావు తండ్రి: చిన్నప్పరావు					
10	4	జి.డి.	1.36	1.36	శ్రీగల నాగేశ్వరరావు తండ్రి: పెద్ద అప్పారావు	SYNO. 6	SYNO. 4	ROAD	SYNO. 5 Srigala Rajeswara Rao	
11	5	జి.డి.	0.41	0.41	శ్రీగల నాగేశ్వరరావు తండ్రి: పెద్ద అప్పారావు					
12	4	జి.డి.	1.37	1.37	శ్రీగల సత్యనారాయణ తండ్రి: పెద్ద అప్పారావు	SYNO. 5 Srigala nageswara Rao	Veerenki Chenes warao Land	Sarupalli Gopala Krishnam Raju Land	SYNO.4 Srigala Raghavendra Rao	జీడిమామిడి -140
13	5	జి.డి.	0.41	0.41	శ్రీగల సత్యనారాయణ తండ్రి: పెద్ద అప్పారావు					
14	4	జి.డి.	1.37	1.37	శ్రీగల వాసవి తండ్రి: రామచంద్రరావు	SYNO. 5 Srigala nageswara Rao Land	SYNO.4 Srigala Satyanarayana Land	ROAD	SYNO.4 Srigala Raghavendra Rao	జీడిమామిడి -100
15	5	జి.డి.	0.41	0.41	శ్రీగల వాసవి తండ్రి: రామచంద్రరావు					
16	9	జి.డి.	0.15	0.15	శ్రీగల జగదేశ్వర రావు తండ్రి: రామచంద్ర రావు	V.No.34 Puchika Padu	R&B Road	SY NO. 8	R&B Road	టేకు -3
17	9	జి.డి.	0.07	0.07	శ్రీగల రాజేశ్వరరావు తండ్రి: చిన్నప్పరావు	V.No.34 Puchika Padu	R&B Road	SY NO. 8	R&B Road	టేకు -3
18	9	జి.డి.	0.08	0.08	శ్రీగల రాఘవేంద్రరావు తండ్రి: చిన్నప్పరావు	V.No.34 Puchika Padu	R&B Road	SY NO. 8	R&B Road	టేకు -3
19	9	జి.డి.	0.05	0.05	శ్రీగల నాగేశ్వరరావు తండ్రి: పెద్ద అప్పారావు	V.No.34 Puchika Padu	R&B Road	SY NO. 8	R&B Road	టేకు -3
20	9	జి.డి.	0.05	0.05	శ్రీగల సత్యనారాయణ తండ్రి: పెద్ద అప్పారావు	V.No.34 Puchika Padu	R&B Road	SY NO. 8	R&B Road	టేకు -3
21	9	జి.డి.	0.05	0.05	శ్రీగల వాసవి తండ్రి: రామచంద్రరావు	V.No.34 Puchika Padu	R&B Road	SY NO. 8	R&B Road	టేకు -3
22	10	జి.డి.	2.04	2.04	శ్రీగల వీరభద్రరావు తండ్రి: పెద్ద అప్పారావు	SY NO.10 Srigala Ragavendra Rao	SY NO. 12	R&B Road	SY NO. 26	తాడి -25
23	10	జి.డి.	1.02	1.02	శ్రీగల రాజేశ్వరరావు తండ్రి: చిన్నప్పరావు	SY NO.10 Srigala Jagadeswara Rao	SY NO.10 Veera Bhadra Rao	R&B Road	SY NO. 27	తాడి -12
24	10	జి.డి.	2.03	2.03	శ్రీగల జగదేశ్వర రావు తండ్రి: రామచంద్ర రావు	Veerenki Chenesra Rao Land	SY NO.10 Ragavendra Rao	R&B Road	SY NO. 27	టేకు-3, తాడి-4
25	10	జి.డి.	1.01	1.01	శ్రీగల రాఘవేంద్రరావు తండ్రి: చిన్నప్పరావు	SY NO.10 Srigala Jagadeswara Rao	SY NO.10 Veera Bhadra Rao	R&B Road	SY NO. 27	తాడి -13
26	12	జి.డి.	1.69	1.69	అక్కినపల్లి అచ్చమ్మ భర్త: వెంకట రత్నం	SY NO. 10	Grama kantam	R&B Road	Mango rees	వేప -1
27	14-1	జి.డి.	3.21	3.21	సరిపల్లి రాజ్యల రాజు తండ్రి: జానకి రామరాజు	SY NO. 14/2	SY NO. 14/1	SY NO. 14/1	Korri Mukaiah Land	ఫెన్సింగ్, టేకు-50, మామిడి-220, జీడి మామిడి-40, వేప-3, పనస-1, నేరేడు-1, రోజ్‌వుడ్-4, వెదురు-20, తాడి-2
28	14-1	జి.డి.	3.00	3.00	సరిపల్లి వెంకట లక్ష్మి సత్యనారాయణరాజు తండ్రి: జానకి రామరాజు	SY NO. 14/2	SY NO. 16	SY NO. 15 & R&B Road	SY NO. 14/1	ఫెన్సింగ్, టేకు-42, మామిడి-200, జీడిమామిడి-40,వేప-2, పనస-1, నేరేడు-1, రోజ్‌వుడ్-7,వెదురు-20, తాడి-2, కొబ్బరి-3, సింధుగా-1, మునగ-1జామ-2
29	14-1	జి.డి.	3.11	3.11	సరిపల్లి సుందర రామ రాజు తండ్రి : రామలింగ రాజు	SY NO. 14/2	SY NO. 14/1	SY NO. 14/1	Thodam Munnaiah Land	
30	14-1A	జి.డి.	1.00	1.00	సరిపల్లి సుందర రామ రాజు తండ్రి : రామలింగ రాజు	SY NO. 14/2	SY NO. 14/1	SY NO. 14/1	Thodam Munnaiah Land	
31	18	జి.డి.	5.17	5.17	సరిపల్లి శ్రీనివాస రాజు తండ్రి: వెంకట సోమరాజు	SY NO. 26/2	SY NO. 19	SY NO. 17	SY NO. 26/1	
32	26-2A	జి.డి.	1.04	1.04	సరిపల్లి శ్రీనివాస రాజు తండ్రి: వెంకట సోమరాజు	SY NO. 14/1	SY NO. 18	SY NO. 14/1	SY NO. 26/5	
33	26-2	జి.డి.	2.10	2.10	సరిపల్లి సుందర రామ రాజు, తండ్రి: రామ లింగరాజు	SY NO. 14/1	SY NO. 18	SY NO. 14/1	SY NO. 25/5	
	మొత్తం విస్తీర్ణం		44.32	44.32						

డి.చంద్రశేఖర్
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు

సం/- యస్. సరళావందనం
భూసేకరణాధికారి మరియు స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref:B1/82/2025 | ఫారం నెం.VI (ఎ) | Dt.17.09.2025

(2013, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ (19) సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం, వీరంపాలెం గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద వర రామచంద్రపురం మండలం, కొప్పల్లి గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునస్థాపనల క్రింద, వారికి భూమిని కేటాయించు నిమిత్తము భూమి అవసరమైనట్లు శ్రీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మరియు ఆర్ అండ్ ఆర్ ఆఫీసర్, చింతూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా వారు భావించినందున 2013 భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలనుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఏ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం.జె-12011/74/2005-1ఎ1, తేది.25.10.2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43 (1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పునస్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది.10.05.2020వ తేదిన జారీ చేసిన జి.ఓ.యం.యస్. నెం.42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు, వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4)ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు / ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా కలెక్టర్ / ప్రత్యేక కలెక్టర్, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : ఏలూరు | మండలం : జీలుగుమిల్లి | గ్రామం : వీరంపాలెం

వరుస సంఖ్య	సర్వే నంబరు	భూమి తరగతి	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు (తండ్రి/భర్త పేరు)	హద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు, నిర్మాణాలు, మొదలైనవి ఏమైనా ఉంటే వాటి వివరాలు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	6-2A	జి.డి.	1.38	1.38	దాసరి ఉమా శంకర రావు	Dasari Satyanarayana Land	Dasari Srinivas Rao Land	Thandri Satyanarayna	Dasari Basavayya	
2	10-1	జి.డి.	2.42	2.42	దాసరి బసవయ్య	Dasari Satyanarayana Land	Kovvasi Ramesh Land	Dasari Prasanth Land	Midiyam Gangulu Land	
3	10-2	జి.డి.	3.72	3.72	దాసరి బసవయ్య	Dasari Satyanarayana Land	Kovvasi Ramesh Land	Dasari Prasanth Land	Midiyam Gangulu Land	
4	9-2	జి.డి.	1.92	1.92	దాసరి బసవయ్య	Dasari Satyanarayana Land	Thandri Narayana Land	AWD Land	Dasari Basavayya Land	
5	14-4B1	జి.డి.	1.50	1.50	దాసరి బసవయ్య	Dasari Basavayya Cheruvu	Dasari Satyanarayana Land	Dasari Srinivas Rao Land	Badiga Jahnshi Rani Land	
6	6-2A	జి.డి.	1.74	1.74	దాసరి బసవయ్య	Thota Surya Pavani Land	Dasari Basavayya Cheruvu	Dasari Pallavi Land	Dasari Satyanarayana Land	తాడి-1
7	6-2B	జి.డి.	0.80	0.80	దాసరి బసవయ్య	Thota Surya Pavani Land	Dasari Basavayya Cheruvu	Mallareddy Vara Prasad Land	Dasari Pallavi Land	
8	12-1	జి.డి.	0.12	0.12	బాడిగ ఝాన్సీరాణి	Dasari Basavayya Cheruvu	Dasari Prasanth Land	Dasari Srinivas Rao Land	Badiga Jahnshi Rani Land	వేప-1, తాడి-1
9	12-2	జి.డి.	0.46	0.46	బాడిగ ఝాన్సీరాణి					
10	13	జి.డి.	0.24	0.24	బాడిగ ఝాన్సీరాణి					
11	14-2	జి.డి.	3.31	3.31	బాడిగ ఝాన్సీరాణి	Thaati Paramesh Land	Dasari Satyanarayana Land	Badiga Jahnshi Rani Land	Dasari Basavayya	
12	14-4A	జి.డి.	3.42	3.42	బాడిగ ఝాన్సీరాణి	Dasari Basavayya Cheruvu	Dasari Satyanarayana Land	Dasari Srinivas Rao Land	Badiga Jahnshi Rani Land	టేకు-15
13	14-4B1	జి.డి.	1.85	1.85	బాడిగ ఝాన్సీరాణి	Dasari Basavayya Cheruvu	Badiga Jahnshi Rani Land	Dasari Srinivas Rao Land	Dasari Satyanarayana Land	
14	6-1A	జి.డి.	0.88	0.88	దాసరి శ్రీనివాసరావు	Dasari Prasanth Land	Thandri Nageswarao Land	Mallaredy Vara Prasad Land	Korri Venkappa Land	
15	14-4B2	జి.డి.	0.50	0.50	తోట సూర్య పావని కుమారి	Thaati Laxmanudu Land	Kovvasi Ramesh Land	Dasari Basavayya Land	Paida Venkatarao Land	
16	7-1A	జి.డి.	1.26	1.26	తోట సూర్య పావని కుమారి	Dasari Srinivas Rao Land	Dasari Pallavi Land	Dasari Satyanarayana Land	Dasari Prasanth Land	పామాయిల్ - 12, ఫెన్సింగ్
17	7-1B	జి.డి.	0.83	0.83	తోట సూర్య పావని కుమారి					
18	14-1	జి.డి.	1.34	1.34	దాసరి సత్యనారాయణ	Badiga Jahnshi Rani Land	Dasari Basavayya	Dasari Prasanth Land	Kovvasi Ramesh Land	మర్రి-1
19	9-1	జి.డి.	1.92	1.92	దాసరి శ్రీనివాసరావు	Dasari Satyanarayana Land	Thandri Nageswarao Land	AWD Land	Dasari Basavayya	
20	6-1B	జి.డి.	0.83	0.83	దాసరి పల్లవి	Dasari Satyanarayana Land	Dasari Srinivas Rao Land	Thandri Satyanarayana	Dasari Basavayya	
21	6-2B	జి.డి.	1.00	1.00	దాసరి పల్లవి	Dasari Satyanarayana Land	Dasari Srinivas Rao Land	Thandri Satyanarayana	Dasari Basavayya	
22	7-3	జి.డి.	0.26	0.26	దాసరి పల్లవి	Dasari Satyanarayana Land	Dasari Srinivas Rao Land	Thandri Satyanarayana	Dasari Basavayya	
	మొత్తం విస్తీర్ణం		31.70	31.70						

డి.చంద్రశేఖర్
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు

సం/- యస్. సరళావందనం
భూసేకరణాధికారి మరియు స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మధ్యేమార్గం

వక్ఫ్ సవరణ చట్టమే దురుద్దేశపూరితమైనది కనుక, ఓ మూడు నిబంధనలను సర్వోన్నతన్యాయస్థానం నిలిపివేసినంతమాత్రాన సంతోషించాల్సిందేమీ లేదని మైనారిటీ నేతల అభిప్రాయం. కుట్రపూరిత ఆలోచనలూ లక్ష్యాలతో తయారైన చట్టాన్ని సమూలంగా కొట్టివేయాల్సి ఉండగా, చిన్నపాటి సవరణలతో దానిని మొత్తంగా అనుమతించిన సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు మైనారిటీలకు ఏ మాత్రం ఉపశమనాన్ని కల్పించలేదని వారి బాధ. వక్ఫ్ స్ఫూర్తికి పూర్తిభిన్నంగా, ఆ ఆశయాలను వమ్ముచేస్తూ పలు వివాదాస్పద ప్రతిపాదనలను గుదిగుచ్చిన ఈ చట్టాన్ని సుప్రీంకోర్టు సరేననడం సరికాదంటున్నారు వారు. ఇది రాజీమార్గం కాదు, కీలక నిబంధనలను కాదంటూ మిగతా చట్టాన్ని అనుమతించడం ద్వారా సుప్రీంకోర్టు మధ్యేమార్గాన్ని ఎంచుకొని మంచిపనిచేసిందని మిగతావారంటున్నారు. ఇది మా విజయం అని పాలకులు కూడా సంబరపడుతున్నందున అసలు విజేతలు ఎవరో, న్యాయం ఎవరికి దక్కిందో ఒక పట్టాన అర్థంకాదు.

అంతిమతీర్పు మిగిలే ఉంది. ఇంతలోగా ఆ కొన్ని ఆదేశాలు తాత్కాలిక ఉపశమనం. ఇది ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ అని విపక్షాలు అంటున్నాయి. ముస్లిం ధార్మిక సంస్థల నిర్వహణను, వాటి మీద ప్రభుత్వపెత్తనాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించిందని అంటున్నాయి. ఏది వక్ఫ్ ఆస్తి, ఏది కాదన్నది నిర్ణయించే అధికారం కలెక్టర్‌కు లేదని తేల్చేయడం పిటిషన్‌దారులకు పెద్ద ఉపశమనం. తరతరాలుగా వాడుకలో ఉన్న వక్ఫ్ ఆస్తిని జిల్లా కలెక్టర్ కాదని నిర్ధారించడంతోనే అది తన స్వరూపస్వభావాలు కోల్పోయే ప్రమాదాన్ని కోర్టు నివారించింది. ఆస్తులపై వివాదాలు ఎందుకు రేగుతాయో తెలిసిందే కనుక, తగువు తీర్చడానికి సిద్ధపడిన కలెక్టర్ ఏ మేరకు న్యాయం చేయగలుగుతారో ఊహించవచ్చు. అంతిమనిర్ణయాన్ని అటుంచితే, వివాదం రేగిన మరుక్షణం నుంచే అది వక్ఫ్ ఆస్తికాకపోవడం వంటి ప్రమాదకరమైన అంశాలు సైతం ఈ నిబంధనలో ఉన్నాయి. వక్ఫ్ ఆస్తిగా గుర్తించడానికి వాంగ్మూలాలు, దశాబ్దాల వినియోగం, చారిత్రక ఆధారాలు కాక, సర్వేలు, రికార్డులు, లిఖితపూర్వక దస్తావేజులు ఉండాల్సిందేనని కొత్త నిబంధనలు రాసుకున్నాక కలెక్టర్ తీర్పు ఊహకు అందనిదేమీ కాదు. అత్యధికశాతం వక్ఫ్ ఆస్తులు దురాక్రమణలోనో, వివాదంలోనో ఉన్నప్పుడు నిజనిర్ధారణ జరగాల్సిందే కానీ, కలెక్టర్ న్యాయాధికారి కాకూడదన్నది సుప్రీం అభిప్రాయం. ట్రిబ్యునళ్ళలోనూ, కోర్టుల్లోనూ తేలాల్సిన వ్యవహారాన్ని కార్యనిర్వాహకవర్గం తన చేతుల్లోకి తీసుకోవడం కోర్టుకు నచ్చలేదు. ఐదేళ్ళుగా ఇస్లాంను ఆచరిస్తున్నవారే ఆస్తుల దానానికి అర్హులన్న నిబంధన కూడా ఇటువంటిదే. ఆచరణ అంటే ఏమిటో, ఎవరు ఎలా అందుకు అర్హులవుతారో చట్టం చెప్పలేదు కనుక, తమ ఆస్తిని ఎలా ఉపయోగించాలో నిర్ణయించుకొనే రాజ్యాంగ హక్కు, అధికారం పౌరులకు ఉన్నందున ప్రభుత్వాలు ఈ అంశాన్ని తేల్చేంతవరకూ దీనిని కూడా కోర్టు నిలిపివేసింది.

ఆస్తి నిర్వచనం నుంచి, వక్ఫ్‌బోర్డుల అధికారాలు, ట్రిబ్యునళ్ళ నిర్ణయాలను తిరగదోడటం వరకూ ప్రతీ అంశాన్నీ తన చేతుల్లోకి తీసుకొని వక్ఫ్ ఆస్తులపై పూర్తిపెత్తనం సాధించాలన్న లక్ష్యంతో ఈ చట్టం తయారైందన్నది ప్రధాన ఆరోపణ. వక్ఫ్ సంస్థల్లోకి ముస్లిమేతరులను ప్రవేశపెట్టడం అందుకు మార్గం సుగమం చేస్తుందన్న భయాలు నెలకొన్న తరుణంలో ఆ ప్రయత్నానికి సుప్రీంకోర్టు ముకుతాడు వేసింది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లోని 22 మంది సభ్యుల్లో నలుగురు, స్టేట్ బోర్డుల్లోని 11 మందిలో ముగ్గురు మాత్రమే అన్యమతస్థులను కోర్టు అనుమతించింది. అయితే, ముస్లిమేతర మతాలకు చెందిన ఆధ్యాత్మిక, ధార్మిక సంస్థల్లో ముస్లింలకు చోటులేనప్పుడు, కేవలం వక్ఫ్‌బోర్డుల్లో అన్యమతస్థులు ఎందుకు అని ప్రశ్నిస్తున్నవారికి ఈ వెసులుబాటు నచ్చకపోవడం సహజం, సముచితం. కొత్త వక్ఫ్‌చట్టం రాజ్యాంగ విహితమైనదో కాదో తేల్చేవరకూ ఈ మధ్యంతర ఉత్తర్వుల ద్వారా సర్వోన్నత న్యాయస్థానం పాలకుల దూకుడుకు కాస్తంత అడ్డుకట్టవేసింది. మిగతా కీలక నిబంధనలన్నింటినీ అనుమతించినందున కోర్టు తీర్పు తమకు అనుకూలంగా ఉన్నదని ప్రభుత్వం భావించడంలో తప్పులేదు. వక్ఫ్‌భూముల వివాదాలను, దురాక్రమణలను పరిష్కరించి, నిర్వహణను చక్కదిద్దాలని అందరూ కోరుకుంటున్నదే. కానీ, ముస్లిం పెద్దలు, పర్సనల్ లాబోర్డుతోనే కాదు, కనీసం విపక్షాలతో కూడా సంప్రదింపులు జరపకుండా, చట్టసభలో విస్తృతచర్చ లేకుండా దానిని ముందుకు తోయడం సరికాదు. సర్వోన్నత న్యాయస్థానం అంతిమంగా ఏమి చెబుతుందన్నది అటుంచితే, ఏకాభిప్రాయ సాధనకు ఇంకా సమయం మించిపోలేదు.

ప్రజల హక్కులు గౌరవిస్తేనే సుస్థిరత

ఇటీవల కాలంలో మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్, మయన్మార్, శ్రీలంక, పాకిస్థాన్ వంటి దేశాలలో అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా నేపాల్‌లో ప్రజల తీవ్ర ఆందోళనల మధ్య ఆ దేశ ప్రధానమంత్రి రాజీనామా చేయవలసి వచ్చింది. దానికంటే ముందు బంగ్లాదేశ్‌లో కూడా అలాంటి ఆందోళనల మధ్య ఆ దేశ ప్రధాని రాజీనామా చేసి, భారతదేశంలో తలదాచుకోవాల్సి వచ్చింది. కొన్ని సందర్భాలలో ఆందోళనలు అరాచకరూపం కూడా తీసుకున్నాయి. ఈ ఆందోళనల వెనక ఉన్న ప్రధానమైన కారణం ఆ దేశ ప్రజల సమస్యలు పెరగడం, వాటిని పరిష్కారం చేయకపోగా, ఆయా పాలకులు ప్రజల అసంతృప్తిని అణచివేయడానికి చేసే ప్రయత్నాలే ప్రధానంగా కనపడతాయి.

> ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని బలవంతంగా అణచివేయడం ఎల్లకాలమూ సాధ్యం కాదని మన ఇరుగు పొరుగు దేశాల అనుభవాలు తేటతెల్లం చేస్తున్నాయి. ప్రజానుకూల విధానాలను అవలంబించడంతో పాటు, ప్రజల అన్ని ప్రజాస్వామ్య హక్కులను గౌరవించి, రాజ్యాంగ విలువలను పరిరక్షించాలి. అయితే మన పాలకులు విచిత్రంగా ఆ రెండూ చేయడం లేదు.

నేపాల్‌లో వాస్తవంగా గత దశాబ్దంన్నర కాలంలో చాలా చైతన్యవంతమైన మార్పులు చోటు చేసుకున్నాయి. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్యం వైపుగా ఆ దేశం అడుగులు వేసింది. సాయుధ పోరాట మార్గాన్ని వదిలి మావోయిస్టు పార్టీ కూడా ప్రధాన జీవన స్రవంతిలో కలిసి ఎన్నికలలో భాగస్వాములు కావడం వంటి అనేక పరిణామాలు ఆ దేశంలో చోటుచేసుకున్నాయి. అయితే వరుసగా ఏర్పడిన ప్రభుత్వాలు ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం చేయడంలో విఫలమయ్యాయి. దీనికి తోడు ప్రజల అసంతృప్తిని అణచివేయడానికి తీవ్ర నిర్బంధ చర్యలకు కూడా పాల్పడ్డాయి. చివరకు సోషల్ మీడియా మీద కూడా నిషేధం విధించడంతో ప్రజల అసంతృప్తి కట్టలు తెంచుకుంది. అప్పటిదాకా ఓర్పుతో ఉన్న ప్రజానీకం ఒక్కసారిగా రోడ్లమీదకు వచ్చి తిరగబడింది. అది హింసా రూపం కూడా తీసుకుంది. దాదాపు ఇలాంటి పరిణామాలే బంగ్లాదేశ్‌లో కూడా గత సంవత్సరం చోటుచేసుకున్నాయి.

ఈ సందర్భంగా మన దేశంలోని పాలకులు ఈ పరిణామాల నుంచి నేర్చుకోవలసిన విలువైన పాఠాలు ఉన్నాయి. నేడు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనతో దేశ ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆర్థిక అసమానతలు, పెరుగుతున్న పేదరికం, నిరుద్యోగం, గిట్టుబాటు ధర, మహిళలపై అత్యాచారాలు, పరస్పర అపనమ్మకాలు వంటివి ఈ రోజు దేశంలో నిత్యకృత్యమయ్యాయి. ఇవన్నీ పాలకుల కార్పొరేట్ అనుకూల విధానాల ఫలితాలే. వివిధ తరగతుల ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని అణచివేయడానికి ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తోంది. అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను సుదీర్ఘకాలం పాటు విచారణ చేపట్టకుండా జైల్లో నిర్బంధించిన ఉదంతాలు ఉన్నాయి. ఇవన్నీ దేనికి సంకేతాలుగా నిలుస్తున్నాయి అన్నది పరిశీలిస్తే నేడు దేశంలో నెలకొన్న వాతావరణం అవగతమవుతుంది.

ఇన్ని తీవ్ర సమస్యలు ఉన్నా మన దేశంలో పొరుగు దేశాలలో లాగా ఆందోళనలు ఎందుకు జరగడం లేదు అన్న సందేహం సహజంగానే కలుగుతుంది. దీనికి ప్రధాన కారణం ప్రజలలో అసంతృప్తి లేకపోవడం మాత్రం కాదు. దీనికి భిన్నంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ తాజాగా పేర్కొన్నట్లు మన రాజ్యాంగం విశిష్టతే దీనికి ప్రధాన కారణం.

భారతదేశ రాజ్యాంగంలో ప్రజలకు నిరసన తెలిపే హక్కు, ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రజాస్వామ్య హక్కులు వంటివి అనేకం ఉన్నాయి. అలాగే అత్యంత విలువైన ఓటు హక్కును కూడా మన రాజ్యాంగం కల్పించింది. వీటి ద్వారా ప్రజలు తమ అసంతృప్తిని ఎన్నికల సందర్భాలలో తమకు నచ్చని ప్రభుత్వాలను మార్చేసే రూపంలో వ్యక్తం చేసిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. ఇప్పటి వరకూ ఈ హక్కులు ఎంతో కొంత మేరకు కొనసాగడం వల్లనే మన దేశంలో అటువంటి అరాచకాలు, ఆందోళనలు జరగలేదు. కానీ పరిస్థితి ఎల్లకాలం ఇలాగే ఉంటుందని అనుకోలేమని కొన్ని తాజా పరిణామాలు సూచిస్తున్నాయి.

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, వివిధ రాష్ట్రాల లోని పాలక పార్టీలు.. ప్రజల అసంతృప్తిని అణచివేయడానికి తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయి. కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా సెక్షన్ 144, సెక్షన్ 30 వంటివి నిరవధికంగా కొనసాగిస్తున్నాయి. సభలకు, ప్రదర్శనలకు, నిరసనలకు సైతం అనుమతులు నిరాకరిస్తున్నారు.



ప్రజలు తమ అసంతృప్తిని వెలిబుచ్చే గొప్ప ప్రజాస్వామ్య అవకాశం మన దేశంలో ఎన్నికల వ్యవస్థ కల్పించింది. దీన్ని కూడా పూర్తిగా నిలిపివేయడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని చర్యలూ చేపడుతోంది. ఎన్నికల కమిషన్ నియామక ప్రక్రియనే పూర్తిగా మార్చేసి, తమకు అనుకూలమైన వారిని నియమించుకొని, స్వతంత్రంగా ఉండవలసిన ఆ కమిషన్‌ను తన గుప్పెట్లో పెట్టుకుంది. అయినా గెలుస్తామనే నమ్మకం లేక ఓటర్లను డబ్బు, మతం, కులం పేరుతో తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఇంకా గెలుపుపై నమ్మకం కుదరకపోవడంతో తమకు రావనుకునే ఓట్లను తొలగించే పనికి కూడా పూనుకుంది. బిహార్ రాష్ట్రంలో తాజాగా జరుగుతున్న ఎన్నికల సవరణ ఇందులో భాగమే. కొత్త ఓటర్లను చేర్చడం, పాత ఓటర్లను తొలగించడం వంటి చర్యల ద్వారా ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేలా ఎలా వ్యవహరించారో కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ పార్లమెంటు స్థానంలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గ ఉదాహరణ ఇటీవలే వెలుగులోకి వచ్చింది. ఇలాంటివి దేశంలో చాలా జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై స్పందించి, జరిగిన తప్పులను ఆమోదించి, సరిచేయవలసిన ఎన్నికల కమిషన్, ఆ పని చేయకపోగా తిరిగి ప్రశ్నించిన వారిపై ఎదురు దాడికి దిగడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. కేంద్ర ప్రభుత్వ ఈ చర్యలన్నీ మన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయి. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నాయి.

ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని బలవంతంగా అణచివేయడం ఎల్లకాలమూ సాధ్యం కాదని మనకు పొరుగు దేశాల అనుభవాలు తేటతెల్లం చేస్తున్నాయి. అందువల్ల నేడు మన దేశ పాలకుల వద్ద రెండే రెండు మార్గాలు ఉన్నాయి. ప్రజానుకూల విధానాలను అవలంబించడంతో పాటు, ప్రజలు తమ అసంతృప్తిని వెలిబుచ్చే అన్ని ప్రజాస్వామ్య హక్కులను గౌరవించి, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం. కానీ విచిత్రంగా మన పాలకులు ఆ రెండూ చేయడం లేదు.

ఇంకా విచిత్రంగా ఇటీవల కొంతమంది కొన్ని వింత వాదనలు చేస్తున్నారు. అవేమిటంటే దేశంలోని ప్రజలకు– ముఖ్యంగా యువతకు భూత దయ, యోగా, ధ్యానం వంటివి అలవాటు చేస్తే వారి జీవితం ఆనందదాయకమై, మన దేశం సుభిక్షంగా ఉంటుందని. తద్వారా సమాజంలో జరుగుతున్న పరిణామాలు గురించి పట్టించుకోకుండా, వారు ఎటువంటి ఆందోళనలు చేయకుండా ప్రశాంత జీవనం గడుపుతారని సెలవిస్తున్నారు. అందుకేనేమో మోదీ ప్రభుత్వం పాఠ్యాంశాలలో ఇలాంటివి చేర్చింది.

ఇంతకంటే విడ్డూరం మరొకటి ఉండదు. సమాజాన్ని సరైన మార్గంలో నడిపే బాధ్యత వహించవలసిన పాలకులు ఆ పని చేయకుండా, ఒక పక్క ప్రజలపై పెను భారాలు వేస్తూ, మరో పక్క ఆ ప్రజలు ఏమీ మాట్లాడకుండా యోగా, ధ్యానం వంటివి చేసుకుంటూ, నోరు మూసుకొని ఉండాలని ఉద్బోధిస్తోంది! దీని వెనుక దాగి ఉన్న ప్రభుత్వ ఉద్దేశ్యాలను కూడా ప్రజలు గమనించాలి.

మన పొరుగు దేశాలలో జరుగుతున్న పరిణామాల వంటివి మనదేశంలో జరగకుండా ఉండడం... ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహిస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియను, భారత రాజ్యాంగ స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకోవడం ద్వారానే సాధ్యం. అప్పుడు మాత్రమే భారత్ ఒక గౌరవప్రదమైన సమాజంగా రూపుదిద్దుకోగలదు.

■ ఎ. అజశర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

అసెంబ్లీ మీద అలిగితే నష్టం ఎవరికి?

2024 అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ పార్టీకి దాదాపు 40 శాతం ఓట్లు వచ్చాయి. అంటే ఒక కోటి, ముప్పయ్ రెండు లక్షల, ఎనభై నాలుగు వేల, నూట ముప్పయ్ నాలుగు (1,32,841,34) ఓట్లు లభించాయి. 2019–2024 మధ్యకాలంలో పాలనకు లభించిన అవకాశాన్ని వినియోగించుకుని అంతటి భారీ స్థాయిలో 'క్లెప్టోక్రసీ'ని తలపించే రీతిలో పాలన సాగించినప్పటికీ నలభై శాతం మంది ప్రజలు జగన్ వెంట నడిచారు. ఇది చిన్న విషయం కాదు. జనసేన పేరుతో ప్రజా జీవితంలోకి 2014లో మహా దూకుడుగా అడుగుపెట్టిన పవన్ కల్యాణ్ వెంట దశాబ్దం తరువాత కూడా ఆరేడు శాతానికి మించి ఓటర్లు నడవలేదు.

అందుకే, జగన్ వెంట నడిచిన 40 శాతం ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాల్సిన నైతిక బాధ్యత జగన్ పార్టీకి ఉన్నది. వారి పొలాలకు నీరు సక్రమంగా అందుతున్నదా, వారి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయా, వాళ్ళ పిల్లలకు 'తల్లికి వందనం' నిధులు లభించాయా, వారికి ఆరోగ్యశ్రీ సహాయం లభిస్తున్నదా, వారి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణంలో ఇబ్బందులు ఉన్నాయా, పోలీస్ స్టేషన్లలో వారికి ఏమైనా అన్యాయాలు జరుగుతున్నాయా... వంటి సవాలక్ష అంశాలపై ప్రభుత్వం సరిగా వ్యవహరించకపోతే నిలదీయాల్సిన అవసరాన్ని జగన్ పార్టీ గుర్తించిందా? మరి వీటి మీద ప్రభుత్వాన్ని నిలదీయాలి కదా! ఆ నిలదీతకు అసెంబ్లీ సమావేశాలకు మించిన వేదిక భారత ప్రజాస్వామిక వ్యవస్థలో మరొకటి ఏముంది?

జగన్ పార్టీకి పదకొండు మంది శాసనసభ్యులు ఉన్నారు. పులివెందుల నుంచి ఎన్నికైన వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డిని మినహాయిస్తే రేగం మత్స్యలింగం (అరకు వ్యాలీ), మత్స్యరస విశ్వేశ్వరరాజు (పాడేరు), తాటిపర్తి చంద్రశేఖర్ (యర్రగొండపాలెం), బూచేపల్లి శివప్రసాదరెడ్డి (దర్శి), దాసరి సుధ (బద్వేల్), ఆకేపాటి అమరనాథరెడ్డి (రాజంపేట), వై. బాలనాగిరెడ్డి (మంత్రాలయం), బి. విరూపాక్షి (ఆలూరు), పి. ద్వారకానాథరెడ్డి (తంబళ్లపల్లి)... వీరంతా శాసనసభ సమావేశాల్లో పాల్గొనడానికి చట్టపరమైన, లేదా – న్యాయపరమైన అడ్డంకులు ఏమీలేవు.



> జగన్ పార్టీకి పదకొండు మంది శాసనసభ్యులు ఉన్నారు. మిగిలిన 164 శాసనసభ్యులకు లభించే సమస్త వసతులు, జీతభత్యాలు, వసతి, సెక్యూరిటీ సదుపాయం– ఈ పదకొండుమందికీ లభిస్తున్నాయి. వీరు పదకొండుమందే అయినప్పటికీ, జగన్ పార్టీకి ఓటేసిన కోటీ ముప్పై లక్షల మందికి పైగా ఓటర్లకు శాసనసభలో ప్రాతినిధ్యం వహిస్తున్నారనే విషయాన్ని మరిచిపోకూడదు. చట్టసభ పట్ల నమ్మకం అనేదే లేకపోతే, వారికి భారత ప్రజాస్వామ్యం మీదే నమ్మకం లేదని అనుకోవాలి.

మిగిలిన 164 శాసనసభ్యులకు లభించే సమస్త వసతులు, జీతభత్యాలు, వసతి, సెక్యూరిటీ సదుపాయం– ఈ పదకొండుమందికీ లభిస్తున్నాయి. వీరు పదకొండుమందే అయినప్పటికీ, జగన్ పార్టీకి ఓటేసిన కోటీ ముప్పై లక్షల మందికి పైగా ఓటర్లకు శాసనసభలో ప్రాతినిధ్యం వహిస్తున్నారనే విషయాన్ని మరిచిపోకూడదు. శాసనసభలో మాట్లాడే అంశాలకు చట్టబద్ధత ఉంటుంది. శాశ్వతత్వం ఉంటుంది. ఆ మాటలు సభ రికార్డులలో నిక్షిప్తమై ఉంటాయి. ఆ ప్రసంగాలకు రాజ్యాంగ రక్షణ ఉంటుంది. అందుకే, 'సభకు హాజరవ్వండి' అంటూ శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు కూడా వైసీపీ సభ్యులకు పదే పదే విజ్ఞప్తి చేస్తున్నారు. సభలోకి రాకుండా, హాజరు పట్టీల్లో సంతకాలు పెట్టేసి, దొంగల్లా వైసీపీ సభ్యులు వెళ్లిపోతున్నారని స్పీకర్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్య తమకు ఎంత చిన్నతనమో వైసీపీ సభ్యులు ఆలోచించుకోవాలి. వారికే కాదు – వారు శాసనసభకు ఎన్నికవ్వడానికి, ఆ పార్టీకి ఓటేసిన కోటీ ముప్పయ్ రెండు లక్షల మంది ఓటర్లకూ చిన్నతనమే కదా!

చట్టసభ పట్ల నమ్మకం అనేదే లేకపోతే, వారికి భారత ప్రజాస్వామ్యం మీదే నమ్మకం లేదని అనుకోవాలి. శాసనసభకు హాజరు కాకూడదు అనుకుంటే, సభ్యులుగా ఎందుకు ప్రమాణస్వీకారం చేసినట్లు! ప్రమాణ స్వీకారం కూడా బహిష్కరించి ఉంటే ఇక ఈ విషయంలో చర్చ అన్న ప్రసక్తే ఉండేది కాదు. చింతకాయల అయ్యన్నకు వైసీపీపై వ్యాఖ్యలు చేయాల్సిన అవసరమూ ఉండేది కాదు.

ఇంతకీ, ఈ పదకొండుమందీ సభకు ఎందుకు రాలేకపోతున్నారు? తాము గత శాసనసభ సమావేశాల్లో చంద్రబాబును ఘోరంగా అవమానించిన ఘటనతో వారికి ఇప్పుడు సభలో కూర్చోడానికి మొహాలు చెల్లడం లేదని ఎవరైనా ఆక్షేపిస్తే సమాధానం చెప్పగలిగిన స్థితిలో వైసీపీ ఉండాలి కదా! ఇటువంటి రాజకీయ పరిస్థితి ఎదురవుతుందని కలలో సైతం అనుకోని వైసీపీ నాయకులకు ఇప్పుడు ఇది మింగుడు పడడం లేదా? ఇదే మరి ఖర్మ సిద్ధాంతం అంటే! 'రేపు' అనేది ఒకటి ఉంటుందనేది గుర్తుపెట్టుకోనందువల్లే వైసీపీ నేతలకు ఈ పరిస్థితులు ఎదురయ్యాయన్న వ్యాఖ్యానాలు విస్తృతంగా వినబడుతున్నాయి.

కానీ శాసనసభ మీద అలగడం కాదు కదా వైసీపీ పార్టీ చేయవలసింది. ఈ విషయంలో చంద్రబాబు నాయుడిని చూసి వైసీపీ నేతలు నేర్చుకోవాలి. 1995 నుంచి 2004 వరకు ఏకబిగిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయినా ఏనాడూ శాసనసభ మీద అలగలేదు. 2004 నుంచి 2014 వరకు ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యారు. ఆ సమయంలో ముగ్గురు ముఖ్యమంత్రులైన రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిలను ఆయన ఎదుర్కొన్నారు. మళ్ళీ 2014లో మూడోసారి ముఖ్యమంత్రి అయ్యారు. 2019 నుంచి 2024 వరకు మళ్ళీ ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభకు హాజరై ఇప్పుడు మళ్ళీ ముఖ్యమంత్రి అయ్యారు. ఇప్పుడు వైసీపీ ఓడిపోయింది ఒక్కసారే కదా? ఈ ఓటమిని హుందాగా తీసుకుని, 151 నుంచి 11కు ఎందుకు వచ్చామో నిజాయితీగా ఆత్మవిమర్శ చేసుకుని, మళ్ళీ 150కి రావడానికి ఏమి చేయాలో అది చెయ్యకుండా శాసనసభపై అలగడంతో వైసీపీ డొల్లతనం బయటపడడం లేదా!?

శాసనసభకు వెళ్ళగూడదని వైసీపీకి చెందిన పదకొండుమంది శాసనసభ్యులూ నిజంగా భావిస్తూ ఉంటే, ఆ విషయాన్ని నిజాయితీగా ప్రకటించి, తమ శాసనసభ్యత్వాలకు రాజీనామా చేయడం సబబుగా ఉంటుంది. సభ్యత్వం ద్వారా లభించిన అన్నిటినీ తిరిగి ప్రభుత్వానికి అప్పజెప్పడం నిజాయితీగా ఉంటుంది. ప్రజాక్షేత్రంలో చేసే పోరాటాలకు ఒక నైతిక బలం ఉంటుంది. లేకపోతే, అయ్యన్నపాత్రుడు పదే పదే చెప్పినట్టుగా వైసీపీ దుష్కీర్తిని మూటగట్టుకున్నట్టు అవుతుంది. తమకు 2024 ఎన్నికల్లో ఓటేసిన కోటీ ముప్పయ్ రెండు లక్షల ఎనభైయ్ వేల మంది ఓటర్లకూ ద్రోహం చేసినట్టేనన్న భావం సమాజంలో కలుగుతుంది.

○ భోగాది వేంకటరాయుడు

'వక్ఫ్'పై సుప్రీం ఉత్తర్వులు భేష్

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన కేసులో సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. ఆ చట్టాన్ని అమలు చేయకుండా స్టే ఇవ్వాలన్న విజ్ఞప్తిని తిరస్కరించింది. 'వక్ఫ్ చట్టంలో కొన్ని అభ్యంతరకర నిబంధనల్ని కొట్టివేస్తే చాలు'నని తెలిపింది. ఈ ఉత్తర్వులపై అధికార, ప్రతిపక్షాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మధ్యకాలంలో ఇలా వైరి పక్షాలు రెండూ సంతృప్తి వ్యక్తం చేసిన కోర్టు ఆదేశాలు బహుశా ఇవే కావొచ్చు. 'వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, సక్రమ వినియోగం కోసం ఉద్దేశించిన ఈ చట్టం రాజ్యాంగ పరిధికి లోబడి ఉందని, అందుకే ఇది కొట్టివేయదగ్గది కాద'న్నది కోర్టు ఉద్దేశం. అదే సమయంలో చట్టంలోని కొన్ని నిబంధనలు నిర్హేతుకంగా ఉన్నాయి. చాలా కాలంగా వక్ఫ్ అన్నది ముస్లిం సమాజ సంక్షేమానికి ఉద్దేశించి, ఆ మతాన్ని ఆచరిస్తున్న దాతలు ఆస్తుల్ని, భూముల్ని స్వచ్ఛందంగా అందిస్తున్న దాతృత్వ విధానం. దేశంలో ఆ భూములు లక్షల ఎకరాల్లో ఉన్నాయి. వక్ఫ్ ఆస్తులు, భూములకు సంబంధించి కొన్నింటిపై 'ప్రభుత్వ భూముల ఆక్రమణ' వివాదాలున్నాయి. వాటిపై హక్కు కోసం ఆ మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టు తలుపు తట్టాల్సి వచ్చింది.

పాత వక్ఫ్ చట్టంలో కొన్ని లోపాల వల్ల ఆస్తులు, వివాదాలు ఎక్కువయ్యాయని ప్రభుత్వ వాదన. అందుకే పార్లమెంట్ ఈ చట్టాన్ని చేసింది. ఈ చట్టం ప్రకారం... అయిదేళ్ల నుంచి ముస్లిం ఆచారాలను కచ్చితంగా పాటించేవారు మాత్రమే దాతలుగా అర్హులు. అయితే ఆ అంశాన్ని నిర్ధారించే ప్రక్రియ ప్రస్తుతం ఏదీ లేదు. కాబట్టి ఆ నిబంధనను అమలు చేయకూడదని కోర్టు తెలిపింది. అంతేగాక, ఏదైనా భూమిపై ప్రభుత్వంతో వివాదం ఉంటే... మొదటే దాన్ని వక్ఫ్ నుంచి మినహాయించి స్థానిక కలెక్టర్ ఆ భూమిని స్వాధీనం చేసుకోవచ్చన్న నిబంధనను కూడా కోర్టు కొట్టివేసింది. చట్టప్రకారం అనుసరించాల్సిన ప్రక్రియ, విచారణ లేకుండా అలా భూములు తీసుకోవడం న్యాయ సూత్రాలకు విరుద్ధం. అలాగే వక్ఫ్ బోర్డు, ట్రిబ్యునల్‌లో ఉండదగ్గ ముస్లిమేతరుల సంఖ్యపై కూడా కోర్టు పరిమితి విధించింది. వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసింది. ఈ రకంగా వక్ఫ్ చట్టాన్ని కోర్టు పూర్తిగా పక్కన పెట్టకపోవడాన్ని అధికారపక్షం స్వాగతించగా, వివాదాస్పద నిబంధనల్ని తొలగించడంపై ప్రతిపక్షాలు హర్షం వ్యక్తం చేశాయి. ఇక్కడ గమనించాల్సినదేమంటే 'చట్టాలపై పార్లమెంటులో జరగాల్సిన లోతైన చర్చల' అవసరాన్ని ఈ ఉదంతం తెలియజేస్తున్నది.

– డీవీజీ శంకరరావు, మాజీ ఎంపీ

బచావత్ కేటాయింపులు కాపాడితేనే జల భద్రత

ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగం భవిష్యత్తు నేడు గరిమనాభి మొనపై ఉంది. ప్రస్తుతం విచారణ జరుపుతున్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌లో బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులు కాపాడుకోవడంపైనే కూటమి ప్రభుత్వం నిబద్ధత ఇమిడి ఉంటుంది. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మిగిల్చిపోయిన విపత్తు నివారించడం అంత ఆషామాషీ కాదు. ఇప్పుడు ట్రిబ్యునల్ ముందు తెలంగాణ ప్రభుత్వం వాదనలు తుది దశకు వచ్చాయి. తిరిగి ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఈ కేసు విచారణకు రానున్నది. తెలంగాణ ప్రభుత్వమే తన వాదనలు వినిపిస్తుంది. తదుపరి విచారణ నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వాదనను వినిపించవలసి ఉంది. తెలంగాణ ప్రభుత్వ వాదనల సందర్భంగా బ్రిజేశ్ కుమార్ జోక్యం చేసుకుని అడిగిన వివరణలు పరిశీలిస్తే, కేసు విచారణ జటిలంగానే ఉండబోతోంది. ఇంతవరకు ట్రిబ్యునల్ ముందు జరిగిన విచారణ గురించి చెదురుమదురుగా ఆంధ్రప్రదేశ్‌లో వార్తలు వచ్చాయి, కానీ సమగ్రంగా రాలేదు. మున్ముందు ఈ కేసు తీర్పులో ఏదైనా జరగరానిది జరిగితే ముందు వరుసలో జగన్మోహన్‌రెడ్డి, తదుపరి కేంద్ర ప్రభుత్వం, ఆఖరుగా కూటమి ప్రభుత్వం నెపం మోయవలసి ఉంటుంది.

రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 మేరకు ట్రిబ్యునల్ విచారణ జరుపుతున్నా, సంతృప్తి చెందని కేసీఆర్ వ్యూహాత్మకంగా 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో జగన్మోహన్‌రెడ్డిని బుట్టలో వేసుకున్నారు. 1956 అంతర్ రాష్ట్ర జల వివాద చట్టం కింద కొత్త ట్రిబ్యునల్ నియామకంపై అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో జగన్మోహన్‌రెడ్డి డిసెంట్ నోట్ పెట్టి ఉండాల్సింది. ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగాన్ని కుదిపివేసే కొత్త ట్రిబ్యునల్ నియామకం వ్యతిరేకించాల్సింది. అప్పుడు కేంద్ర ప్రభుత్వం చేతులు కూడా కట్టివేసినట్టు అయ్యేది. జగన్మోహన్‌రెడ్డి అభ్యంతరం చెప్పకపోవడంతో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం ఆమోదం పొందింది. మూడేళ్ల పాటు కేసీఆర్ అడిగినపుడల్లా న్యాయ శాఖ వద్ద ఫైలు ఉందని చెబుతూ వచ్చిన బీజేపీ ప్రభుత్వం, 2023లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకు కొత్తగా ట్రిబ్యునల్ నియామకం చేసి, అవశేష ఆంధ్రప్రదేశ్ గొంతు కోసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామిగా ఉన్నందున, మున్ముందు రాష్ట్ర ప్రభుత్వమూ ప్రజలకు జవాబు చెప్పవలసి ఉంటుంది.

ట్రిబ్యునల్ ముందు దశల వారీగా జరిగిన విచారణలో ఇంతవరకు తెలంగాణ ప్రభుత్వం విన్పించిన వాదనల్లో బేసిన్ సమస్యను ప్రధానంగా తీసుకువచ్చింది. ఆంధ్రప్రదేశ్ బేసిన్ అవలకు కృష్ణ జలాలను తీసుకెడుతున్నదని ప్రస్తుతమున్న 510 టీఎంసీల్లో 331 టీఎంసీలు బేసిన్ అవలకు తరలిస్తున్నదని గణాంకాలతో సహా నివేదించింది. ఆంధ్రప్రదేశ్‌కు 180 టీఎంసీలు చాలన్నట్లు తెలంగాణ అడ్వకేట్ వైద్యనాథన్ వివరించారు. ఈ సందర్భంలో బ్రిజేశ్ కుమార్ జోక్యం చేసుకొని వివరాలు అడిగితే తెలంగాణ అడ్వకేట్ వాటిని సమర్పించారు. బేసిన్ అవలకు తీసుకెడుతున్న 331 టీఎంసీలు కోత విధించి, తమకు కేటాయించాలని కోరారు. తెలంగాణ దృష్టిలో సాగర్ కుడి కాలువ, కేసీ కెనాల్, తుంగభద్ర ఎగువ కాలువ ఆయకట్టు, రాయలసీమ మొత్తం బేసిన్ అవలగా చిరకాలంగా చెబుతోంది. అదే విషయాన్ని వాళ్ల అడ్వకేట్, ట్రిబ్యునల్ ముందు ఉంచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీల్లో 71 శాతం తెలంగాణకు కేటాయించాలని వైద్యనాథన్ కోరారు.

> బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణ ప్రభుత్వం వాదనలు తుదిదశకు వచ్చాయి. ఈ వాదనల సందర్భంగా బ్రిజేశ్ కుమార్ జోక్యం చేసుకుని అడిగిన వివరణలు పరిశీలిస్తే, కేసు విచారణ జటిలంగానే ఉండబోతోంది. మున్ముందు విచారణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను కాపాడుకునే విధంగా బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు సమర్థవంతమైన, సమగ్రమైన వాదన వినిపించేందుకు సమర్థులైన లాయర్లను ఎంపిక చేయవలసి ఉంది.

1954లో హైదరాబాద్, ఆంధ్ర రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందం మేరకు సాగర్ కుడి కాలువ కింద 9.7 లక్షల ఎకరాలు ఆయకట్టు ఉండాల్సివుంటే నేడు 11.74 లక్షల ఎకరాలకు పెంచారని, ఇందులో కోత విధించాలని కూడా తెలంగాణ కోరింది. పైగా మరో ప్రమాదకరమైన అభ్యర్థన ఏమంటే ఆంధ్రప్రదేశ్‌లో పంటల సాగు విధానం మార్పు చేయాలని, ఇందుకు ఉదాహరణగా కావేరి ట్రిబ్యునల్ తీర్పు ఉల్లేఖించారు. తెలంగాణలో ఎక్కువ మెట్ట ప్రాంతాలుగా ఒక పంట కూడా సాగు కాని దుర్భిక్ష పరిస్థితులుంటే ఆంధ్రప్రదేశ్‌లో రెండు వైపుల నుంచి సాగునీటి వసతి ఉన్నదని ఈ పరిస్థితుల్లో ఒక వైపు కోత విధించి, ఆ నీళ్ల తెలంగాణకు కేటాయించాలని కోరింది. ఉదాహరణకు కృష్ణ డెల్టాకు గోదావరి జలాలు కూడా




వస్తాయి కాబట్టి కృష్ణ నీళ్లు గొంతెండిపోతున్న తెలంగాణకు కేటాయించాలని వైద్యనాథన్ కోరారు. ట్రిబ్యునల్ విచారణ ప్రారంభ దశలోనే కేంద్ర జలసంఘం మాజీ సభ్యులు చేతన్ పండిట్ ట్రిబ్యునల్ ముందు ఒక అఫిడవిట్ వేశారు. క్యారీ ఓవర్ కింద ఉన్న 150 టీఎంసీల్లో 125 టీఎంసీలు తెలంగాణకు కేటాయించాలని, 25 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్‌కు చాలని కోరారు. దీనితో పాటు గోదావరి నుంచి కృష్ణలో కలిసే 80 టీఎంసీల్లో ఎగువ రాష్ట్రాలకు పోగా మిగిలే 45 టీఎంసీలు కూడా తెలంగాణకే కేటాయించాలని కోరి ఉన్నారు. ఈ అంశాలపై వైద్యనాథన్ మరింత వివరణ ఇస్తూ ట్రిబ్యునల్ ముందు వాదన వినిపించారు.

మరీ అన్యాయమైన డిమాండ్ ఏమంటే నిత్య క్షామపీడిత ప్రాంతమైన రాయలసీమకు ఉన్న దిక్కు కేసీ కెనాల్ ఒక్కటే. బ్రిటిష్ కాలం నుంచి కేసీ కెనాల్ కింద ఆయకట్టుకు తుంగభద్ర నీళ్లు వస్తున్నాయి. పైగా బచావత్ ట్రిబ్యునల్ చట్టబద్ధంగా నీటి కేటాయింపులు చేసింది. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వానికి అది బేసిన్ అవలగా కనిపిస్తోంది. తెలంగాణలోని దుర్భిక్ష ప్రాంతాల కన్నా కనాకష్టంగా ఉన్న రాయలసీమకు స్పాట్ పెట్టడమే విశేషం. తెలంగాణ అడ్వకేట్ తుది దశలో తన వాదనలను విన్పిస్తూ శ్రీశైలం కేవలం జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టుగా నిర్మితమైందని దాని నుంచి సాగుకు నీళ్లు తీసుకొనే అవకాశం లేదని స్పష్టంగా చెప్పారు. అంతకు ముందు విచారణ సందర్భంగా 1976లో కుదిరిన ఒప్పందం మేరకు శ్రీశైలం నుంచి కేవలం 15 టీఎంసీల నీళ్లు చెన్నై తాగు నీటి కోసం మాత్రమే తీసుకొనే అవకాశం ఉందని, కానీ ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నీళ్లు తీసుకుంటోందని కాబట్టి 15 టీఎంసీలు మించి తీసుకోకుండా కట్టడి చేయాలని వైద్యనాథన్ నివేదించారు.

వీటన్నింటికీ మించి ప్రమాదకరమైన డిమాండ్ తెలంగాణ చేసింది. రాష్ట్ర విభజన చట్టం 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న మిగులు జలాల ఆధారంగా నిర్మితమైన ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు ఆంధ్రప్రదేశ్ కోరి ఉన్నదని, ఈ ప్రాజెక్టులకు కేటాయింపులు చేయవద్దని కూడా వైద్యనాథన్ అభ్యర్థించారు. అంతే కాదు, తెలంగాణలో పడే వర్షపు నీరు లెక్కించి ఆ మేరకు కృష్ణ జలాలను తెలంగాణకు కేటాయించాలని కూడా తెలంగాణ ట్రిబ్యునల్‌ను కోరారు. ఇవన్నీ ప్రధానమైన అంశాలు. సంవత్సర కాలంగా తెలంగాణ సమర్పించిన ప్రత్యేక అఫిడవిట్లు వాళ్ల అడ్వకేట్ వైద్యనాథన్ చేసిన వాదనలు ఒక ఉద్గ్రంథమే అవుతుంది.

ఈ నేపథ్యంలో మున్ముందు ట్రిబ్యునల్ ముందు సమర్థవంతమైన, సమగ్రమైన వాదన వినిపించేందుకు సమర్థులైన లాయర్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంపిక చేయవలసి ఉంది. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి వెంటనే సమీక్ష జరపాలి.

● వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు





వర్షం తంటాలు

జోరువాన నగరాన్ని ముంచేసింది. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నీరజాక్షికి నిత్య పూజలు

కనకదుర్గమ్మకు ప్రీతిపాత్రమైన పూజలెన్నో..

సర్వశ్రేయోదాయకం శ్రీచక్ర నవావరణార్చనం

- పరమ పవిత్రం లక్షకుంకుమార్చన
- ఖడ్గమాలార్చన, చండీహోమంతో విశేష ఫలితం
- దసరా ఉత్సవాల్లో మరింత విశిష్టత

6

కౌంట్‌డౌన్ 4





మొక్క నాటుతున్న పవన్

ఎయిర్‌పోర్టులో

ఘనంగా యాత్రీ సేవ

మొక్క నాటిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- త్రిపుర గవర్నర్, కేంద్రమంత్రి పెమ్మసాని రాక
- యాత్రికులకు పలు సేవా కార్యక్రమాలు

6

నేటి నుంచి రోబో ఎక్స్-2025

- కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీలో..

8

జెట్ వేగం

జక్కంపూడి ఎకనమిక్ టౌన్‌షిప్ (జెట్) సిటీలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ బ్యాలెన్స్ పనులు పూర్తి చేయటానికి వీలుగా ఏపీఐఐసీ కీలక అడుగు వేసింది. వైసీపీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న ఈ కాంప్లెక్స్‌ను పూర్తి చేసేందుకు రూ.19.55 కోట్లతో టెండర్లు పిలిచింది.

ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పూర్తికి ఏపీఐఐసీ టెండర్లు

రూ.19.55 కోట్లతో ఆరు నెలల్లో పూర్తిచేయాలని గడువు

- వైసీపీ ప్రభుత్వ హయాంలో జెట్‌సిటీ విధ్వంసం
- కూటమి వచ్చాక అభివృద్ధికి తొలి అడుగులు
- కాంప్లెక్స్ పూర్తయితే అన్ని వర్గాలకూ ఒకేచోట పని

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో వాక్ టు వర్క్ విధానంలో జక్కంపూడి ఎకనమిక్ టౌన్‌షిప్ (జెట్) సిటీ మెగా టౌన్‌షిప్‌కు శ్రీకారం చుట్టారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని ప్రకటించారు. ఆ వెంటనే ఇది ఏర్పాటైంది. జెట్‌సిటీని ఏపీ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఏపీయూఐఎంఎల్) శాఖ పరిధిలో చేపట్టేందుకు అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతి ప్రజా రాజధాని అయితే జెట్‌సిటీని ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దాలని నాటి టీడీపీ ప్రభుత్వం భావించింది. దీంతో విజయవాడ శివారున జక్కంపూడి, వేమవరం, షాబాద గ్రామాల చుట్టూ వ్యాపించి ఉన్న కొండ ప్రాంతాన్ని ఎంపిక చేసింది. ఇక్కడ దాదాపు 300 ఎకరాల వరకు ఉంది. ఈ ప్రాంతంలో ముందుగా కొండల చుట్టూ పేద, మధ్య, ధనిక వర్గాలందరినీ దృష్టిలో ఉంచుకుని బహుళ అంతస్థుల భవనాలను నిర్మించాలని నిర్ణయించారు.

వైసీపీ హయాంలో చతికిలపడి..

పేద, మధ్య తరగతి వర్గాల కోసం 50 వేల ఇళ్ల నిర్మాణం తలపెట్టాలని నిర్ణయించి డీపీఆర్ తయారుచేసి కేంద్రానికి పంపారు. కేంద్రం ఆమోదం తర్వాత పీఎంఏవై కాంపోనెంట్ వాటా కూడా ఈ ఇళ్లకు తోడైంది. యుద్ధప్రాతిపదికన టిడ్కో ద్వారా కొండ ప్రాంతం చుట్టూ 15 వేల ఇళ్ల నిర్మాణాన్ని తలపెట్టేందుకు టెండర్లు పిలిచింది. ఎన్‌సీసీ అనే మిగతా 6లో..



జెట్‌సిటీలో అసంపూర్తిగా ఉన్న మొదటి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ టవర్

కూటమి వచ్చాక పునరుజ్జీవం

కూటమి ప్రభుత్వం వచ్చాక.. జెట్‌సిటీలోని బ్యాలెన్స్ ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టడంతో పాటు అసంపూర్తిగా ఉన్న మొదటి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ టవర్ పనులను కూడా పూర్తి చేయించేందుకు వీలుగా ఏపీఐఐసీకి బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఏపీఐఐసీ మొదటి టవర్ పనుల పూర్తికి టెండర్లు పిలిచింది. కేవలం ఆరు నెలల సమయం మాత్రమే ఇచ్చారు. ఈ ఆరు నెలల్లో మొదటి టవర్ పూర్తయితే వరుసగా రెండు, మూడు, నాలుగు టవర్లను ప్రణాళికగా పూర్తి చేయనున్నారు. ఈ టవర్లను కూడా వేర్వేరు పారిశ్రామిక సంస్థలకు కేటాయిస్తారు. దీంతో పేదలకు అందుబాటులోనే పనులు దొరుకుతాయి. ఈ ప్రాంతం కొత్తగా విస్తరిస్తుంది. జెట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా ఆ తర్వాత దశలో ధనిక వర్గాలకు గృహ నిర్మాణం, వారు వ్యాపారులు చేసుకోవటానికి వీలుగా కాంప్లెక్స్ టవర్లు, రోడ్ల నిర్మాణం, ఉద్యానవనాలు ఇలా అనేక ప్రణాళికలు ఉన్నాయి. మొదటి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పనులతో మళ్లీ జెట్‌సిటీకి కదలిక వచ్చింది.

స్త్రీ శక్తి @ రూ.23.69 కోట్లు

నెల రోజుల్లో మహిళలకు ప్రభుత్వ రాయితీ

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 78,45,962 మంది ప్రయాణాలు

- ఎన్టీఆర్ జిల్లాలో 51,57,863 మందికి రూ.14.37 కోట్ల సబ్సిడీ
- కృష్ణాజిల్లాలో 26,88,099 మందికి రూ.9.31 కోట్ల రాయితీ
- స్త్రీ శక్తి పథకం అమలులో అనేక మైలురాళ్లు
- సీట్లలో పురుషులకు రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్

6



జోగి.. నానా యాగీ

మైలవరం కేంద్రంగా కుటిల రాజకీయాలు

- మూలపాడు డంపింగ్ యార్డుకు రావాలని పిలుపు
- 50 మంది వైసీపీ కార్యాకర్తలే రావడంతో అభాసుపాలు
- జోగి, 14 మంది అనుచరుల అరెస్టు.. కేసు నమోదు
- పాత డంపింగ్ యార్డులపై అనవసర రాద్ధాంతం
- జెన్‌కో బల్క్ టెండర్ల తర్వాత స్థానికంగా నిలిచిన రవాణా
- పాత డంపింగ్ యార్డు పేరుతో రాజకీయ అలజడికి యత్నం
- వైసీపీ హయాంలో అడుగడుగునా బూడిద డంపింగ్ యార్డులు
- నాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోచుకున్న జోగి సోదరులు
- నేడు మాత్రం ఏదో జరిగిపోతోందని హడావిడి



ఇబ్రహీంపట్నంలో జోగిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వైసీపీ నేత, మాజీమంత్రి జోగి రమేశ్ మైలవరం వేదికగా కుటిల రాజకీయానికి తెరతీశారు. డంపింగ్ యార్డు పేరుతో బుధవారం హడావిడి చేయడానికి ప్రయత్నించిన ఆయన్ను పోలీసులు అడ్డుకున్నారు. తమకు బూడిద అందకుండా జెన్‌కో.. ఓ ప్రైవేట్ సంస్థకు బల్క్‌గా కాంట్రాక్టు అప్పగించిందని ఓవైపు ట్రాన్స్‌పోర్టర్లు ఆందోళన చేస్తుండగా, వారికి మద్దతుగా నిలివాల్సిందిపోయి ఎమ్మెల్యే వసంతపై లేనిపోని ఆరోపణలు చేస్తూ జోగి హడావిడి సృష్టించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

6

రాజధాని అసైన్డ్ రైతులకు ఊరట!

రిటర్నబుల్ ప్లాట్లలో అసైన్డ్ పదం తొలగింపునకు ఆదేశాలు

- ఆ స్థానంలో పట్టా భూమి అని పేర్కొనాలని సీఎం సూచన
- అసైన్డ్ పదాన్ని అడ్డుపెట్టుకుని రైతులను దోచిన రియల్ దళారులు
- ఒక్కో రైతుకు గజానికి రూ.10 వేల నుంచి రూ.20 వేల నష్టం

విజయవాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజధాని కోసం భూములిచ్చిన అసైన్డ్ రైతులకు మరో ఊరట లభించింది. ఇప్పటికే సీఐడీ కేసుల పేరుతో గత ప్రభుత్వ వేధింపుల నుంచి విముక్తి చేసిన కూటమి ప్రభుత్వం, తాజాగా వారికి మరో మేలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇప్పటివరకు అసైన్డ్ పేరుతో రియల్ ఎస్టేట్ దళారుల దోపిడీకి గురైనవారు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఊపిరి పీల్చుకున్నారు. రాజధాని కోసం అసైన్డ్ భూములిచ్చిన రైతులకు ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్లకు సంబంధించి సీఆర్డీఏ ఇచ్చిన మిగతా 6లో..

గొల్లపూడిలోని ఆలయ భూముల్లో ఎగ్జిబిషన్‌కు హైకోర్టు అనుమతి

- సింగిల్ జడ్జి ఉత్తర్వులపై ధర్మాసనం స్టే

8

సర్వశ్రేయోదాయకం శ్రీచక్ర నవావరణార్చనం







(ఆంధ్రజ్యోతి, ఇంద్రకీలాద్రి)

శ్రీ మాతా, శ్రీ మహారాజ్ఞి లలితాపరమేశ్వరీదేవిని సంతుష్టురాలిని చేసేందుకు శ్రీ చక్రానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. అమ్మవారు శ్రీ చక్రంలో బిందు రూపంలో కొలువై ఉండగా.. నవ ఆవరణలు ఆమె చుట్టూ ఉంటాయి.. ఆ ఆవరణలకు అధిష్ఠాన దేవతలు ఉంటారు. శ్రీచక్ర పూజ చేయాలంటే దశమహా విద్యలు, అమ్మవారి ఉపాసకులకు మాత్రమే సాధ్యమవుతుంది. భక్తుల పేరిట సంకల్పం చెప్పి పూజలు నిర్వహిస్తుంటారు. శ్రీచక్ర నవావరణార్చనను సాక్షాత్తూ లక్ష్మీదేవి ప్రసన్నం కోసం పూజలు చేసినట్టుగా పురాణ కథనాలు ఉన్నాయి. ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికే జపాలు, తర్పణాలు జరుగుతాయి. అమ్మవారిని సంతుష్టురాలిని చేయటానికి శ్రీచక్ర నవావరణార్చనలో 32 ఉపచారాలు చేస్తారు. ఆవాహనం, ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనం, స్నానం, వస్త్ర సమర్పణం, యజ్ఞోపవీత సమర్పణం, ఆభరణం, గంధం, అక్షతలు, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం, శ్రీముఖవాసం, నీరాజనం, దర్పణం, ఫల సమర్పణం, తాంబూలం, ప్రదక్షిణం, నమస్కారం, స్తోత్రం, పురాణపఠనం, ఛత్రం, చామరం, తాళవృంతం, శయ్య, సంగీతం, నృత్యం, వాద్యం, ఆత్మసమర్పణం నిర్వహిస్తారు.

25 ప్రాకార దేవతలు..

శ్రీచక్ర నగరవాసిని లలితాంబిక నివాసానికి 25 ప్రాకారాలు ఉంటాయి. ఇనుము, కంచు, రాగి, సీసం, ఇత్తడి, పంచలోహం, వెండి, బంగారం, పుష్యరాగం, పద్మరాగం, గోమేధికం, వజ్రం, వైఢూర్యం, ఇంద్రనీలం, ముక్తారత్నం, మరకతరత్నం, విద్రుమం, మాణిక్యం, వేయిస్తంభాల మంటపం, మనఃశాల మంటపం, బుద్ధిశాల మంటపం, అహంకారశాల మంటపం, సూర్యబింబశాల, చంద్రబింబశాల, శృంగారశాల మంటప ప్రాకారాలుంటాయి. ఈ ప్రాకారాల మధ్యనే చింతామణి గృహంలో అమ్మవారు పరాభట్టారిక రూపంలో ఉంటారు. దానినే శ్రీమన్నగరం అంటారు. ఒక్కో ప్రాకారానికి అర్చన చేస్తారు. పరాభట్టారికను సేవిస్తూ ఆమె అనుగ్రహం కోసం ఎదురు చూడటం శ్రీచక్ర పూజలోని అంతరార్థం. శ్రీచక్రం చుట్టూ ఆరు చక్రాలు ఉంటాయి. ఆరు చక్రాలకు ఒక్కో విశిష్టత ఉంది. కాళి, తార, మహావిద్య, షోడశి, భువనేశ్వరి, భైరవి, ఛిన్నమస్తా, ధూమావతి, భగళ, మాతంగి పేరిట కొలుస్తారు. దసరా ఉత్సవాలలో అమ్మవారికి మరింత శక్తి కలగటానికి వివిధ అర్చనలు, హోమాలు చేస్తారు. మూలా నక్షత్రం నాడు అమ్మవారి పుట్టినరోజు కావటంతో ఆరోజున నవావరణార్చనకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తారు.

లక్ష కుంకుమార్చన..

ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలలో ప్రత్యేక లక్షకుంకుమార్చన నిర్వహిస్తారు. అమ్మవారికి కుంకుమ చాలా ఇష్టమైనది. కుంకుమ పూజ ఆర్థిక శ్రేయస్సును కలిగిస్తుంది. దీంతో పాటు సంతానం, శక్తి, తేజస్సుకు కుంకుమతో పూజచేసి అమ్మవారిని సంతుష్టురాలిని చేయటం ఈ పూజలో విశేషం. పసుపుతో మిళితం చేసిన కుంకుమను అమ్మవారికి సమర్పిస్తారు. లలితా సహస్రనామ పారాయణతో దుర్గమ్మవారి అనుగ్రహం కోసం ఈ పూజను చేస్తారు. వాస్తవంగా దసరా ఉత్సవాలు ముగిసేటప్పటికి లలితాసహస్రనామం లక్షసార్లు పారాయణం చేయాలనేది నియమం. అందుకనే దీనికి లక్ష కుంకుమార్చన అని పేరు. శుక్రవారం, మంగళవారాల్లో మూలా నక్షత్రం రోజున ఈ పూజ చేయటానికి భక్తులు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తారు.



ఖడ్గమాలార్చన..

అమ్మవారి సహస్రనామంతో కానీ, త్రిశతితో కాని, లేదా ఖడ్గమాలకు సంబంధించిన కొన్ని నామాలతో కాని ఈ పూజను నిర్వహిస్తారు. నవరాత్రులలో ఖడ్గమాల పూజ చేయటం ఎంతో శ్రేష్ఠంగా భావిస్తారు. వాస్తవంగా మహిషాసురుడిని ఆమె ఖడ్గంతోనే వధించారు. ఈ ఖడ్గానికే వేయి పేర్లు ఉన్నాయి. ఈ వేయి పేర్లతోనే అర్చన చేయటం వల్ల ఎంతో శక్తి లభిస్తుందని భూత, ప్రేత, పిశాచాది భయాలు ఉండవని నమ్మిక. ఖడ్గమాలార్చనకు రూ.5,116లు రుసుము చెల్లించి ప్రతిరోజూ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటారు.

చండీహోమం..

ఐం హ్రీం క్లీం చాముండాయే విచ్చే

కనకదుర్గమ్మ అనుగ్రహం కోసం చండీ హోమం చేస్తారు. దసరా మహోత్సవాలలో అమ్మవారు శక్తిరూపంలో పూజలు అందుకుంటుంది. శక్తి పూజలతో పాటు హోమం ద్వారా ఆమె సంతుష్టురాలవుతుందని నమ్మిక. భక్తులకు శక్తిని ఇవ్వటంతో పాటు బాధల నుంచి విముక్తులను చేయటం కోసం ఈ హోమాన్ని నిర్వహిస్తారు. 'ఓం ఐం హ్రీం క్లీం చాముండాయే విచ్చే' జపంతో ఆమెను కొలుస్తారు. జీవితంలో ఎదురయ్యే కష్ట నష్టాలను, ప్రతికూల శక్తులను, చెడు ప్రభావాలను ఈ హోమం తొలగిస్తుందని నమ్మిక. పూర్వం శుంభ, నిశుంభలనే రాక్షసులను సంహరించే సమయంలో అమ్మవారు చండీ అవతారం దాల్చారని పురాణాలలో ఉంది. అమ్మవారి స్వరూపాలలో చండీదేవికి అత్యంత ప్రాధాన్యత.





వెలగపూడిలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, స్పీకర్ అయ్యన్న, హోంమంత్రి అనితలకు ఆహ్వాన పత్రికలను అందజేస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్

దసరా ఉత్సవాలకు రండి..

▸▸ గవర్నర్, మంత్రులు, స్పీకర్‌లకు ఆహ్వానం





ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న దసరా మహోత్సవాలకు రావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణంరాజు, హోంమంత్రి అనిత, దేవదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తదితరులకు బుధవారం దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్, దుర్గగుడి ఈవో శీనానాయక్, ఆలయ ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్, అర్చకస్వాములు ఆహ్వాన పత్రికలు అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

దసరా ఏర్పాట్లపై మంత్రి ఆరా..

ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలను పురస్కరించుకుని దేవస్థానం అధికారులు చేపట్టిన ఏర్పాట్లపై దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సచివాలయంలోని తన ఛాంబర్‌లో దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్, కమిషనర్ కె.రామచంద్ర మోహన్, ఈవో శీనానాయక్, ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు, భద్రత, రవాణా ఏర్పాట్లను చేపట్టినట్టు అధికారులు మంత్రికి వివరించారు.



కృష్ణబాబుకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్టీసీ కార్మికపరిషత్ నేతలు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

▸▸ టిఆర్ అండ్ బి చీఫ్ సెక్రటరీకి కార్మిక నేతల వినతి

బస్‌స్టేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రవాణా, భవనాల శాఖ చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన ఎం.టి.కృష్ణబాబును ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కోరారు. బుధవారం బందరు రోడ్డులోని ఎంటీ కృష్ణబాబును ఆయన కార్యాలయంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరావు, జి.వి.నరసయ్య, పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కృష్ణబాబును శాలువాతో సత్కరించారు. అనంతరం ఆర్టీసీలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, కార్మికపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.శేషగిరిరావు తదితరులు ఎం.టి.కృష్ణబాబును బందరురోడ్డులోని ఆయన కార్యాలయంలో కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. యూనియన్ నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, ఎస్.కె.మొయిద్దీన్, జి.వి.ఎస్.నారాయణతదితరులు పాల్గొన్నారు.



తాడిగడపలో ర్యాలీ నిర్వహిస్తున్న ఇండియా కూటమి శ్రేణులు

ఓట్లు కొల్లగొట్టి ప్రజాస్వామ్యం ఖూనీ

▸▸ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు

పెనమలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఓట్లు దొంగిలించి దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. బుధవారం తాడిగడప సెంటరులో రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓట్ చోర్- గద్దె చోడ్' కార్యక్రమానికి మద్దతుగా జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పూర్తిగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు అమ్ముడుపోయి దేశంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ కొంతమంది కార్పొరేట్లకు మాత్రమే పనిచేస్తున్నదని ఆరోపించారు. ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా నియోజకవర్గ ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని నిరసన కవాతును చేస్తున్నామని తెలిపారు. ధనేకుల మురళి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో సీనియర్ నేతలు వెలిసెల సుబ్రహ్మణ్యం, మునిసిపాలిటీ అధ్యక్షుడు కొసనం రాము, సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి @ రూ.23.69కోట్లు

స్త్రీ శక్తి పథకం ఉమ్మడి కృష్ణా జిల్లాలో సూపర్ హిట్ అయ్యింది. తొలి నెల రోజుల్లో రికార్డు స్థాయిలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. 78,45,962 మంది ప్రయాణికులకు రూ.23.69 కోట్ల రాయితీని ప్రభుత్వం కల్పించింది. మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసే ప్రభుత్వంగా వారి మన్ననలు పొందుతోంది. అయితే మహిళల సంఖ్య భారీగా పెరగడంతో పురుషులకు కూర్చోవడానికి సీట్లు ఉండటంలేదని, చెరిసగం సీట్లు కేటాయించాలన్న డిమాండ్ మగవారి నుంచి సర్వత్రా వ్యక్తమవుతోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): స్త్రీ శక్తి పథకం ద్వారా ఉమ్మడి కృష్ణాజిల్లాలో తొలి నెల రోజుల్లో 78,45,962 మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. మహిళలకు ప్రభుత్వం తరఫున అందించిన టికెట్ల రాయితీ విలువ రూ.23,69,32,651గా ఉంది. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారులు గణాంకాలను విడుదల చేశారు. గత ఆగస్టు 15వ తేదీన స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. సెప్టెంబరు 15వ తేదీతో నెల రోజులు పూర్తి చేసుకుంది. ఎన్టీఆర్ జిల్లాలో 51,57,863 మంది మహిళా ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఆటోనగర్, గవర్నర్‌పేట-1, గవర్నర్‌పేట-2, ఇబ్రహీంపట్నం, జగ్గయ్యపేట, తిరువూరు, విద్యాధరపురం, విజయవాడ బస్ డిపోల పరిధిలో విజయవాడ సబర్బన్, రూరల్ ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించారు. ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోని మహిళలకు రూ.14.37 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం కల్పించింది. కృష్ణాజిల్లాలో 26,88,099 మంది మహిళా ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. అవనిగడ్డ, గన్నవరం, గుడివాడ, మచిలీపట్నం, ఉయ్యూరు బస్‌డిపోల పరిధిలో మొత్తం 288 షెడ్యూల్స్‌లో మహిళలు రాకపోకలు సాగించారు. విజయవాడకు ఎక్కువ సంఖ్యలో వెళ్లి వచ్చారు. జిల్లాలో మహిళలకు ప్రభుత్వం తరఫున జీరో ఫేర్ టికెట్ల ప్రాతిపదికన రూ.9.31 కోట్ల సబ్సిడీని భరించటం జరిగింది.

ఆర్టీసీ స్థూల ఆదాయంలో ఒక వంతు రాయితీ

ఆర్టీసీ బస్సుల్లో ప్రధానంగా మహిళలకు సిటీ ఆర్డినరీ, మెట్రోఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్.. ఈ ఐదు బస్సులలో జీరో ఫేర్ టికెట్ రాయితీ కల్పిస్తున్నారు. ఈ బస్సులలో 60 శాతం అంతకు మించి మహిళా ప్రయాణికుల ఆక్యుపెన్సీ ఉంది. మిగిలిన డీలక్స్, సూపర్ లగ్జరీ, ఇంద్ర, నైట్‌రైడర్, గరుడ, అమరావతి. డాల్ఫిన్ బస్సులలో రాయితీ లేదు. స్థూలంగా అన్ని బస్సుల విషయానికి వస్తే ఒక వంతు మహిళా ప్రయాణికుల శాతం ఉంటోంది. హై ఎండ్ బస్సులలో పురుషుల ప్రయాణాల శాతం ఎక్కువగా ఉండటం వల్ల ఓవరాల్‌గా చూస్తే మహిళలకు ఒక వంతు రాయితీ పోగా.. సగ భాగం డైరెక్టుగా ఆదాయం వస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో ఆర్టీసీకి రూ.38.68 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఆదాయంలో ఇప్పటి వరకు చూస్తే రూ.14.37 కోట్ల మేర మహిళలకు రాయితీగా ప్రభుత్వం ఇచ్చింది. స్థూలంగా చూస్తే.. రూ. 24.81 కోట్ల ఆదాయం ఆర్టీసీ అందిపుచ్చుకుంది. కృష్ణాజిల్లాలో మొత్తంగా రూ.15.03 కోట్ల మేర స్థూల ఆదాయం వచ్చింది. ఇందులో రూ.9.31 కోట్ల మేర మహిళలకు సబ్సిడీ కింద పోతే రూ. 6.72 కోట్ల మేర ఆర్టీసీకి మహిళాయేతర ప్రయాణికుల ఆదాయం వచ్చింది.

నెల రోజుల్లో పెనుమార్పులు

ఆర్టీసీలో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించిన నెల రోజుల్లో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. ప్రధానంగా విజయవాడ, మచిలీపట్నం, గుడివాడ, కంకిపాడు, గన్నవరం, కొండపల్లి వంటి ప్రాంతాలలో ఉద్యోగాలు చేసుకోవటానికి రాకపోకలు సాగించే మహిళలంతా కూడా పూర్తిగా ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. విజయవాడలో చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు, షాపింగ్ వంటివాటికి వచ్చే మహిళలంతా ఆర్టీసీ బస్సులను ఉపయోగించుకుంటున్నారు. దీంతో సబర్బన్ పరిధిలో రూరల్ ప్రాంతాల నుంచి పైన చెప్పుకున్న నగర, పట్టణ ప్రాంతాలకు వచ్చే బస్సులలో నూటికి 80 శాతం మహిళలే ప్రయాణిస్తున్నారు. మహిళా ప్రభంజనంతో పురుషులు పాసులు రద్దు చేసుకుని ప్రత్యామ్నాయ రవాణా చూసుకుంటున్నారు.

పురుషులకు సీట్ల రిజర్వేషన్‌పై చర్చ!

మహిళలకు రాయితీ ఇస్తున్న బస్సుల్లో వారి సంఖ్య అధికంగా ఉంటోంది. దీంతో పురుషులు బస్సుల్లో ఎక్కి ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడుతోంది. భారత హేతువాద సంఘం దీనిని విస్తృతంగా చర్చనీయాంశం చేస్తోంది. ఆ సంస్థ అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య మహిళలకు, పురుషులకు ఆర్టీసీ బస్సుల్లో చెరి సగం సీట్ల రిజర్వేషన్ ఉండాలన్న వాదన తెరపైకి తెచ్చారు. చాలా మంది పురుషులు కూర్చోవటానికి సీట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, వీరిలో సీనియర్ సిటిజన్స్ అధికంగా ఉన్నారని చెబుతున్నారు. పురుషులకు కూడా ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నారు.

జోగి.. నానా యాగీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ఇబ్రహీంపట్నం) : మైలవరం నియోజకవర్గంలో మాజీమంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ సరికొత్త రాజకీయానికి తెరలేపారు. స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను లక్ష్యంగా చేసుకుని, ప్రజలను పక్కదారి పట్టించేలా వ్యవహరిస్తున్న ఆయనపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూలపాడులోని బూడిద డంపింగ్ యార్డు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్‌దేనంటూ జోగి నానా యాగీ చేశారు. వాస్తవానికి ఈ డంపింగ్ యార్డు కూటమి నాయకుడిదే అయినా ఇప్పటిది కాదు. చాలా పాతది. ట్రాన్స్‌పోర్టర్లు బూడిదను తరలించేటపుడు నారాయణ అనే కూటమి నాయకుడు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ డంప్ చేశారు. జోగి రమేశ్ హడావిడిపై స్పందించిన నారాయణ.. లేనిపోని ఆరోపణలు చేయడమే కాదని, మీడియా సమక్షంలో దమ్ముంటే అక్కడకు రావాలని సవాల్ విసిరారు. అయితే, బుధవారం మూలపాడులో బూడిద డంప్ చేసిన ప్రాంతానికి వెళ్లేందుకు జోగి రమేశ్ విశ్వప్రయత్నం చేశారు. వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా శ్రేణులు తరలివస్తారని భావించినా కేవలం 50 మంది లోపే వచ్చారు. జోగి ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. మూలపాడు వెళ్లేందుకు బయటకు వచ్చిన ఆయన్ను పది అడుగులు వేయకుండానే వ్యాన్‌లో ఎక్కించి భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్ ఆంక్షలను ఉల్లంఘించి, అనుమతులు లేకుండా మూలపాడు బూడిద డంపింగ్ యార్డుకు అనుచరగణంతో వెళ్తున్న జోగి రమేశ్, అతని అనుచరులు మరో 14 మందిపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమ వ్యాపారాన్ని మరిచారా?

వైసీపీ అధికారంలో ఉండగా, మాజీమంత్రి జోగి నాలుగు ఎకరాల స్థలంలో పెద్ద ఎత్తున బూడిద డంపింగ్ చేసి విచ్చలవిడిగా వ్యాపారం చేశారు. ఆయన సోదరుడు ఏకంగా కొన్ని ప్రాంతాల్లో ఉన్న ఎమ్మెల్యేల నుంచి లేఖలు తెచ్చి ప్రభుత్వ పక్కా గృహాలకు బూడిద రవాణా చేసి సొమ్ము చేసుకున్నాడని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని నాడు ఇష్టానుసారంగా బూడిద అక్రమ వ్యాపారం చేసిన జోగి నేడు నీతులు చెబుతున్నారని కూటమి నేతలు పేర్కొంటున్నారు. వైసీపీ హయాంలో 25కు పైగా బూడిద డంపింగ్ యార్డులు నడిచాయి. అధికారంలో ఉండగా ఎన్టీటీపీఎస్ యాజమాన్యంతో మాట్లాడి ఏనాడూ ఒక్క మొక్క నాటించలేదు. సీఎస్ఆర్ ఫండ్స్ విడుదల చేయించి ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని చేయించలేదు. కృష్ణాజలాల్లో కలుస్తున్న బూడిద నీళ్ల శుద్ధి విషయంలోనూ నోరు మెదపలేదు. స్థానిక ట్రాన్స్‌పోర్టర్ల సమస్యలను పరిష్కరించింది లేదు. ఇప్పుడు మాత్రం శాంతిభద్రతలను రెచ్చగొట్టేలా జోగి ప్రవర్తిస్తున్నారు.

కావాలనే రచ్చ

ఇటీవల జెన్‌కో టెండర్లు పిలిచి బల్క్‌గా బూడిద తరలింపును ఒక కాంట్రాక్టు సంస్థకు అప్పగించింది. దీంతో కాంట్రాక్టు సంస్థ పర్యవేక్షణలోనే ఈ రవాణా జరుగుతోంది. తమకు బూడిద అందనీయకుండా చేస్తున్నారని స్థానిక ట్రాన్స్‌పోర్టర్లు ఓవైపు ఆందోళన చేస్తున్నారు. ప్రస్తుతం ట్రాన్స్‌పోర్టర్లు తోలుకోవటానికి జెన్‌కో అనుమతించట్లేదు. బూడిద తరలింపునకు బల్క్‌గా రవాణా చేసేందుకు టెండర్లు పిలిచిన తరుణంలో ప్రైవేట్‌గా బూడిదను డంపింగ్ చేసుకోవటానికి ఎలాంటి అవకాశం లేదు. కానీ, ఏదో జరిగిపోతున్నట్టుగా జోగి బూడిద రాజకీయం చేస్తున్నారు. తమ పొట్టకొట్టారని, తమకు బూడిద ఇవ్వకుండా జెన్‌కో పెద్ద సంస్థకు అప్పగించిందని స్థానిక ట్రాన్స్‌పోర్టర్లు ఆందోళన చేస్తున్నారు. ఇలాంటప్పుడు ఎమ్మెల్యేదిగా ఆరోపిస్తున్న డంపింగ్ యార్డుకు బూడిద ఎలా వెళ్తుందో అర్థంకాని ప్రశ్న. లేని సమస్యను ఉన్నట్టుగా చూపే ప్రయత్నం చేయటం, దానిపై రాజకీయం చేయటం ద్వారా మైలవరం నియోజకవర్గంలో శాంతిభద్రతల సమస్యను తీసుకొస్తున్నారు. జెన్‌కో నిర్ణయంతో ఉచిత బూడిద లోడింగ్ లేక తమకు న్యాయం చేయాలంటూ ఓపక్క స్థానిక ట్రాన్స్‌పోర్టర్లు బూడిద కాలుష్య పీడిత గ్రామాల్లో ప్రజలు, పార్టీల మద్దతు కూడగడుతుండగా, వారికి సంఘీభావం ఇవ్వకుండా, ఉద్యమంలో నేరుగా పాల్గొనకుండా జోగి ఇలా కుటిల రాజకీయాలకు తెరలేపడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దళితులపై పెరిగిన దాడులు

▸▸ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

గాంధీనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులపై అధికార, ప్రతిపక్షాలు స్పందించడం లేదని పలు దళిత, ప్రజా సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక దళితులపై దాడులు అధికమయ్యాయని మండిపడ్డారు. ప్రభుత్వంలోని దళిత నాయకులు ఈ దాడులను ఖండించకపోవడం బాధాకరమన్నారు. కైకలూరు నియోజకవర్గంలోని దానగూడెం గ్రామంలో దళితులపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ఉప్పులేటి దేవీప్రసాద్, ఎస్సీ కమిషన్ మాజీ ఛైర్మన్ విక్టర్‌బాబు, జైభీంరావు పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రాష్ట్రంలో దళితులపై దౌర్జన్యాలు పెరిగాయన్నారు. అక్టోబర్ 18న ఏలూరులో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది.

నిరుద్యోగ సమస్యపై అసెంబ్లీలో చర్చించాలి

▸▸ నిరుద్యోగి ఆవేదన సదస్సులో వక్తలు

గాంధీనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పలువురు వక్తలు విమర్శించారు.. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యపై చర్చించాలని వారు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో " నిరుద్యోగి ఆవేదన సదస్సు" గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ, ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వశాఖల్లోని ఖాళీలపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పోరాటాలకు నిరుద్యోగి ఆవేదన సదస్సు నాంది పలకాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా, నగర కార్యదర్శులు దోనేపూడి శంకర్, జి.కోటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు జి.వలరాజు, బి.నాజర్ జీ తదితరులు పాల్గొన్నారు.

రాజధాని అసైన్డ్ రైతులకు ఊరట!

(5వ పేజీ తరువాయి)

పట్టాల్లో అసైన్డ్ అనే పదం ఉండగా, దాన్ని తొలగించాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేశ్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీచేయడంతో సమస్యకు పరిష్కారం లభించినట్టయింది.

3,139 మంది అసైన్డ్ రైతులకు ఊరట

రాజధాని అమరావతి నిర్మాణం కోసం 3,139 మంది అసైన్డ్ రైతులు 2,689.14 ఎకరాల భూములిచ్చారు. వీరు ఇచ్చిన భూములకు సంబంధించి సీఆర్డీఏ ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల పట్టాలు సమస్యాత్మకంగా తయారయ్యాయి. రైతులకు ఇచ్చిన పట్టాల్లో వారు ప్రభుత్వానికి ఇచ్చిన భూమి స్వభావాన్ని తెలియజేస్తూ 'అసైన్డ్' అనే పదాన్ని చేర్చారు. దీన్ని ఆసరా చేసుకుని దళారులు రైతులను ఇష్టారాజ్యంగా దోచుకుతిన్నారు.ఈ నేపథ్యంలో వారంతా సీఎం చంద్రబాబుకు మొరపెట్టుకున్నారు. వారి వినతిని ఆలకించిన సీఎం దిద్దుబాటు చర్యలకు ఆదేశించారు. రెండు నెలల తరువాత ఇప్పటికి రాష్ట్ర పురపాలక శాఖ జీవో జారీ చేసింది.

సవరణ ఇలా..

తాజాగా ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం రైతులకు జారీచేసిన పట్టాల్లో భూ సమీకరణ చట్టంలో 9.24లోని కాలం నెంబర్ 7, రూల్ నెంబర్ 11(4) క్లాజ్‌ను మార్చాలని సూచించింది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రిటర్నబుల్ ప్లాట్ల పట్టాదారులకు యాజమాన్య హక్కు కల్పిస్తూ పట్టాలు జారీ చేయాలని సూచించింది.

గతంలో 'నాట్ ట్యాలీడ్' నుంచి విముక్తి

రాజధాని కోసం అసైన్డ్ రైతులు ఇచ్చిన భూములపై గత వైసీపీ సీఐడీ విచారణ తంతు నడిపించి, ఆ భూములను 'నాట్ ట్యాలీడ్' జాబితాలో పెట్టింది. ఆ కారణంగా 3,139 మంది కష్టాలపాలయ్యారు. గత ప్రభుత్వం చివరి మూడేళ్లు వారికి కౌలు కూడా అందకుండా చేసింది. దీంతో రాజధాని పరిధిలోని అసైన్డ్ రైతులు నరకం అనుభవించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఆ సమస్యపై దృష్టి సారించింది. వారికి సీఐడీ కేసుల నుంచి విముక్తి కల్పించి, కౌలు బకాయిలు మొత్తంగా చెల్లించింది. తాజాగా వారికి యాజమాన్య హక్కులు కల్పిస్తూ మరో ఊరటనందించింది.

జీవో 114 అమలు చేయాలి

▸▸ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ నేతలు

ధర్నా చౌక్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ కారణంగా చివరిదశలో నిలిచిపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్స్ రెగ్యులరైజేషన్ ప్రక్రియను పునఃప్రారంభించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ గవర్నమెంట్ కాలేజీస్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవో 114ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ధర్నాచౌక్‌లో 36 గంటల మహిళా దీక్ష బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేవలం విద్యావ్యవస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ నిలిచిపోయిందన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ జేఏసీ ఛైర్మన్ ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ, 2023 అక్టోబర్‌లో జారీచేసిన జీవో ప్రకారం కాంట్రాక్ట్ లెక్చరర్లను నేటికీ రెగ్యులర్ చేయకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి 2014కు ముందు నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు అందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షప్రధానకార్యదర్శులు వై.జాన్‌బాబు, జీఎల్.మాణిక్యం మాట్లాడుతూ జీవో 114 పై ప్రభుత్వం స్పందించాలని లేదంటే భవిష్యత్‌లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని, నిరవధిక సమ్మెకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.



ఆపరేషన్ వివరాలు చెబుతున్న డాక్టర్ షణ్ముక్ తుమాటి

కామినేనిలో విజయవంతంగా మోకీలు శస్త్రచికిత్స

మొగల్రాజపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : అత్యంత క్లిష్టమైన మోకీలు మార్పిడి శస్త్రచికిత్స చేసి రోగి 24గంటల్లో నడిచేలా చేయగలిగామని కామినేని హాస్పటల్ ఆర్థోపెడిక్, ట్రామా అండ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ డాక్టర్ షణ్ముఖ్ తుమాటి చెప్పారు. మొగల్రాజపురంలోని ఓ హోటల్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మెదడులో రక్తం గడ్డకట్టిన స్థితిలో ఉన్న కంకిపాడుకు చెందిన మహిళ(57)కు విజయవంతంగా ఆపరేషన్ చేసినట్టు తెలిపారు. ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ఆర్ఎస్ వర్ధన్ మాట్లాడుతూ, అన్ని విభాగాల వైద్యుల సహాయంతో ఆపరేషన్‌లు విజయవంతంగా చేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో కామినేని క్లస్టర్ హెడ్ పి.సునీల్ కుమార్, మార్కెటింగ్ హెడ్ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో యాత్రీ సేవ

గన్నవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం యాత్రీ సేవ దివస్ (ప్రయాణికుల సేవ దినోత్సవం)ను ఘనంగా నిర్వహించారు. విమానాల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు స్వాగతం పలికారు. త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి, డిప్యూటీ సీఎం కె.పవన్ కల్యాణ్, కేంద్ర కమ్యూనికేషన్ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌లు మొక్కలు నాటి నీళ్లు పోశారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. విమానాశ్రయానికి రాకపోకలు సాగించే ప్రయాణికులందరికీ స్వాగతం, ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు, రక్తదానం, క్యాబ్/ట్యాక్సీ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. విమానాశ్రయం గురించి పాఠశాల పిల్లలకు వివరించారు. విమానయాన రంగంలో కెరీర్ అవకాశాల గురించి అవగాహన కల్పించారు. జానపద నృత్యం, ప్రముఖ వ్యక్తులు, దేశభక్తి, థీమ్‌పై పాఠశాల పిల్లలకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విమానాశ్రయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. పలువురు ప్రయాణికులు.. డిప్యూటీ సీఎం పవన్, కేంద్ర మంత్రి పెమ్మసాని, మోదీ కటౌట్‌తో ఫొటో దిగారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెట్ వేగం

(5వ పేజీ తరువాయి)

సంస్థ ఈ పనులు దక్కించుకుంది. ముందుగా 10 వేల ఇళ్లకు టెండర్లు పిలవగా, 7 వేలలోపు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 70 శాతం మేర పూర్తయ్యాయి. ఇదే సందర్భంలో ఇక్కడ నివసించే ప్రజలంతా స్థానికంగానే పనిచేసుకోవటానికి వీలుగా నాలుగు ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ టవర్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి నిర్మాణ బాధ్యతలను అప్పట్లో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌కు అప్పగించింది. రూ.147 కోట్లతో మొదటి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు పనులు చేపట్టారు. దాదాపు టవర్ స్ట్రక్చర్ నిర్మాణం పూర్తయింది. గోడలు, ఇంటీరియర్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, పెయింటింగ్ వంటి పనులు మిగిలాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక.. ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరి బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్ధార్థనగర్ ఒకటవ రోడ్డు నుంచి 5వ రోడ్డు వరకు, మోడరన్ సూపర్ మార్కెట్ ఏరియా, సిద్ధార్థ కాలేజీ జంక్షన్, నవోదయ కాలనీ, ఎస్‌బీహెచ్ కాలనీ, సున్నపుబట్టీల సెంటర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాణిగారితోట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు ఆసరాగా నిలుస్తోందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 22వ లో బుధవారం మలేరిమా ఆసుపత్రి వద్ద ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 74 మందికి మంజూరైన రూ.60లక్షల విలువైన చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో అత్యవసరంగా వైద్య చికిత్సలు చేయించుకున్న వారందరూ సీఎంఆర్‌ఎఫ్ కు దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు, బీజేపీ నాయకులు కొలపల్లి గణేష్, శివ, అన్నారావు, నామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రింగ్‌రోడ్డులో నిలిచిన సిమెంట్‌లోడు వాహనం

● నిలిచిన ట్రాఫిక్

గుణదల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిమెంట్ లోడుతో వెళుతున్న వాహనం రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో వెనుక చక్రం విరిగిపోయింది. దీంతో వాహనం రింగ్‌లోనే అడ్డుగా ఉండిపోవడంతో బుధవారం ఉదయం వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. బెంజిసర్కిల్ వైపు నుంచి వచ్చే వాహనాలు భారీగా నిలిచి పోయాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ సీఐ రమేష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను క్రమబద్ధీకరించారు. వెనుక చక్రం విరిగిన సమయంలో పక్కనే వాహనాలు లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది.

ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలే తొలగిస్తాం

సర్కిల్ 3 ఇన్‌చార్జి ఎస్‌కే బాజి

గుణదల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో ఉన్న ఆక్రమణలను మాత్రమే తాము తొలగిస్తున్నామని సర్కిల్ 3 ఇన్‌చార్జి ఎస్.కె.బాజి తెలిపారు. గుణదల పుల్లేటికట్ట రోడ్డులో జరుగుతున్న ఆక్రమణల తొలగింపు పనులను బుధవారం ఆయన పర్యవేక్షించారు. పుల్లేటికట్ట రోడ్డును మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగుల రోడ్డుగా విస్తరించనున్నట్లు తెలిపారు. అదే సమయంలో ఈఎస్ఐ హాస్పటల్ జంక్షన్ నుంచి గుణదల సెంటర్ వరకు అక్కడ నుంచి రైవస్ కాల్వలోకి కలిసే అండర్ పాస్ డ్రెయిన్ వరకు ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగించి డ్రెయిన్ విస్తరణ, రోడ్డు విస్తరణ పనులు ఏకకాలంలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఆక్రమణల తొలగింపులో ఎక్కడైనా ప్రైవేటు భూమి ఉంటే అటువంటి వారికి బాండ్లు ఇవ్వడం, ప్రత్నామ్నాయంగా ఇల్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. మిగిలిన వారి విషయంలో ప్రభుత్వం నుంచి తమకెలాంటి సందేశాలు అందలేదన్నారు.

డ్రెయినేజీ విస్తరణ వల్ల లయోల గార్డెన్స్, పిన్నమనేని పాలిక్లినిక్‌రోడ్, రమేష్ హాస్పటల్ రోడ్డులో ఉన్న కాలనీలు జలమయం కాకుండా కాపాడుకోవచ్చన్నారు. మహానాడు రోడ్ జంక్షన్ నుంచి గుణదల వైపు వచ్చే వాహనాలు ట్రాఫిక్ సమస్య లేకుండా తక్కువ సమయంలో గమ్యం చేరుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.



ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న సర్కిల్ - 3 ఇన్‌చార్జి ఎస్‌కే బాజి

కలెక్టరేట్‌లో ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశపు మందిరంలో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్ లక్ష్మీశ విశ్వకర్మ చిత్రపటానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ యోజన ద్వారా సాధికారత కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. చేతివృత్తుల కళాకారుల జీవన ప్రమాణాలు పెంచేందుకు ఇటువంటి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ఆర్టీసీ హౌస్‌లో... ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలోని ఆర్టీసీ హౌస్‌లో జరిగిన విశ్వకర్మ జయంతి వేడుకలలో ముఖ్య అతిథిగా సంస్థ చీఫ్ మేనేజర్ (పర్సనల్), బోర్డు సెక్రటరీ వి.శ్రీధర్ పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్టీసీ హెచ్‌ఆర్ అండ్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో సంస్థ డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ జి.పాణిచక్రతేజ, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.వెంకట్రావు, పలు విభాగాల అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఆర్టీసీ చీఫ్ మేనేజర్, బోర్డు సెక్రటరీ శ్రీధర్

వృద్ధుల ఆస్తి హక్కు రక్షణకు ప్రత్యేక చట్టాలు

● మచిలీపట్నం జిల్లా న్యాయాధికార సేవాసంస్థ సెక్రటరీ రామకృష్ణయ్య



మాట్లాడుతున్న రామకృష్ణయ్య చిత్రంలో డాక్టర్ కీర్తి

బెంజిసర్కిల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల ఆస్తి హక్కు రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమల్లో ఉన్నాయని మచిలీపట్నం జిల్లా న్యాయాధికార సేవాసంస్థ సెక్రటరీ కేవీ రామకృష్ణయ్య తెలిపారు. బుధవారం వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఎస్‌బీఐ గరిమా ప్రాజెక్ట్ సహకారంతో సీనియర్ సిటిజన్ల హక్కులు, చట్టాలు, అందుబాటులోని సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు ప్రతి ఒక్కరూ తమకు చట్టపరంగా లభించే హక్కులు, సేవలను తెలుసుకోవాలన్నారు. వాసవ్య మహిళా మండలి ప్రతినిధి డాక్టర్ కీర్తి మాట్లాడుతూ వృద్ధులకు మానసిక, శారీరక, ఆర్థిక భద్రత కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబూరావు, కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఏసీపీ ప్రసాద్, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వాసవ్య మహిళా మండలి కార్యవర్గ సభ్యులు సుభాషిణి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదానానికి అందరూ ముందుకు రావాలి

● రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వెలగా జోషి

భారతీనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రక్తదానానికి అందరూ ముందుకు రావాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వెలగా జోషి తెలిపారు. ప్రధాని మోదీ 75వ జన్మదినం సందర్భంగా అఖిల భారతీయ తెరపాత్ యువక్ పరిషత్ సహకారంతో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువక పరిషత్ సభ్యులు వికాస్‌జైన్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ వెలగా జోషి హాజరై మాట్లాడారు. ఈ కళాశాలలో పనిచేసే ప్రొఫెసర్ ఎం.రామకృష్ణ 30వ సారి రక్తదానం చేయటం అందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటరీ చిట్టిబాబు, సొసైటీ డాక్టర్ మదన్, యువక పరిషత్ సభ్యులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో డాక్టర్ వెలగా జోషి, చిట్టిబాబు, తదితరులు

దెబ్బతిన్న అంతర్గత రోడ్డు



● వాహనదారుల అవస్థలు

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి : పటమట అంబేడ్కర్ నగర్ నుంచి దర్శిపేట సెంటర్‌కు వెళ్లే మార్గంలో అంతర్గత రోడ్డు దెబ్బతినడంతో ఆ మార్గంలో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందికరకంగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్గత రోడ్డు అక్కడక్కడ గోతులు ఏర్పడ్డాయని, కొన్ని చోట్ల డ్రెయినేజీ మూతల వద్ద గోతులతో ఆ రోడ్డులో ప్రయాణం ఇబ్బందికరంగా ఉందంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

16 ఏళ్లుగా కార్మికులకు వైద్య సేవలు

● ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులో ఉచిత వైద్యశాల



ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జవహర్ ఆటోనగర్‌లోని వంద అడుగుల రోడ్డులో గత 16ఏళ్లగా నడుస్తున్న ఉచిత వైద్యశాల కార్మికులకు సేవలు అందిస్తోంది. ఆటోనగర్‌లోని ఏ కార్మికుడికి అయినా అత్యవసరంగా ప్రాథమిక వైద్యసేవలు అవసరమైతే ఉచితంగా ఈ వైద్యశాలకు వచ్చి సేవలు పొందవచ్చు. ఇది ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజులు ఉదయం 10నుంచి సాయంత్రం 6గంటల వరకు నడుస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏఎన్ఎం సునీత, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఒక వైద్యుడు అందుబాటులో ఉంటారు. ఈ వైద్యశాలకు వచ్చి చికిత్స పొందిన వారికి అవసరాన్ని బట్టి మందులు ఉచితంగా అందజేస్తారు. ఉచితంగా బీపీ కూడా చూస్తారు. రోజూ సుమారు 35 నుంచి 40 మంది వరకు ప్రాథమిక చికిత్స కోసం వస్తుంటారు.

కార్మికుల వైద్య సేవలు కోసమే...

జవహర్ ఆటోనగర్‌లోని వివిధ సంస్థల్లో పనిచేసే కార్మికులకు అనుకోకుండా ఆరోగ్య ఇబ్బందులు ఎదురైతే ప్రాథమిక చికిత్స నిమిత్తం ఈ వైద్యశాల దోహదపడుతోంది. 2009లో ఈ వైద్యశాలను ఏర్పాటు చేసి 16ఏళ్లగా విజయవంతంగా నడుపుతున్నాం. ఒక ఏఎన్ఎం, ఒక వైద్యుడు ఇక్కడ అందుబాటులో ఉంటారు. అవసరమైన కార్మికులందరూ దీనిని సక్రమంగా వినియోగించుకోవాలి.

- నాగుమోతు రాజా, ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు



నీటమునిగిన రోడ్లను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

భారీ వర్షానికి 18వ డివిజన్‌లో రోడ్లు జలమయం

● టీడీపీ నేతల పరిశీలన

రాణిగారితోట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రాణిగారితోట 18వ డివిజన్‌లోని రోడ్లు జలమయమయ్యాయి. దీంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడ్డారు. వర్షం నీరు వెళ్లేందుకు సరైన నీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో వర్షం నీరు పోవడానికి గంటల కొద్దీ సమయం పట్టింది. నీట మునిగిన రోడ్లను టీడీపీ నేతలు పరిశీలించారు. డివిజన్‌లో మోకాలు లోతు నీరు నిలవడం కార్పొరేటర్ నిర్లక్ష్యమేనని స్థానిక టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. డివిజన్‌లో అండర్ గ్రౌండ్ వ్యవస్థను కోట్లు ఖర్చుపెట్టి మరి పూర్తిగా నిర్వీర్యం చేయడంతో పాటు సైడ్ కాల్వలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకువెళ్లి సైడ్ కాల్వలు అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని టీడీపీ నేతలు తెలిపారు.



క్రీస్తురాజపురంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న గద్దె క్రాంతి కుమార్

విజయవాడ ఉత్సవ్ విజయవంతం చేయాలని బైక్ ర్యాలీ

గుణదల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఉత్సవ్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మొగల్రాజపురం, క్రీస్తురాజపురం, గుణదల, మాచవరం ప్రాంతాల్లో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని పలు రాష్ట్రాల్లో ఉన్న సంస్కృతి సంప్రదాయాలు ఏపీలోని కళలు, సంప్రదాయాలు ఉట్టిపడేలా విజయవాడ ఉత్సవ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుందని తెలిపారు. విజయవాడ ఉత్సవ్ ప్రమోషన్‌లో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. యువత విజయవాడ ఉత్సవ్ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దాసరి గాబ్రియేలు, పడాల గంగాధర్, చెన్నుపాటి ఉషారాణి, పటమట సతీష్ చంద్ర, పాల్గొన్నారు.

ఉత్సవ్ అడ్డుకునేవారికి హైకోర్టు తీర్పు చెంపపెట్టు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్

వన్‌టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఉత్సవ్ అడ్డుకునేవారికి హైకోర్టు తీర్పు చెంపపెట్టు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) అన్నారు. బుధవారం ఆయన హనుమాన్‌పేటలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గొల్లపూడిలోని గొడుగు వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూముల విషయంలో బుధవారం ఏపీ హైకోర్టు కీలక తీర్పు వెల్లడించిందన్నారు. హైకోర్టు సింగిల్ బెంచ్ ఉత్తర్వుల పై డివిజన్ బెంచ్ స్టే ఇచ్చిందని ఆయన తెలిపారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని సహకారంతో విజయవాడ ఉత్సవ్ ఘనంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు కూటమి ప్రజా ప్రతినిధులు చేపడుతున్నారని తెలిపారు.

వెలగని వీధిలైట్లు



తూర్పు పరిధిలోని ఏపీఐఐసీ కాలనీ మెయిన్ రోడ్లో ఉన్న 11/5/2 నెంబరు, 11/5/5 నెంబరు విద్యుత్ స్తంభాలకు ఉన్న లైట్లు పనిచేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మెయిన్ రోడ్డు పలు చోట్ల చీకటిగా మారుతుంది. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

-భారతీనగర్, ఆంధ్రజ్యోతి

అన్న క్యాంటీన్‌లో మరమ్మతులు పూర్తి చేయండి

● నగర కమిషనర్ ధ్యానచంద్ర



ఆహారాన్ని పరిశీలిస్తున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

లబ్బీపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌లో ఏమైనా మరమ్మతులు ఉన్నట్లయితే ప్రథమ ప్రాధాన్యతతో పూర్తి చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కృష్ణలంక హైవే సాయిబాబా గుడి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌కు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగరాదని, నగరపాలక సంస్థ కల్పిస్తున్న సౌకర్యాలలో ఎటువంటి పొరపాట్లు ఉండకూడదని, పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరగాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, తాగు నీరు, వాడుకనీరు సరఫరాలో ఎటువంటి అంతరాయంలేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

గంజాయి తరలిస్తున్న చిత్తూరువాసి అరెస్టు

● 4.5 కేజీల గంజాయి స్వాధీనం

గుణదల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా నుంచి చిత్తూరుకు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఈగల్‌టీమ్ రామవరప్పాడు రైల్వేస్టేషన్ వద్ద బుధవారం అరెస్టు చేశారు. చిత్తూరుకు చెందిన ఎం.ఆర్య గత కొంత కాలం నుంచి ఒరిస్సాలోని చట్వా గ్రామంలో గంజాయి కొనుగోలు చేసి చిత్తూరు జిల్లాలోని అల్లమడుగు గ్రామానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నట్లు కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌కు సమాచారం అందింది. ఈ మేరకు ఎస్పీ ఆదేశాల మేరకు ఈగల్ టీమ్ సభ్యులు డాగ్ స్క్వాడ్‌తో బిలాస్‌పూర్ నుంచి తిరుపతి వెళుతున్న ట్రైన్లో తనిఖీలు చేపట్టారు. ట్రైన్ రామవరప్పాడు వచ్చే సరికి ఓ వ్యక్తి పరుగులు తీస్తుండటాన్ని గమనించిన పోలీస్ జాగిలం అతనిని పట్టుకుంది. దీంతో అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో ఉన్న 4.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

లయోలలో కంప్యూటర్ సైన్స్ ఫెయిర్

భారతీనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ ఫెయిర్ 2కే25 బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో డేటా సైన్స్, మొబైల్ యాప్ డెవలప్‌మెంట్, ఏఐ సైబర్ సెక్యూరిటీ, క్వాంటం కంప్యూటింగ్‌లో విద్యార్థులు వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ మెల్చియర్, కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ ఎ.రెక్స్ ఏంజెలో పాల్గొని విద్యార్థులకు సమాజంలో కంప్యూటర్ సైన్స్ ప్రభావాన్ని వివరించారు. హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ అధికారి నెహ్రూ, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ జి.కిరణ్‌కుమార్, ఫాదర్ జి.రాయప్ప, పలు పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు, స్టాఫ్ కో-ఆర్డినేటర్ కె.అపర్ణ పాల్గొన్నారు.



రేపల్లె ఆర్టీసీ డిపో ప్రాంగణంలో మొక్కలను నాటుతున్న సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఉద్యోగస్తులు

రాష్ట్రానికి 1,050 ఎలక్ట్రికల్ బస్సులు

» 1500 వివిధ రకాల నూతన బస్సులు

» స్త్రీశక్తి పథకం విజయవంతం: ఎండీ ద్వారకా తిరుమలరావు

రేపల్లె, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్టీసీని ఉన్నతస్థితికి తీసుకుని వెళ్లేందుకు 1,050 ఎలక్ట్రికల్ బస్సులు, వివిధ రకాల నూతన బస్సులు 1,500 తీసుకువస్తున్నామని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. బాపట్ల జిల్లా రేపల్లె ఆర్టీసీ డిపోలో బుధవారం స్త్రీశక్తి విజయోత్సవ సభ, ఉత్తమ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'స్త్రీశక్తి ఉచిత పథకం కోసం ఆరు నెలల ముందుగానే తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికలను సిద్ధం చేశాం. స్త్రీశక్తి పథకం ఇతర రాష్ట్రాల్లో కంటే మన రాష్ట్రంలోనే సజావుగా సాగుతుంది. 90 శాతం ఆక్యుపెన్సీ పెరిగింది. రేపల్లె డిపోతో సహా ఇప్పటి వరకూ 115 డిపోలు పరిశీలించా. స్త్రీశక్తి పథకంలో ఏర్పడిన ఇబ్బందులు ఏమైనా ఉంటే అడిగి తెలుసుకు న్నా. ప్రయాణికుల పట్ల డ్రైవర్లు, కండక్టర్లు స్నేహపూర్వకంగా మెలగాలి. ఆర్టీసీని మరింత బలోపేతం చేసే దిశగా సీఎం చంద్రబాబు సహకారంతో ముందుకు వెళుతున్నాం. కొత్త సర్వీస్‌లు రావటంతో ఆర్టీసీ మరింత బలోపేతమవుతుంది. రాష్ట్రంలో అన్ని డిపోలు ఆర్థికంగా బలపడేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నాం. ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగులందరికి మెరుగైన సౌకర్యాలు అందిస్తాం' అని ద్వారకా తిరుమలరావు తెలిపారు. అనంతరం డిపో ఆవరణలో పర్యావరణ పరక్షణలో భాగంగా మొక్కలను నాటారు.

ఏపీలో స్త్రీశక్తి సూపర్ సక్సెస్

» వినుకొండ సభలో మంత్రి గొట్టిపాటి రవి

వినుకొండ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కంటే ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీ శక్తి పథకం సూపర్ సక్సెస్ అయిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలోని గంగినేని కల్యాణ మండపంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం సూపర్ సిక్స్ - సూపర్ హిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'దేశంలో ఏ ప్రభుత్వం ఖర్చు చేయని విధంగా ఏపీలో పింఛన్‌దారులకు రూ.33 వేల కోట్లు అందిస్తున్నాం. భర్త చనిపోయిన 1.10 లక్షల మంది వితంతువులకు కొత్తగా పింఛన్లు అందజేశాం. త్వరలో 3 వేల ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేసి ప్రతి గ్రామానికి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తాం. నిరుపేద కుటుంబంలో పుట్టిన పిల్లలను ఎంబీబీఎస్ చదివించాలన్నదే ప్రభుత్వ విధానం. రాష్ట్రంలో పీపీపీ విధానంలో 17 వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తుంటే జగన్‌రెడ్డి అసత్య ప్రచారాలతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుంది' అని తెలిపారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ మాట్లాడుతూ, చంద్రబాబు దూరదృష్టి కారణంగా మహిళలు అన్ని రంగాల్లో సాధికారత, ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మహిళలతో భారీ ర్యాలీ, గర్భిణులకు సీమంతాలు, మహిళల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.



వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి

ఆసియా దేశాల్లో పిన్న వయస్కులకే పక్షవాతం

» పురుషుల కంటే స్త్రీలకే ఎక్కువ ప్రాణహాని

» రొమ్ము క్యాన్సర్ కన్నా స్ట్రోక్ మరణాలే అధికం

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): 'అమెరికా, యూరప్ దేశాలతో పోలిస్తే ఆసియా దేశాల్లోనే పక్షవాతం త్వరగా దాడి చేస్తోంది. అమెరికాలో 60, 70 ఏళ్ల పై బడిన వృద్ధుల్లో పక్షవాతం కనిపిస్తుంటే.. భారత్ వంటి ఆసి యా దేశాల్లో 40వ పడిలోనే పక్షవాతం బారిన పడుతున్నారు' అని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) జాతీ య అధ్యక్షురాలు, న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ విజయ తెలిపారు. జపాన్‌లోని హ్యోగో యూనివర్శిటీలో సెప్టెంబరు 13 నుంచి 15 వరకు జరిగిన ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ ఆసియా పసిఫిక్ స్ట్రోక్ కాన్ఫరెన్స్ (ఏపీ ఎస్‌సీ) 2025లో భారతదేశం నుంచి ఆహ్వానిత స్పీకర్‌గా ఆమె ప్రాతినిధ్యం వ హించారు. బుధవార ం గుంటూరులోని లలితా సూపర్ స్పెషా లిటీ హాస్పిటల్స్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ విజయ ఈ సదస్సు విశేషాలను తెలిపారు. ఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు హోదాలో హాజరైన తాను.. సదస్సులో సభ్య దేశాలతో సహకార రౌండ్ టేబుల్ ప్లాట్‌ఫాం కు నాయకత్వం వహించినట్లు తెలిపారు.



జపాన్‌లో సదస్సు ప్రాంగణంలో ఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ విజయ

పురుషుల కంటే స్త్రీలకే...

'పురుషులతో పోలిస్తే మహిళల్లో పక్షవాతం తీవ్రంగా దాడి చేస్తుంది. వీరిలో ప్రాణహాని కూడా ఎక్కువగానే ఉంటుంది' అని డాక్టర్ విజయ తెలిపారు. ముందస్తు రుతుచక్రం, హార్మోన్ మందుల వాడకం, గర్భం ధరించడం, పాలిసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ (పీసీవోడీ), సెరిబ్రల్ వీనస్ థ్రాంబోసిస్ (సీవీడీ), అధిక రక్తపోటు, ఎండోమెట్రియాసిస్, మెనోపాజ్ వంటివి ఇందుకు దోహదపడుతున్నట్లు ఆమె వివరించారు. మహిళల్లో పక్షవాతం వల్ల మరణాలు రొమ్ము కేన్సర్ కంటే రెండింతలు అధికంగా ఉంటున్నాయి. ఇటీవల పిల్లలు, ఇరవై ఏళ్లలోపు యువతలో కూడా పక్షవాత మరణాలు సంభవించడం ఆందోళన కలిగిస్తున్నాయి' అని డాక్టర్ విజయ వెల్లడించారు. దీనిపై తాము పరిశోధనలు జరుపుతున్నట్లు ప్రకటించారు.

ఈరోడ్ - జోగ్బానీ మధ్య అమృతభారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ - జోగ్బానీ - ఈరోడ్ మధ్య కొత్తగా అమృతభారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెడుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ ఎ.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే బోర్డు ఆమోదం మేరకు 16601 - 16602 ఈరోడ్ - జోగ్బానీ అమృతభారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 29 నుంచి నడుపుతున్నట్టు తెలిపారు. ఈ నెల 25వ తేదీ(గురువారం) ఈ కొత్త ఎక్స్‌ప్రెస్ ఈరోడ్ నుంచి ప్రారంభమవుతుందని జోగ్బానీ నుంచి ఆదివారం బయలుదేరుతుందని తెలిపారు.

సమాచార శాఖ ఏడీ మోహన్‌రావుకు సత్కారం

వన్‌టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార కేంద్రంలో సహాయ సంచాలకుడిగా పదోన్నతి పొందిన మోహనరావును కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, జేసీ ఎస్.ఇలక్కియా, ఆర్డీఓ ఎం.లక్ష్మీనరసింహులు కలెక్టరేట్‌లో అభినందనలు తెలిపి సత్కరించారు. ఇన్‌చార్జి డీపీఆర్‌వోగా బాధ్యతలు చేపట్టిన వై.బాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. డీఐపీఆర్‌ఓ కె.వి.రమణారావు, ఇన్‌చార్జి డీపీఆర్‌ఓ వై.బాలకృష్ణ, డివిజనల్ పీఆర్‌ఓ కె.రవి, ఎ.వి.ఎస్.వి.వి.ప్రసాద్, పాల్గొన్నారు.

ఉపనదుల నీటిని ఒడిసిపట్టాలి?

జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలకు ఉపనదులే వరం ● వైరా, మునేరు, కట్టలేరు, పాలేరు ఉప నదుల ద్వారా వృథాగా పోతున్న నీళ్లు

● ఈ నీళ్లన్నీ కృష్ణానదిలోకి వెళ్లి బ్యారేజీ మీదుగా సముద్రంపాలు ● ఒడిసిపట్టే చర్యలు చేపడితే పశ్చిమ ఎన్టీఆర్ బంగారమే..!

ఆంధ్రజ్యోతి, కంచికచర్ల: ఎన్టీఆర్ జిల్లాలోని జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో మునేరు, వైరాయేరు, కట్లేరు, పాలేరుతో పాటుగా ప్రధానమైన వాగులున్నాయి. ప్రతి ఏడాదీ కొన్ని టీఎంసీల నీళ్లు వృథాగా పోతున్నాయి. తాగు, సాగునీటికి ఈ రెండు నియోజకవర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ ఈ నీటిని వినియోగించుకునేందుకు పాలకులు, అధికారులు శ్రద్ధ చూపటం లేదు. వృథాగా పోతున్న ఎంతో విలువైన నీటిని ఒడిసిపట్టే దిశగా చర్యలు తీసుకోవటం లేదు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా పాకాల చెరువు నుంచి మునేరు ప్రారంభమవుతోంది. వరంగల్, ఖమ్మం జిల్లాల్లో కొద్దిపాటి వర్షం కురిసినా మునేటికి నీళ్లు వస్తాయి. వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు మండలాల మీదుగా మునేరు ప్రవహిస్తోంది. ఖమ్మం జిల్లా వైరా రిజర్వాయర్ నుంచి ప్రారంభమయ్యే వైరాయేరులో, తిరువూరు ప్రాంతం నుంచి వచ్చే కట్టలేరు, నందిగామ మండలం దాములూరు కూడలి, వీరులపాడు మండలం పల్లెంపల్లి గ్రామాల వద్ద విలీనమవుతుంది. అక్కడి నుంచి నందిగామ, వీరులపాడు మండలాల మధ్యగా ప్రవహించే వైరాయేరు కీసర వంతెన ఎగువ భాగంలో మునేటిలో కలిసిపోతుంది. ఈ మునేరు కంచికచర్ల మండలం మున్నలూరు, చందర్లపాడు మండలం ఏటూరు గ్రామాల మధ్య కృష్ణానదిలో కలుస్తోంది.



వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద బ్రిటీష్ హయాంలో నిర్మించిన చెక్‌డ్యామ్

బ్రిటీష్ హయాంలోనే చెక్‌డ్యామ్.. వేలాది ఎకరాలకు సాగునీరు

బ్రిటీష్ హయాంలో 1898లో వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద మునేటిపై చెక్‌డ్యామ్ నిర్మించారు. దీనివల్ల నందిగామ, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలకు చెందిన 30 వేల ఎకరాలకు సాగునీరందుతోంది. చెక్‌డ్యామ్ వద్ద పూడిక వేయటంతో మునేటిలో నీటి నిల్వ పరిమాణం తగ్గటం వల్ల ఆయకట్టుకు సజావుగా సాగునీరు అందటం లేదు. ఇక్కడే గేట్లు ఏర్పాటు చేసి రోడ్డు కమ్ బ్యారేజ్ కట్టేందుకు 2004లో మన పాలకులు శ్రీకారం చుట్టారు. పుష్కరం గడిచినప్పటికీ ఆనకట్ట పూర్తి కాలేదంటే పాలకులకున్న శ్రద్ధ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

కీసర వద్ద నీటి నిల్వకు పరిశీలించాలి

కీసర వద్ద మునేటి నీరు నిల్వకు గల అవకాశాలను అధికారులు పరిశీలన చేయాలని రైతులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. కీసర వద్ద మునేటిపై బ్రిటీష్ హయాంలో ఇనుప గడ్డర్లతో నిర్మించిన వంతెన పైభాగం కొద్దిగా 4 దశాబ్దాల క్రితం కూలిపోయింది. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నప్పటికీ వంతెన స్ట్రక్చరు బలంగానే ఉందంటున్నారు. నీటినిల్వకు అవసరమైతే ఈ స్ట్రక్చరును ఉపయోగించుకోవచ్చునని రైతు నేతలు చెపుతున్నారు.

చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి

మునేటిపై కీసర, పెనుగంచిప్రోలు, లింగాలతో పాటుగా పలుచోట్ల చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. గతంలో మండు వేసవి రోహిణి కార్తెలో సైతం మునేటిలో నీళ్లుండేవి. మారుతున్న వాతావరణం, అడ్డగోలు ఇసుక తవ్వకాలు ఇత్యాది కారణాలతో కొన్నేళ్ల నుంచి మునేరు డిసెంబర్‌లోనే ఎండిపోతోంది. నందిగామ, కంచికచర్ల పట్టణాలతో పాటు పలు గ్రామాలకు కీసర నుంచే తాగునీరు సరఫరా అవుతోంది. భూగర్భ జలాలు అడుగంటుతున్నందున సమీప భవిష్యత్తులోనూ నీరు దొరకని దుస్థితి ఏర్పడి తాగు, సాగునీరుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి చెక్‌డ్యామ్‌లు నిర్మించాలన్న ప్రతిపాదనలకు కార్యరూపం తీసుకురావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.



కీసర వద్ద బ్రిటీష్ హయాంలో ఇనుప గడ్డర్లతో నిర్మించిన వంతెన

ఆలయ భూముల్లో ఎగ్జిబిషన్‌కు హైకోర్టు అనుమతి

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ, గొల్లపూడి గ్రామం పరిధిలోని ఆలయ భూముల్లో విజయవాడ ఉత్సవ్ పేరుతో ఎగ్జిబిషన్ నిర్వహణకు హైకోర్టు ధర్మాసనం అనుమతిచ్చింది. గొడుగుపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం భూములను వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీల్లేదని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించింది. కేవలం 56 రోజుల పాటు మాత్రమే ఆ భూముల్లో ఎగ్జిబిషన్ నిర్వహణకు దేవదాయ అధికారులు లైసెన్స్ ఇచ్చారని గుర్తు చేసింది. తద్వారా దేవస్థానానికి రూ.45 లక్షల ఆదాయం వస్తుందని తెలిపింది. ఎగ్జిబిషన్ అనంతరం భూమిని పూర్వస్థితికి తీసుకొచ్చి కౌలు రైతులు/దేవాలయానికి అప్పగిస్తామని ఎగ్జిబిషన్ నిర్వాహకులు హామీ ఇస్తున్నారని గుర్తు చేసింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మచిలీపట్నం గొడుగుపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 34.99 ఎకరాల భూమిని విజయవాడ ఉత్సవ్ పేరుతో వాణిజ్య అవసరాలకు కేటాయించడాన్ని సవాల్ సవాల్ చేస్తూ బూరుగడ్డ సుజయ్‌కుమార్ మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి దేవస్థానానికి చెందిన వ్యవసాయ భూములను విజయవాడ ఉత్సవ్ పేరిట వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎగ్జిబిషన్ నిర్వాహకులు సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ప్రతినిధి బుధవారం అత్యవసరంగా ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ధర్మాసనం లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించింది.

ఎగ్జిబిషన్ నిర్వాహకుల తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. ఆలయ భూముల్లో 56 రోజులు ఎగ్జిబిషన్ నిర్వహణకు ఈవోకు రూ.45లక్షలు చెల్లించామన్నారు. ఇప్పటికే దేవస్థానం నుంచి భూమిని కౌలుకు తీసుకున్న రైతులతో ఒప్పందం చేసుకొని, వారికి సొమ్ము చెల్లించామన్నారు. ఎగ్జిబిషన్ పూర్తయ్యాక భూములను పూర్వస్థితికి తీసుకొచ్చి అప్పగిస్తామన్నారు.

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్.మూర్తి వాదనలు వినిపిస్తూ దేవస్థానం భూములను లీజుకు ఇచ్చేందుకు టెండర్ల విధానాన్ని అనుసరించాల్సి ఉంటుందన్నారు. ఎగ్జిబిషన్ నిర్వహణ అనంతరం భూములు వ్యవసాయానికి పనికి రావన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం భూములను కౌలుకు ఇవ్వడం, ఇతర వనరుల ద్వారా ఎంత ఆదాయం వస్తుందని ఆరా తీసింది. కేవలం ఎగ్జిబిషన్ ద్వారా రూ.45 లక్షల ఆదాయం వస్తుందని గుర్తు చేసింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించింది. తమ ఉత్తర్వులతో సంబంధం లేకుండా ఇరువైపుల వాదనలు విని వ్యాజ్యాలపై తుది నిర్ణయం వెల్లడించవచ్చని సింగిల్ జడ్జికి స్పష్టం చేసింది.

విజయవాడ ఉత్సవ్‌ను అడ్డుకునేందుకే వైసీపీ కుట్ర

విశ్వహిందూ పరిషత్ పేరుతో పేర్ని అనుచరుల కేసు: ఎంపీ కేశినేని చిన్ని



వన్‌టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఉత్సవ్‌ను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు కోర్టులను తప్పుదారి పట్టిస్తున్నారని, వైసీపీ నేత పేర్ని నాని అనుచరులు విశ్వహిందూ పరిషత్ పేరుతో కోర్టులో కేసులు వేశారని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. వైసీపీ నేతలకు దమ్ము ధైర్యం ఉంటే అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు రావాలని సవాల్ చేశారు. బుధవారం గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గొల్లపూడిలో ఎగ్జిబిషన్‌ను అడ్డుకునేందుకు వైసీపీ నాయకులు కోర్టును ఎలా తప్పుదారి పట్టించారో సాక్ష్యాలతో సహా ఆయన బయట పెట్టారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రజలు తిరస్కరించిన దేవినేని అవినాష్, వెలంపల్లి శ్రీనివాస్, పేర్ని నాని స్వార్థ రాజకీయంతో విజయవాడ ఉత్సవ్‌పై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్పొరేటర్‌గా గెలవలేని దేవినేని అవినాష్ విజయవాడ ఉత్సవ్‌ను అడ్డుపెట్టుకుని దిగజారుడు రాజకీయం చేస్తున్నాడని మండిపడ్డారు. గొల్లపూడిలోని 40 ఎకరాల భూమిని ది సొసైటీ ఫర్ వైబ్రాంట్ నిర్వాహకులు అద్దెకు తీసుకుని దేవస్థానానికి రూ.45 లక్షలు చెల్లించారన్నారు. పేర్ని నాని అనుచరులు విశ్వహిందూ పరిషత్ పేరుతో దేవస్థానం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయంటూ భూమిని లీజుకు తీసుకున్న రైతుల సంతకాలు ఫోర్జరీ చేసి కోర్టుకు వెళ్లారన్నారు. కౌలుకు తీసుకున్న రైతులతో మాట్లాడి నిబంధనల ప్రకారమే ఆ భూమిలో విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీజేపీ నేత సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలోనే విజయవాడ ఉత్సవ్ జరుగుతుందని తెలిపారు. బ్లూ మీడియా, వైసీపీ నేతలు వ్యాఖ్యలు చేయటం నీతిమాలిన చర్యన్నారు. వైసీపీ నేతలకు దమ్మూ, ధైర్యం ఉంటే అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. మంత్రి లోకేశ్ రెడ్‌బుక్ తన పనితాను చేసుకుంటూ పోతుందన్నారు. సోషల్ మీడియాలో రెచ్చిపోతున్న పేటీఎం బ్యాచ్‌తో పాటు అసత్య ఆరోపణలు చేస్తున్న క్రిమినల్స్‌పై 2.0 మొదలుపెట్టాలని మంత్రి లోకేశ్‌ను రిక్వెస్ట్ చేస్తామన్నారు. గొల్లపూడి రైతులు అబ్బూరి శ్రీనివాసరావు, బొర్రా రవికుమార్, పొన్నం శ్రీనివాసరావులు మాట్లాడుతూ తమ సంతకాలను ఫోర్జరీ చేసిన వైసీపీ నాయకులపై కేసు పెడతామన్నారు.

సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాలు

● ఈ ఏడాది థీమ్ "మీ భద్రత కేవలం ఒక క్లిక్ దూరంలో"

విజయవాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మెడికల్ కాలేజీలో 5వ జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాలను బుధవారం ప్రిన్సిపాల్, ఏడీఎంఈ డాక్టర్ ఎ.వై.రావు ప్రారంభించారు. ఈ ఏడాది థీమ్ "మీ భద్రత కేవలం ఒక క్లిక్ దూరంలో" అనే థీమ్‌తో 'పీవీపీఐకి నివేదించండి' అనే విషయంపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపాల్ ఎ.వై.రావు మాట్లాడుతూ, మందుల దుష్ప్రభావాల నివేదికలో ప్రజల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో తెలుపుతుందన్నారు. ఫార్మాకోవిజిలెన్స్ ప్రాముఖ్యత, ఔషధాల దుష్ప్రభావాల గురించి తెలుపుతూ ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమన్నారు. 'డాక్టర్ సూచన లేకుండా మందులు ఫార్మసీ అవుట్‌లెట్ల నుంచి తీసుకోవద్దని, ప్రజలకు అవగాహన కల్పించాల'ని ఆయన తెలిపారు. వార్డుల్లో పనిచేస్తున్న నర్సులు రోగుల వద్ద కనిపించే ఎలాంటి దుష్ప్రభావాలనైనా వెంటనే ఫార్మాకోవిజిలెన్స్ విభాగానికి నివేదించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఫార్మకాలజీ హెచ్‌ఓడీ డా.ఎన్.అనిత మాట్లాడుతూ ఫార్మాకోవిజిలెన్స్ రోగుల ఆరోగ్యాన్ని రక్షించడంలో ఏ విధంగా కీలకపాత్ర పోషిస్తుందో వివరించారు.

ప్రభుత్వ ప్రాధాన్యత ప్రకారం పనిచేయాలి

● కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ ప్రాధాన్యతల ఆధారంగా అధికారులు పని తీరును మెరుగుపరచుకోవాలని, స్వర్ణాంధ్ర -2047 లక్ష్యాలకు అనుగుణంగా సీఎం చంద్రబాబు చేసిన సూచనలకు అనుగుణంగా పని చేసి జిల్లాకు వన్నె తేవాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బుధవారం ఆయన కలెక్టర్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థా యి అధికారులతో కలిసి ఆర్డీవోలు, ఎమ్డీవోలు, ఏపీడీవోలు తదితరులతో వీసీ నిర్వహించారు. రెండురోజులపాటు జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చేసిన సూచనలను తెలిపారు. జీడీపీ పురోగతికి అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. తాగు నీటి వ్యవస్థలపై అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో ఎక్కడైనా తాగునీటి పైపులు తొలగటం, లీకేజీ సమస్యలు ఉంటే కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబరు 9154970454కు తెలియజేయాలన్నారు.లక్షలాది భక్తులు హాజరయ్యే దసరా ఉత్సవాలు సక్రమ నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు.

బాలికపై లైంగిక వేధింపులు

● పురుగుమందు సేవించిన బాలిక

● పోక్సో యాక్టుపై యువకుడి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

మైలవరం రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యువకుడి లైంగిక వేధింపులను తట్టుకోలేక పురుగుమందు తాగిన బాలిక ప్రాణాపాయ స్థితిలో ఉన్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మైలవరం ఎస్సై కే సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోరాట నగర్‌కు చెందిన 17 ఏళ్ల బాలిక పాఠశాలలో 10వ తరగతి వరకు చదివి, 2 నెలల క్రితం తండ్రి చనిపోవడంతో తల్లితోపాటు ఇంటి వద్దనే ఉంటుంది. అదే గ్రామానికి చెందిన అజ్మీర రమేష్ నాయక్ అనే యువకుడు బాలికకు మాయ మాటలు చెప్పి లోబర్చుకున్నాడు. నెల రోజులుగా అనేకమార్లు లైంగిక వేధింపులకు పాల్పడటం ఇంట్లో తెలియడంతో ఈనెల 9న బాలిక ఎలుకల మందు సేవించింది. దీంతో బాలికను విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ఐసీయూలో చికిత్సపొందుతున్నట్లు తెలిపారు. ఈనెల 15న బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో యాక్ట్‌పై కేసు నమోదు చేసి రమేష్ నాయక్‌ను అరెస్ట్ చేయడంతోపాటు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

డంపింగ్ యార్డు రహిత రాష్ట్ర సాధనే లక్ష్యం

● మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ



స్వచ్ఛతాహి సేవలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, మంత్రి నారాయణ, కమిషనర్ ధ్యానచంద్ర, తదితరులు

భారతీనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని డంపింగ్ యార్డు రహితంగా మార్చేందుకు నూతన విధానాలను అనుసరిస్తున్నామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్‌లో ప్రజలు పాల్గొని రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని మంత్రి పీ నారాయణ అన్నారు. తూర్పు నియోజక వర్గంలోని 10వ డివిజన్‌లోని కేపీ నగర్‌లో వీఎంసీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ బుధవారం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, మంత్రి పీ నారాయణ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్ రెడ్డి, చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సురేష్ కుమార్, మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్, కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అధికారులతో పాటు ప్రజలందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి గాంధీ జయంతి అక్టోబరు 2 వరకు 16 రోజుల పాటు స్వచ్ఛతా హీ సేవ నిర్వహించబడుతుందన్నారు. స్వచ్ఛ ఉత్సవం ఇతివృత్తంతో క్లీన్, గ్రీన్, వేస్ట్ మేనేజ్‌మెంట్ లక్ష్యాలుగా వినూత్న కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. ప్లాస్టిక్ రహిత జీవనశైలిని ప్రోత్సహించడంలో భాగంగా తొలి అడుగుగా మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాల్లో ప్లాస్టిక్ బాటిళ్లకు ప్రత్యామ్నాయ బాటిళ్లు ఉపయోగిస్తున్నామని మంత్రి తెలిపారు. అక్టోబరు 2 నుంచి అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలు, శాఖల కార్యాలయాల్లోనూ ఇలాంటి చర్యలు తీసుకొని దశలవారీగా ప్రజలను భాగస్వాములుగా చేసేందుకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం పాల్గొని ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. నిర్లక్ష్యానికి గురైన అమృత్ పథకం ద్వారా త్వరలోనే పనులకు టెండర్లు పిలుస్తామన్నారు. గత ప్రభుత్వం ప్రజలపై చెత్త పన్నువేసి రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్లిందన్నారు. ఇప్పటికే 83 లక్షల టన్నుల చెత్తను తొలగించామని, మిగిలిన చెత్తను త్వరలోనే తొలగిస్తామన్నారు. డివిజన్ కార్పొరేటర్ దేవినేని అపర్ణ, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, వీఎంసీ అధికారులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి రోబో ఎక్స్-2025

● సిద్ధార్థ వర్సిటీలో జాతీయ పోటీలకు సర్వం సిద్ధం.. ఏర్పాట్లు పూర్తి

● వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 400 మంది విద్యార్థుల రాక

● ఇన్నోవేట్, ఆటోమేట్, డామినేట్ థీమ్‌తో పోటీలు, వర్క్‌షాప్‌లు

● ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణంగా ఉంది: వీసీ వెంకటేశ్వరరావు

కానూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇన్నోవేట్, ఆటోమేట్, డామినేట్ థీమ్‌లతో రోబో ఎక్స్-2025 పేరుతో జరిగే జాతీయ రోబోటిక్స్ చాలెంజ్ పోటీలకు కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీ ఆతిథ్యం ఇస్తోంది. ఈనెల 18, 19న గురు, శుక్రవారం రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు దేశంలోని పలు ఇంజనీరింగ్ కళాశాల నుంచి 400 మంది వరకు విద్యార్థులు హాజరుకానున్నారు. రోబో వారియర్స్, పాత్‌ఫైండర్, చాలెంజ్, ప్రిసిషన్ పిక్ అండ్ ప్లేస్, ఇండస్ట్రీ 4.0 ఆటోమేషన్, అగ్రిబాట్ చాలెంజ్, మిషన్ రెస్క్యూ వంటి ఆరు విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. అదనంగా పరిశ్రమ నిపుణులతో రోబోటిక్స్ వర్క్‌షాపులు నిర్వహిస్తారు. వర్సిటీలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పోటీలు జరుగుతున్నాయి. విజేతలకు రూ.2లక్షలు వరకు బహుమతులు ఇవ్వనున్నారు.

విద్యార్థుల ప్రాక్టికల్ నైపుణ్యాలు వృద్ధి చెందుతాయి

డాక్టర్ ఎన్ రవికుమార్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి

రోబో ఎక్స్-2025 పేరుతో జరిగే జాతీయ రోబోటిక్స్ చాలెంజ్ పోటీలకు హాజరుకావడం వల్ల విద్యార్థుల ప్రాక్టికల్ నైపుణ్యాలు వృద్ధి చెందుతాయి. నిజ జీవిత సవాళ్లకు సిద్ధం చేసుకోవడంలో ఈ పోటీలు దోహదకారి అవుతాయి. దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన ఇంజనీర్లను ఒకే వేదికపైకి తీసుకురావచ్చు.

ఆవిష్కరణలకు రోబో ఎక్స్ ప్రోత్సాహం

ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు, వీసీ, సిద్ధార్థ డీమ్స్ వర్సిటీ

విద్యార్థుల ఆవిష్కరణలకు రోబో ఎక్స్- 2025 జాతీయ పోటీలు ప్రోత్సాహకంగా ఉంటాయి. విద్యార్థులు స్మార్ట్ ఆటోమేషన్ భవిష్యత్‌ను నిర్మించేందుకు ప్రేరేపిస్తుంది. విద్యార్థుల సృజనాత్మకతను, జట్టు భావాల పెంచడంలో పోటీలు తోడ్పాటునందిస్తాయి.







భారత్ అంటే... నాకెందుకు ఇష్టం?

క్రిస్టెన్ ఫిషర్... అమెరికన్ మహిళ. నలుగురు పిల్లల తల్లి. ఆమె గత నాలుగేళ్లుగా భారతదేశంలో నివసిస్తున్నారు. కంటెంట్ క్రియేటర్‌గా తన అనుభవాలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ ఉంటారు. ముఖ్యంగా అమెరికా, భారత్‌ల మధ్య ఉన్న వ్యత్యాసాలను వివరిస్తూ ఆమె చేసిన వీడియోలకు సోషల్ మీడియాల్లో మంచి ఆదరణ లభిస్తోంది. మన దేశంలో ఆమెకు ఆకర్షించిన విషయాలు- ఆసక్తికరమైనవి.. అవేమిటో చూద్దాం..



- ప్రతి ఇంట్లో రోజుకు రెండు లేదా మూడుసార్లు వంట చేయడం ఆశ్చర్యం అనిపించింది. ఇక్కడకు వచ్చిన తర్వాత నేను కూడా క్రమం తప్పకుండా వంట చేయటం నేర్చుకున్నా. భారతీయ శాఖాహార వంటలు చాలా రుచిగా ఉంటాయి. వీటిని తిని నేను కూడా శాఖాహారిగా మారిపోయాను.
- భారత మహిళలంటే చీరలు గుర్తుకొస్తాయి. నేను కూడా చీర కట్టుకోవటం నేర్చుకున్నా. చీర కట్టుకున్నప్పుడల్లా అందమైన అనుభూతి కలుగుతుంది.
- బజారులో వస్తువులు, కూరగాయలు, పండ్లు కొనేటప్పుడు బేరసారాలు ఆడడం సరదాగా ఉంటుంది. వర్తకులు ధర తగ్గించినప్పుడు ఆనందంగా అనిపిస్తుంది.
- అమెరికాలో పలు రకాల వస్తువులు లారీల ద్వారా రవాణా అవుతుంటాయి. మనవద్దకు వచ్చే సరికి అవి పాతబడుతుంటాయి. అదే భారత్‌లో అయితే స్థానికంగా ఉండే వీధి వ్యాపారుల వద్ద అన్ని వస్తువులు కొత్తగా కనిపిస్తుంటాయి. ఎప్పుడు కావాలంటే అప్పుడు వాటిని కొనుక్కోవచ్చు.
- అమెరికాలో స్కూటర్స్, బైక్స్ నడిపేవారు తక్కువగా ఉంటారు. ఇక్కడ మాత్రం అవి అందుకే నేను కూడా స్కూటర్ నడపడం నేర్చుకున్నా. దీనిమీద ప్రయాణించడం అనుకూలంగా ఉంటుంది. పనులు త్వరగా పూర్తవుతాయి. సమయమూ మిగులుతుంది.
- భారత్ వచ్చాక నా ఆలోచనా విధానం మారింది. సర్దుబాటు ధోరణి పెరిగింది. ఏ ప్రదేశం కూడా పూర్తిగా మనకు నచ్చినట్లు పరిపూర్ణంగా ఉండదు. అందరూ అనుకుంటున్నట్లు అమెరికాలో అంతా సంతోషమే ఉండదు. ఎక్కడ ఉన్నా మనకు మనమే ఆనందాన్ని వెతుక్కోవాలి. ఆ శక్తి మనకు ఉంటుంది. ప్రతికూలతలను పక్కనపెట్టి సానుకూలతలను ఆస్వాదించాలి. అప్పుడే జీవితం ఆనందమయమవుతుంది.



పెయింటింగ్స్ పట్ల ప్రజల అభిరుచి మారింది!

ఒకప్పుడు హైదరాబాద్ అనేక రకాల సంస్కృతులు.. సంప్రదాయాల సమ్మేళనం. ఈ మధ్య కాలంలో ఆ పునర్‌వైభవాన్ని తీసుకురావటానికి కృషి చేస్తున్న వారిలో మిహికా దగ్గుబాటి ఒకరు. ప్రముఖ నటుడు రాణా భార్యగానే కాకుండా.. కళా ప్రపంచంలో మిహికాకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రస్తుతం ఆమె నిర్వహిస్తున్న 'ఆర్ట్ కనెక్ట్' అనే ఎగ్జిబిషన్‌కు మంచి ఆదరణ కూడా లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమెను 'నవ్య' పలకరించింది.



హైదరాబాద్ కళా రంగం ఎలా ఉంది?

ఒకప్పుడు హైదరాబాద్ రకరకాల కళలకు ప్రసిద్ధి. ఎంఎఫ్‌హుస్సేన్ వంటి అనేక మంది పెయింటర్స్‌కు ఇక్కడ మంచి ఆదరణ లభించింది. అయితే ఇక్కడ ప్రజలు సంప్రదాయబద్ధమైన చిత్రాలను ఎక్కువగా ఆదరిస్తారు. ఈ మధ్యకాలంలో మన దేశంలోని కళా రంగంలో అనేక మార్పులు జరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగానే కాదు.. మన దేశంలో కూడా కొత్త కొత్త ఆర్టిస్టులు రకరకాల ప్రయోగాలు చేస్తున్నారు. అందువల్ల దేశంలోని అనేక స్టూడియోల నుంచి పెయింటింగ్స్‌ను, ఇతర కళాకృతులను ఇక్కడ ప్రదర్శిస్తున్నాం. ఈ ప్రదర్శనకు మంచి స్పందన లభిస్తోంది.

ఇక్కడ ఒకప్పుడు కళా రంగం ఎలా ఉండేది?

నేను హైదరాబాద్‌లోనే పుట్టాను. ఇక్కడే పెరిగాను. ఒకప్పుడు ఇక్కడ అనేక ప్యాలెస్‌లు ఉండేవి. స్వాతంత్రం తర్వాత అనేక మంది రాజకుటుంబీకులు తమ ప్యాలెస్‌లలో ఉన్న పెయింటింగ్స్, ఫర్నీచర్స్‌ను అమ్మేశారు. మా అమ్మమ్మ వాళ్లు కూడా ఫైగా రాజకుటుంబీకుల నుంచి ఒక క్రిస్టల్ డైనింగ్ టేబుల్ కొన్నారు. కళా రంగం గురించి నాకు పరిచమయింది అప్పుడే! ఆ తర్వాత ప్రభుత్వం దానిని వెనక్కి తీసేసుకుంది. అద్భుతమైన యాంటిక్ ఫర్నిచర్స్, గొప్ప గొప్ప ఆర్టిస్టుల పెయింటింగ్స్‌ను చూస్తూ పెరిగాను.

ఇక పెయింటింగ్స్ విషయానికి వస్తే- నేను న్యూయార్క్‌కు చదువుకోవటానికి వెళ్లినప్పుడు- అక్కడి మ్యూజియంలలో పెయింటింగ్స్‌ను చూశాను. అవి వర్తమాన ప్రపంచానికి సంబంధించినవి. అంతకు ముందు నేను యూరప్‌లోని దేశాలకు వెళ్లాను. అక్కడ సంప్రదాయబద్ధమైన పెయింటింగ్స్ ఉండేవి. ఈ రెండింటికీ మధ్య తేడా స్పష్టంగా తెలిసింది. వర్తమాన కళాకారుల పెయింటింగ్స్ పట్ల ప్రేమ పెరుగుతూ వచ్చింది.

> **పెయింటింగ్స్ అనేవి జీవిత కాలం మనతో పాటుగా ఉండే ఎమోషన్స్. అలాంటి వాటిని జాగ్రత్తగా ఎంపిక చేసి కొనుక్కొంటూ ఉంటా. ఈ మధ్యకాలంలో నేను రెండు డాలీలు (సుప్రసిద్ధ చిత్రకారుడు డాలీ వేసిన పెయింటింగ్స్)ను కొన్నాను. చిన్నతనం నుంచి నేను ఆదరించే చిత్రకారుడి పెయింటింగ్స్ సొంతం చేసుకోవటం నాకొక కల. అది నిజమైంది.**

ఈ మధ్యకాలంలో వచ్చిన మార్పులేమిటి?

హైదరాబాద్ ప్రజల అభిరుచులలో కూడా అనేక మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు తంజావూర్ పెయింటింగ్స్‌ను ఎక్కువగా ఆదరించేవారు. గోడల మీద దేవుడి పటాలను పెట్టుకోవటానికి ఎక్కువ ఆసక్తి చూపించేవారు. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ఒకప్పుడు పెయింటింగ్స్‌ను కేవలం ఉన్నత వర్గాల వారు మాత్రమే ఆదరించేవారు. అయితే ఈ మధ్యకాలంలో యువతీయువకులు తమ ఇళ్లలో రకరకాల పెయింటింగ్స్, చిన్న చిన్న శిల్పాలు వంటివి పెట్టుకోవటానికి ఇష్టపడుతున్నారు. ఒకప్పుడు ఖాళీ గోడపై ఏం పెట్టుకోవాలనే విషయాన్ని ఎవరు పెద్దగా ఆలోచించేవారు కారు. కాని ఇప్పుడు ఇంటీరియర్ డిజైనర్స్‌తో కూర్చుని ఆలోచిస్తున్నారు. ఒకప్పుడు పెయింటింగ్స్ గోడకు పెట్టుకొనే ఆభరణాలు. కానీ ఇప్పుడు అవి తప్పనిసరైన అలంకరణలు. జాగ్రత్తగా గమనిస్తే ఈ మధ్యకాలంలో జరిగే ఆర్ట్ ఎగ్జిబిషన్లకు ఇంటీరియర్ డిజైనర్స్ అనేక మంది వస్తున్నారు.

ఈ ఒరవడికి ప్రధాన కారణాలేమిటి?

ప్రజల అభిరుచులు మారుతున్నాయి. అంతే కాదు. ఒకప్పుడు పెయింటింగ్స్, ఫర్నిచర్ వంటివి హోదాకు చిహ్నాలు. వాటికి వాణిజ్యపరమైన విలువ ఏమి ఉండేది కాదు. కానీ ఇప్పుడు పెయింటింగ్స్‌ను భవిష్యత్తుకు పెట్టుబడిలా చూస్తున్నారు. వాటిని తనఖా పెట్టుకొని బ్యాంకులు అప్పులు కూడా ఇస్తున్నాయి. అంటే భూములకు, భవంతులకు ఎంత విలువ ఉందో.. పెయింటింగ్‌లకు కూడా అంతే విలువ ఉంది. ఈ మధ్యకాలంలో షేర్స్‌లో.. స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టినట్లే.. పెయింటింగ్స్‌లో కూడా పెట్టుబడులు పెడుతున్నారు. వారి పెట్టుబడులపై వచ్చే రిటర్న్ కూడా బావుంటున్నాయి. ఇక్కడ మనం కోవిడ్ వల్ల మన సమాజంలో వచ్చిన మార్పులను కూడా గమనించాలి. కోవిడ్ సమయంలో ఎక్కువ మంది ఇళ్లలోనే ఉండిపోయారు. వారికి.. ఇంటికి మధ్య అనుబంధం బాగా బలపడింది. ఒకప్పుడు ఎక్కువ బయటతిరిగే వారు కూడా కోవిడ్ తర్వాత ఇంట్లో ఎక్కువ సమయం గపడటానికి ఇష్టపడుతున్నారు. తమ ఇంటిని వినూత్నంగా తీర్చిదిద్దాలనుకుంటున్నారు. అలాంటి వారు కూడా పెయింటింగ్స్ పట్ల ఆకర్షితులవుతున్నారు.

ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్ ఆర్ట్ మార్కెట్ ఎలా ఉంది?

మన దేశంలో ముంబాయి ఎప్పుడు అగ్రస్థానంలో ఉంటుంది. ఎందుకంటే ప్రొగ్రెసివ్ మూమెంట్ అక్కడి నుంచే ప్రారంభమయింది. జెజె స్కూల్ అక్కడే ఉంది. దీని వల్ల అక్కడ అనేక మంది చిత్రకారులు నైపుణ్యం సాధించారు. విదేశాలకు వెళ్లారు. అక్కడ కొత్త పద్ధతులు తెలుసుకున్నారు. మళ్లీ ముంబాయికి తిరిగి వచ్చి- మన సంస్కృతికి తగ్గట్టుగా పెయింటింగ్స్ వేయటం మొదలుపెట్టారు. అంతే కాకుండా ముంబాయి మన ఆర్థిక రాజధాని. అందువల్ల అక్కడ అనేక మంది ఆర్ట్ కలెక్టర్స్ కూడా ఉన్నారు. ఇక బరోడా కూడా చిత్రకళకు ఒక ప్రధానమైన కేంద్రం. ఇక స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఢిల్లీలో అనేక మంది కళాకారులు తమ కళాకృతులను ప్రదర్శించటం మొదలుపెట్టారు. దీని వల్ల ఢిల్లీకి కూడా ఒక ముఖ్యమైన కేంద్రంగా ఏర్పడింది. ఇక కోల్‌కత్తా, బెంగుళూరులలో కూడా మంచి పెయింటింగ్స్‌కు ఆదరణ లభిస్తోంది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

ఒకప్పుడు రాజకుటుంబాలు గొప్పగా బతికేవి. వారి వద్ద నుంచి పెయింటింగ్స్, ఫర్నిచర్‌లను జాగ్రత్తగా ఉంచుకోవటానికి వారికి తగినంత ఆర్థిక వనరులు ఉండేవి. కానీ వారికి ఆర్థిక వనరులు తగ్గిపోయాయి. వ్యయం పెరిగిపోయింది. దీనితో వారు తమ వద్ద ఉన్న వారసత్వ సంపదను సరిగ్గా కాపాడలేకపోతున్నారు. అలాంటి వారసత్వ సంపదను కాపాడి ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. కానీ దానికి వనరులు అవసరం.

ఈ వనిత సర్పమిత్ర!

ఏ జీవి మనిషికి శత్రువు కాదు. వాటి మానాన వాటిని బతకనిస్తే మనకు ఎలాంటి హానీ ఉండదు... ఇది మహారాష్ట్రకు చెందిన 50 ఏళ్ల వనితా బొరాడే నిత్యం చేసే ప్రచారం. 60 వేలకు పైగా సర్పాలను కాపాడిన ఆమె 'స్నేక్ ఉమెన్'గా ఖ్యాతి పొందారు. 'నారీ శక్తి' పురస్కారం, తన పేరిట పోస్టల్ స్టాంప్, గిన్నిస్ బుక్‌లో చోటు.. ఇలా ఎన్నో సాధించారు. వీటన్నిటికన్నా ఇటీవల జరిగిన ఒక సత్కారాన్ని జీవితంలో మరచిపోలేనంటున్నారు వనిత. ఆ సంగతులు ఆమె మాటల్లోనే...



"నేను పుట్టింది, పెరిగింది మహారాష్ట్రలోని నయ్‌గ్రామ్ దేశ్‌ముఖ్ అనే గ్రామంలో. దానికి సమీపంలోనే ఘట్‌బోరీ అరణ్యం ఉంది. మా నాన్న వ్యవసాయం చేసేవారు. అడవిలోంచి పాములు పొలాల్లోకి తరచుగా వచ్చేవి. వాటిని నాన్న ఒడుపుగా పట్టుకొనేవారు. మళ్లీ అడవిలో విడిచిపెట్టేవారు. వాటికి హాని చేయకూడదని, బంధించకుండా స్వేచ్ఛగా వదిలెయ్యాలని ఆయన చెప్పేవారు. గ్రామంలోని చెరువుల్లో, దగ్గరగా ఉన్న నదిలో నీటి పాములు కనిపించడం సర్వసాధారణం. వాటికి విషం ఉండదు. కాబట్టి నాన్న పర్యవేక్షణలో మొదట వాటిని పట్టుకొనేదాన్ని. తరువాత విష సర్పాలను పట్టుకోవడం, అడవిలో వదిలెయ్యడం మామూలైపోయింది.

పన్నెండేళ్ల నుంచే...

హైస్కూల్లో చదువుతూ ఉండగా, పదిహేనేళ్లకే నాకు పెళ్లయింది. 'పాములు పడతానంటే నా భర్త అంగీకరిస్తారా?' అని అనుమానపడ్డాను. కానీ ఆయన ఒప్పుకున్నారు. అంతేకాదు, సర్పాల గురించి వివరించే పుస్తకాలు కూడా తెప్పించి, నాతో చదివించారు. తద్వారా నాకు ఎన్నో విషయాలు తెలిశాయి. మా ఊరు, చుట్టుపక్కల గ్రామాలతోపాటు దూర ప్రాంతాల నుంచి కూడా పాముల్ని పట్టాల్సిందిగా నన్ను పిలిచేవారు. నేను పన్నెండేళ్ల వయసులో పాముల్ని పట్టడం మొదలుపెట్టాను. ఇప్పటివరకూ



60 వేలకు పైగా పాముల్ని కాపాడాను. 'ఇండియాస్ ఫస్ట్ ఉమెన్ స్నేక్ ఫ్రెండ్'గా గుర్తింపు పొందాను. 2020లో 'నారీ శక్తి' పురస్కారాన్ని అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా స్వీకరించాను. 2022లో నా పేరిట పోస్టల్ శాఖ స్టాంప్ విడుదల చేసింది. 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో నా పేరు చోటు చేసుకుంది. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందుకున్నాను. దాన్ని గొప్ప గౌరవంగా భావించాను. రెండు వారాల్లోనే అంతకన్నా సంతృప్తిని, సంతోషాన్ని కలిగించే మరో సంఘటన జరిగింది.

కన్నీరు దాచుకోలేకపోయాను...

కిందటి నెల (ఆగస్టు) మూడోవారంలో... ఢిల్లీ నుంచి మేము నివసిస్తున్న బుల్ఢానా పట్టణానికి తిరిగి వచ్చాను మళ్లీ రోజువారీ పనుల్లో నిమగ్నమైన సమయంలో... నాకు చిన్నప్పుడు చదువు చెప్పిన మధుకర్ బెలోకర్ మాస్టారు నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ఇప్పుడు తను వాడీ గ్రామంలో స్థిరపడ్డానని చెబుతూ... తన ఇంటికి రావాల్సిందిగా ఆహ్వానించారు. నా సహాధ్యాయులు మరికొందరిని కూడా ఆయన ఆహ్వానించారని తెలిసింది. నా జీవితంలో మరపురాని గురువుల్లో మధుకర్ మాస్టారిది మొదటి స్థానం. చదువుపట్ల ఆసక్తిని పెంచి, నైతిక విలువలను, సామాజిక బాధ్యతను విద్యార్థుల్లో ఆయన పెంపొందించారు. కొన్నేళ్ళ కిందట పదవీవిరమణ చేసిన ఆయనను కచ్చితంగా కలవాలనుకున్నాను. అనుకున్న ప్రకారం మా మాస్టారి ఇంటికి వెళ్ళాను. ఆయనతో పాటు అప్పట్లో మాకు పాఠాలు చెప్పిన ఇతర టీచర్లు, నా క్లాస్‌మేట్స్... ఇలా అందరూ ఉన్నారు. అక్కడికి వెళ్ళిన తరువాత తెలిసింది... అది నన్ను అభినందించడానికి, సత్కరించడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమం అని. ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించడం ఆనవాయితీ, ధర్మం. కానీ గురువుల చేతుల మీదుగా సన్మానం అందుకోవడం, వారి నుంచి ప్రశంసలు, ఆశీస్సులు పొందడం అంటే నేను ఎంతో పుణ్యం చేసుకొని ఉండాలి. నా ఉద్వేగాన్ని, కన్నీటిని దాచుకోలేకపోయాను. ఆ రోజును నా జీవితాంతం మరచిపోలేను.

అది అందరం గుర్తించాలి

పాము ఎక్కడ కనబడినా భయపడి పారిపోవడం, దాన్ని వెతికి పట్టుకొని చంపేయడం అన్ని ప్రాంతాల్లో సర్వసాధారణం. పాముల విషయంలో ప్రజలకు తగిన అవగాహన లేకపోవడమే కారణం. పాము లంటే భయపడడాన్ని 'ఓఫిడియోఫోబియా' అంటారు. కానీ మన దేశంలోని సర్పాల్లో కేవలం పది శాతం మాత్రమే విషపూరితమైనవి. మిగిలిన వాటివల్ల అలాంటి హాని జరగదు. ఒకవేళ విష సర్పాలు కాటేసినా... ప్రాణాలు కాపాడడం కోసం యాంటీవీనమ్ ఇంజక్షన్లు ఉంటాయి. ఈ అంశాలు నేను ప్రచారం చేస్తున్నాను. అలాగే పాము కరిచినప్పుడు ఏ చికిత్స చేయాలో గ్రామీణులకు, ముఖ్యంగా మహిళలకు శిక్షణ ఇస్తున్నాను. పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. దీనికోసం 'సోయ్‌రే వనచరి మల్టీపర్పస్ ఫౌండేషన్' పేరిట ఒక సంస్థ ఏర్పాటు చేశాను. ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి నా కృషికి గుర్తింపు లభించింది. మన భారతీయ సంస్కృతి గ్రామీణ జీవనంతో, అడవులతో ముడివేసుకొని ఉంది. ప్రతి ప్రాణిని పవిత్రంగా భావించే సంస్కృతి మనది. కానీ మానవులు భయంతోనో, స్వార్థంతోనో పక్షులకు, జంతువులకు, ప్రకృతికి హాని కలిగిస్తూనే ఉన్నారు. ఇది కొనసాగితే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. మనం అందరం గుర్తించాల్సిన సత్యం ఇది."

రంగు రంగుల పాస్‌పోర్ట్‌లకు అర్థం..?

విదేశాల్లో... పర్యటించాలన్నా, చదువుకోవాలన్నా, ఉద్యోగ వ్యాపారాలు చేసుకోవాలన్నా పాస్‌పోర్టు ఉండాల్సిందే. ఏ దేశంలోనైనా అధికారిక గుర్తింపు కార్డుగా పాస్‌పోర్టును పరిగణిస్తారు. అలాంటి పాస్‌పోర్టుకు ఒక్కో దేశం ఒక్కో రంగును నిర్దేశించుకున్నాయి. యూరోపియన్ దేశాల్లో ఎరుపు, ఇస్లామిక్ దేశాల్లో ఆకుపచ్చ, ఆఫ్రికన్ దేశాల్లో నలుపు రంగు పాస్‌పోర్టులు కనిపిస్తుంటాయి. మనదేశంలో మాత్రం మూడు రంగుల పాస్‌పోర్టులు అందుబాటులో ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం...

ముదురు నీలం రంగు పాస్‌పోర్టు



- విద్య, ఉద్యోగం, పర్యాటకం, వ్యాపారం తదితరాల నిమిత్తం విదేశాలకు వెళ్లేవారికి ముదురు నీలం రంగు పాస్‌పోర్టును ఇస్తారు. భారతదేశంలో పుట్టినవారికి, ఇక్కడి పౌరసత్వం ఉన్నవారికి అత్యధిక సంఖ్యలో జారీ చేసే సాధారణ పాస్‌పోర్టు ఇది. ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, చిరునామా, పుట్టిన తేదీ తదితరాలను పరిశీలించి పోలీస్ వెరిఫికేషన్ తరవాత అర్హులైనవారికి మాత్రమే అందజేస్తారు. దీన్ని డిజిటల్ రూపంలో కూడా అందుబాటులో ఉంచుతున్నారు.

తెలుపు రంగు పాస్‌పోర్టు



- తెలుపు.. అధికారాన్ని బాధ్యతను సూచిస్తుంది. కాబట్టి తెలుపు రంగు పాస్‌పోర్టును ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, సైనిక బలగాలకు ప్రత్యేకించారు. కేవలం అధికారిక యాత్రలకు మాత్రమే దీన్ని నిర్ధేశించారు. వ్యక్తిగత ప్రయాణాలకు ఇది చెల్లుబాటు కాదు.

మెరూన్ రంగు పోస్‌పోర్టు



- మెరూన్ రంగు పాస్‌పోర్టును.. విదేశాలతో దౌత్య సంబంధాలు నిర్వహించే అధికారులకు, గ్రూప్ ఎ ఫారెన్ సర్వీసెస్ అధికారులకు, విదేశాంగ శాఖలోని గ్రూప్ బి అధికారులకు, వారి కుటుంబ సభ్యులకు మంజూరు చేస్తారు. విదేశాల్లో పని చేసే భారతీయ అధికారులకు, దౌత్య సంబంధాల్లో భాగంగా విదేశాల్లో నివసించేవారికి కూడా దీన్నే ఇస్తారు.

నారింజ రంగు పాస్‌పోర్టు



- పదోతరగతికి మించి చదవని వారికి నారింజ రంగు పాస్‌పోర్టును ఇచ్చేవారు. పాస్‌పోర్టు రంగును చూడగానే సంబంధిత వ్యక్తులు వివక్షతను ఎదుర్కొంటున్నారనే విమర్శలు రావడంతో ప్రస్తుతం దీన్ని జారీచేయడం లేదు.

కౌన్సెలింగ్

Q A నాకు ప్రొటీన్ ఎలా లభిస్తుంది?

నేను ఈ మధ్యకాలంలో జిమ్‌కు వెళ్లటం మొదలుపెట్టాను. నేను చిన్నప్పటి నుంచి శాఖాహారిని. జిమ్ ట్రైనర్ - "మీకు ప్రొటీన్ సరిపోవటం లేదు.. ప్రొటీన్ పౌడర్ తాగండి" అని సలహా ఇస్తున్నాడు. ప్రొటీన్ పౌడర్ తాగటం నాకు ఇష్టం లేదు. వీటి వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని చదివాను. పౌడర్ కాకుండా ఎలాంటి ఆహార పదార్థాలను తీసుకుంటే నాకు తగినంత ప్రొటీన్ లభిస్తుంది?

- చందన, వరంగల్

ప్రొటీన్ కేవలం మాంసాహారంలో ఉంటుందని.. శాఖాహారులకు ప్రొటీన్ తక్కువ ఉంటుందనుకోవటం ఒక అపోహ మాత్రమే. అయితే ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకుంటే తగినంత ప్రొటీన్ ఉందా? లేదా అనే విషయం తెలుస్తుంది. ఇక మార్కెట్‌లో లభ్యమవుతున్న రకరకాల ప్రొటీన్ పౌడర్లు అంత మంచివి కావు. డాక్టర్ చెబితేనే వీటిని తీసుకోవాలి. మీ అంతట మీరు ప్రకటనలు చూసి కొనుగోలు చేయటం మంచిది కాదు. ఇక అనేక శాఖాహార ఆహార పదార్థాలలో ప్రొటీన్ లభ్యమవుతుంది. వీటిని క్రమం తప్పకుండా తింటే శరీరానికి తగినంత ప్రొటీన్ లభిస్తుంది. ఇవి ఏ పరిమాణాలలో తినాలనేది శరీర బరువుపైన.. ప్రతి రోజు చేసే పని పైన ఆధారపడి ఉంటుంది. మీకు సమీపంలో ఉన్న న్యూట్రిషనిస్ట్‌ను అడిగి ఈ పదార్థాలు ఎంత తినాలో నిర్ణయించుకోండి. ఆ పదార్థాలేమిటో చూద్దాం..



గ్రీక్ యోగర్ట్: ఇది చిక్కటి పెరుగు. కానీ ప్రత్యేకంగా తయారు చేస్తారు. ఒక కప్పు గ్రీక్ యోగర్ట్‌లో 23 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో లేదా మధ్యాహ్నం లంచ్‌లో దీనిని తింటే మంచిది. కొందరికి భోజనంలో పెరుగు తినటం ఇష్టం ఉండదు. అలాంటి వారు దీనిని విడిగా తింటే ప్రొటీన్ లభిస్తుంది. ఇది అన్ని సూపర్ బజార్లలో లభిస్తుంది.



చీజ్: ప్రొటీన్ విషయంలో మాంసాహారులకు మాంసం ఎలాగో శాఖహారులకు చీజ్ అలాగ! చీజ్‌ను ముక్కలు చేసుకొని తినటం ఇష్టం లేని వారు కూర చేసుకొని తినవచ్చు.



తోఫు: ఈ మధ్యకాలంలో ఇది కూడా బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రతి 100 గ్రాముల తోఫులో 8 గ్రాముల ప్రొటీన్ లభిస్తుంది. దీనిని రకరకాల కూరల్లో చేసుకొని తినవచ్చు.



శనగలు: ప్రతి 100 గ్రాముల శనగలలో 9 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. అందువల్ల ప్రతి రోజు క్రమం తప్పకుండా శనగలు తింటే ప్రొటీన్ విలువలు పెరుగుతాయి.



క్వినోవా: ఈ మధ్యకాలంలో కొందరు వరి అన్నం బదులుగా క్వినోవా తింటున్నారు. దీనిలో ఫైబర్, మినరల్స్‌తో పాటుగా ప్రొటీన్ కూడా ఉంటుంది.

- మానస
న్యూట్రిషనిస్ట్, హైదరాబాద్

ఆసియా కప్‌లో నేడు **శ్రీలంక X అఫ్గానిస్థాన్** రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



నీరజ్ X నదీమ్



ఫైనల్ చేరిన భారత్, పాక్ స్టార్లు | **నేడు జావెలిన్ త్రో టైటిల్ పోరు** | **ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్**

ఫైనల్స్ సా. 3.50 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..

టోక్యో: క్రికెట్‌లో ఇండో-పాక్ పోరు ఎంత మజానో.. అథ్లెటిక్స్‌లో భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా, పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ మధ్య పోటీ అంతే ఆసక్తికరం. జావెలిన్ త్రోలో వీరిద్దరు తలపడుతున్నారంటే రెండు దేశాల అథ్లెటిక్స్ ప్రేమికులేకాదు..విశ్వవ్యాప్త ఫ్యాన్స్ ఉత్కంఠగా ఎదురు చూస్తారు. అలాంటి నీరజ్-నదీమ్ మరోసారి ఢీ అంటే ఢీ అనబోతున్నారు. గురువారం జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ ఫైనల్లో వీరిద్దరూ అమీతుమీ తేల్చుకోనున్నారు. బుధవారం జరిగిన జావెలిన్ త్రో క్వాలిఫికేషన్స్‌లో డిఫెండింగ్ చాంప్ నీరజ్, నదీమ్ భిన్నమైన ప్రదర్శన చేశారు. గ్రూప్ 'ఎ' నుంచి తలపడిన నీరజ్.. ఫైనల్ మార్క్ 84.50 మీ. దూరాన్ని మొదటి యత్నంలోనే (84.85 మీ.తో) చేరుకున్నాడు. గ్రూపులో చోప్రా మూడో, ఓవరాల్‌గా ఆరో స్థానంలో నిలిచాడు. మరోవైపు అర్షద్ గ్రూప్ 'బి'లో ఉత్కంఠ పరిస్థితులు ఎదుర్కొన్నాడు. మొదటి రెండు యత్నాలలో (76.99మీ.), (74.17మీ.) విఫలమైన అతడు మూడో ఆఖరి త్రోలో 85.25మీ. ఈటెను విసిరాడు. కానీ గ్రూప్ 'బి'లో నాలుగో ఆటోమేటిక్ క్వాలిఫయర్‌గా ఫైనల్లో స్థానం దక్కించుకుని ఊపిరి పీల్చుకున్నాడు. 84.50 మీ. దూరాన్ని అందుకున్న వారు లేదా అత్యుత్తమ ప్రదర్శన చేసిన 12 మంది ఫైనల్లో తలపడతారు.

సచిన్ యాదవ్ కూడా: మరో భారత త్రోయర్ సచిన్ యాదవ్ 83.67 మీ. దూరంతో ఓవరాల్‌గా 10వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు క్వాలిఫై అయ్యాడు. మరో ఇద్దరు భారత త్రోయర్లు రోహిత్ 28వ, యశ్వీర్ 30వ స్థానాల్లో నిలిచి ఫైనల్‌కు ముందే నిష్క్రమించారు. క్వాలిఫకేషన్స్‌లో ఓవరాల్‌గా అండర్సన్ పీటర్స్ (89.53 మీ.) అగ్రస్థానం, జూలియన్ వెబర్ (87.21 మీ) రెండో స్థానంలో నిలిచారు.

మిగిలిన అందరూ విఫలం..

పురుషుల ట్రిపుల్ జంప్‌లో భారత అథ్లెట్ అబ్దుల్లా అబూబాకర్ (16.33మీ.), ప్రవీణ్ చిత్రవేల్ (16.74మీ.) ఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యారు. పురుషుల 200 మీ. పరుగు హీట్స్‌లో అనిమేష్ కుజూర్ తన హీట్‌లో తొమ్మిదో, ఆఖరి స్థానంలో నిలిచి నిరాశపరిచాడు.

దుబాయ్‌లో పాక్ ఆటగాళ్ల హైడ్రామా

గంట ఆలస్యంగా మొదలైన యూఏఈతో మ్యాచ్

దుబాయ్: యూఏఈతో తమ ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడే విషయంలో పాకిస్థాన్ హైడ్రామా సృష్టించింది. టోర్నీని బహిష్కరిస్తామన్నట్టుగా హోటల్‌కే పరిమితమైన పాక్ జట్టు.. ఆ తర్వాత బెట్టు వీడింది. 'హ్యాండ్ షేక్' వివాదంలో మ్యాచ్ రెఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను బాధ్యతల నుంచి తప్పించాలని కోరుతున్న పాక్.. మరోసారి ఐసీసీకి మెయిల్ చేసింది. కానీ, పాక్ డిమాండ్‌ను ఐసీసీ రెండోసారి తిరస్కరించింది. ఈ నేపథ్యంలో నిర్ణీత సమయంలో హోటల్ నుంచి పాక్ జట్టు స్టేడియానికి బయలుదేరకుండా బెదిరింపు ధోరణికి దిగడంతో సస్పెన్స్ నెలకొంది. దీంతో యూఏఈతో మ్యాచ్‌ను పాక్ బహిష్కరించ నుందన్న వార్తలు వెలువడ్డాయి. అయితే, పాక్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్ మొహిసిన్ నఖ్వీతో కాన్ఫరెన్స్ కాల్‌లో మాట్లాడిన ఐసీసీ సీఈవో సంజోగ్ గుప్తా.. మ్యాచ్ రెఫరీగా పైక్రాఫ్ట్ కొనసాగుతాడని మరోసారి స్పష్టం చేశాడు. అతడు ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని గుర్తు చేశాడు. అంతేకాకుండా పైక్రాఫ్ట్‌ను కూడా హెడ్ క్వార్టర్స్‌కు పిలిపించిన ఐసీసీ.. అతని విషయంలో పూర్తిగా విచారణ చేసినట్టు రాతపూర్వకంగా పీసీబీకి తెలియజేసింది. ఈ క్రమంలో పలుమార్లు నఖ్వీతో మంతనాలు జరిపిన పాక్ జట్టు చివరకు స్టేడియానికి చేరుకొంది. దీంతో మ్యాచ్ గంట ఆలస్యంగా మొదలైంది. మరోవైపు భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో చోటు చేసుకొన్న పరిణామాలపై పాక్ మేనేజర్‌ను పైక్రాఫ్ట్ క్షమాపణలు కోరినట్టు పీసీబీ ఎక్స్‌లో పోస్టు చేసింది. కాగా, మ్యాచ్‌ను బహిష్కరిస్తే భారీ జరిమానాలు తప్పవన్న భయంతోనే పాక్ దారికొచ్చినట్టు తెలుస్తోంది.

చచ్చీ చెడీ..

సూపర్- 4కు పాకిస్థాన్
యూఏఈపై గెలుపు
21న భారత్‌తో మళ్లీ ఢీ



అఫ్రీది (2/16)

దుబాయ్: ఆసియా కప్‌లో పాకిస్థాన్ జట్టు సూపర్-4లో ప్రవేశించింది. గ్రూప్-ఎలో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో 41 పరుగులతో యూఏఈని ఓడించింది. తొలుత పాకిస్థాన్ 20 ఓవర్లలో 146/9 స్కోరు చేసింది. ఫఖర్ జమాన్ (50) హాఫ్ సెంచరీ చేశాడు. కెప్టెన్ సల్మాన్ ఆఘా (20)తో కలిసి జమాన్ మూడో వికెట్‌కు కీలకమైన 61 పరుగులు జోడించాడు. చివర్లో షహీన్ షా అఫ్రీది (29 నాటౌట్) ధనాధన్ బ్యాటింగ్‌తో పాకిస్థాన్ పోరాడే స్కోరు చేసింది. ఛేదనలో యూఏఈ 17.4 ఓవర్లలో 104 పరుగులకు ఆలౌటైంది. రాహుల్ చోప్రా (35), ధ్రువ్ పరాశర్ (20) మాత్రమే రాణించారు. షహీన్ షా అఫ్రీది, అబ్రార్, రౌఫ్ తలా రెండేసి వికెట్లు తీశారు. ఈ గెలుపుతో పాకిస్థాన్ పాయింట్ల పట్టికలో గ్రూప్-ఎ నుంచి రెండో స్థానంలో నిలిచింది. దరిమిలా సూపర్-4కు క్వాలిఫై అయ్యింది. ఈ గ్రూప్ నుంచి టాప్‌లో భారత్ ఉంది. వచ్చే ఆదివారం జరిగే సూపర్-4 మ్యాచ్‌లో భారత్‌తో పాక్ తలపడనుంది.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 146/9 (ఫఖర్ జమాన్ 50, షహీన్ షా అఫ్రీది 29 నాటౌట్, సల్మాన్ ఆఘా 20, జునైద్ సిద్దిఖీ 4/18, సిమ్రన్‌జీత్ 3/26).

యూఏఈ: 17.4 ఓవర్లలో 105 ఆలౌట్ (రాహుల్ చోప్రా 35, ధ్రువ్ పరాశర్ 20, అబ్రార్ అహ్మద్ 2/13, షహీన్ షా అఫ్రీది 2/16, హరీస్ రవూఫ్ 2/19).

ప్రీక్వార్టర్స్‌కు సాత్విక్ జోడీ

'చైనా మాస్టర్స్' నుంచి లక్ష్యసేన్ అవుట్

షెన్‌జెన్ (చైనా): డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ముందంజ వేసింది. బుధవారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ పోరులో సాత్విక్ జంట 24-22, 21-13తో మలేసియా ద్వయం జునైది ఆరిఫ్/రాయ్ కింగ్ యాప్‌ను ఓడించి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించింది. కాగా, సింగిల్స్‌లో భారత స్టార్ లక్ష్యసేన్‌కు ఆదిలోనే చుక్కెదురైంది. లక్ష్య 11-21, 10-21తో ఫ్రాన్స్ షట్లర్ తోమా జూనియర్ పొపోవ్ చేతిలో ఓడి తొలిరౌండ్లోనే వెనుదిరిగాడు. ఇక, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల/తనీషా, మహిళల డబుల్స్‌లో రీతూపర్ణ/శ్వేతాపర్ణ జోడీలు మొదటి రౌండ్లోనే ఓడారు.

మోదీకి మెస్సీ ప్రత్యేక కానుక

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినం సందర్భంగా సాకర్ దిగ్గజం లియోనెల్ మెస్సీ ప్రత్యేకంగా విషెస్ తెలిపాడు. అంతేకాదు.. మోదీకి పుట్టినరోజు కానుకను కూడా పంపించడం విశేషం. తన సంతకంతో కూడిన జెర్సీని మోదీకి మెస్సీ బహుమతిగా పంపాడు. మెస్సీ సారథ్యంలో అర్జెంటీనా జట్టు 2022 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచింది. ఆ టోర్నీలో మెస్సీ ధరించిన జెర్సీనే మోదీకి పంపినట్టు భారత్‌లో మెస్సీ ప్రమోటర్ సతాద్రు దత్తా వెల్లడించాడు. ఈ ఏడాది చివర్లో భారత పర్యటనకు మెస్సీ రానున్నాడు.



స్మృతీ మంధాన (117)

మంధాన శతక మోత

రెండో వన్డేలో ఆసీస్‌పై భారత్ ఘన విజయం

ముల్లన్‌పూర్ (పంజాబ్): డాషింగ్ ఓపెనర్ స్మృతీ మంధాన (91 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్స్‌లతో 117) సెంచరీతోపాటు బౌలర్లు రాణించడంతో.. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 1-1తో సమం చేసింది. బుధవారం జరిగిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు 102 పరుగుల తేడాతో గెలిచింది. తద్వారా 2007 తర్వాత స్వదేశంలో తొలిసారి కంగారూలపై భారత్ జయకేతనం ఎగురువేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49.5 ఓవర్లలో 292 పరుగులకు ఆలౌటైంది. దీప్తి శర్మ (40), రిచా ఘోష్ (29), ప్రతీక రావల్ (25) పర్వాలేదనిపించగా.. చివర్లో స్నేహ్ రాణా (24) రాణించింది. ఓపెనర్లు ప్రతీక, మంధాన తొలి వికెట్‌కు 70 పరుగులు జోడించారు. హర్లీన్ డియోల్ (10), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (17) విఫలమయ్యారు. డార్సీ బ్రౌన్ 3 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో ఆసీస్ 40.5 ఓవర్లలో 190 పరుగులకే కుప్పకూలింది. సదర్లాండ్ (45), ఎలీస్ పెర్రీ (44) టాప్ స్కోరర్లు. క్రాంతి గౌడ్ మూడు, దీప్తి రెండు వికెట్లు పడగొట్టారు. ఆసీస్‌పై భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు. మంధాన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఇరుజట్ల మధ్య సిరీస్ నిర్ణాయక మూడో, ఆఖరి మ్యాచ్ శనివారం జరగనుంది.

1 వంద అంతకుపైగా పరుగుల తేడాతో ఆస్ట్రేలియా ఓడడం ఆ జట్టుకిదే తొలిసారి.

2 77 బంతుల్లో సెంచరీ సాధించిన మంధాన.. భారత్ తరపున రెండో వేగవంతమైన శతకాన్ని నమోదు చేసింది. తొలి సెంచరీ కూడా ఆమె పేరిటే ఉంది. ఐర్లాండ్‌పై మంధాన 70 బంతుల్లోనే వంద సాధించింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 49.5 ఓవర్లలో 292 ఆలౌట్ (మంధాన 117, దీప్తి శర్మ 40; బ్రౌన్ 3/42).
ఆస్ట్రేలియా: 40.5 ఓవర్లలో 190 ఆలౌట్ (సదర్లాండ్ 45, పెర్రీ 44; క్రాంతి 3/28).



వరుణ్ @1

టీ 20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం కైవసం

దుబాయ్: మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తొలిసారి టాప్ లేపాడు. బుధవారం ప్రకటించిన టీ20 ర్యాంకింగ్స్ బౌలర్ల జాబితాలో వరుణ్ మూడు స్థానాలు మెరుగుపర్చుకొని ఏకంగా నెంబర్ వన్ ర్యాంక్‌ను అందుకొన్నాడు. ఈ క్రమంలో టాప్ ర్యాంక్‌ను అందుకొన్న మూడో భారత బౌలర్‌గా చక్రవర్తి నిలిచాడు. రవి బిష్ణోయ్ 8వ స్థానంలో, అక్షర్ పటేల్ 12వ ర్యాంక్‌లో ఉన్నారు. న్యూజిలాండ్ ఆటగాడు జాకబ్ డెఫీ, వెస్టిండీస్ స్పిన్నర్ అఖిల్ హోసేన్ రెండు, మూడు ర్యాంక్‌లు దక్కించుకొన్నారు. ఆల్‌రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. అభిషేక్ శర్మ 14వ ర్యాంక్‌కు ఎగబాకాడు. బ్యాటర్ల కేటగిరీలో అభిషేక్ నెం:1 ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. తిలక్ వర్మ, సూర్యకుమార్‌లు నాలుగు, ఏడో ర్యాంకుల్లో ఉన్నారు.

కాంస్యపోరుకు అంతిమ్

జగ్రెబ్ (క్రొయేషియా): వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత అమ్మాయి అంతిమ్ పంగల్ కాంస్యం కోసం తలపడనుంది. మంగళవారం జరిగిన మహిళల 53 కిలోల విభాగం సెమీస్‌లో అంతిమ్ 3-5తో ఒలింపిక్ రజత పతక విజేత లూసియా యపజ్ గుజ్‌మన్ (ఈక్వెడార్) చేతిలో ఓడింది. దీంతో కాంస్యం పోరులో అంతిమ్ అదృష్టం పరీక్షించుకోనుంది. 62 కిలోల్లో మనీషా భన్వల్.. ఓక్ జు కిమ్ (ఉత్తర కొరియా) చేతిలో ఓటమి పాలైంది. అయితే, కిమ్ ఫైనల్ చేరడంతో మనీషాకు రెపిచేజ్ ఆడే చాన్స్ దక్కింది.

మళ్లీ ఓడిన టైటాన్స్

ప్రొ కబడ్డీ లీగ్

జైపూర్: గత మ్యాచ్‌లో ఓడిన తెలుగు టైటాన్స్‌కు మళ్లీ నిరాశే ఎదురైంది. ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 29-33 స్కోరు తేడాతో దబాంగ్ ఢిల్లీ చేతిలో పరాజయం పాలైంది. టైటాన్స్‌కు ఇది ఎనిమిది మ్యాచుల్లో ఐదో ఓటమి కాగా.. దబాంగ్ జట్టు మాత్రం వరుసగా ఆరు విజయాలతో అజేయంగా కొనసాగుతోంది. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 43-32తో పట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది.

బిజినెస్

వడ్డీ రేటు 0.25% తగ్గింపు

ప్రకటించిన అమెరికా ఫెడ్ రిజర్వ్

వాషింగ్టన్: అమెరికాలో వడ్డీ రేట్లు మరింత తగ్గనున్నాయి. కీలక స్వల్పకాలిక వడ్డీ రేట్లను అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ 25 బేసిస్ పాయింట్లు (0.25%) తగ్గించింది. ఫెడ్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పోవెల్ అధ్యక్షతన బుధవారం జరిగిన ఎఫ్‌ఓఎంసీ భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో వడ్డీ రేటు 4 శాతం నుంచి 4.25 శాతానికి చేరుకుంది. ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు తగ్గించడం ఈ ఏడాది ఇదే మొదటిసారి. కొంత అనిశ్చితి ఉన్నా నిరుద్యోగం, రిటైల్ ద్రవ్యోల్బణం దిగి వస్తుండడంతో ఫెడ్ రిజర్వ్ ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తున్నారు. కాగా ఈ సంవత్సరం మరో రెండు సార్లు వడ్డీ రేట్లు తగ్గించనున్నట్టు పోవెల్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. దీంతో వడ్డీ రేట్లు తగ్గించండి, లేకపోతే మిమ్మల్ని సాగనంపుతా అని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న హెచ్చరికలను జెరోమ్ పోవెల్ ఆలకించినట్టయింది.

మార్కెట్లకు బూస్ట్

ఫెడ్ నిర్ణయం వెలువడిన వెంటనే డోజోన్స్ సూచీ 438 పాయింట్లు పెరిగింది. ఫెడ్ తాజా నిర్ణయంతో భారత్‌తో సహా ఇతర వర్ధమాన దేశాల స్టాక్ మార్కెట్లకు ఎఫ్‌పీఐల పెట్టుబడులు మళ్లీ గాడిన పడతాయని భావిస్తున్నారు. గురువారం నుంచి భారత మార్కెట్‌పై ఈ ప్రభావం కనిపిస్తుందని భావిస్తున్నారు. మరోవైపు ఫెడ్ నిర్ణయంతో బులియన్ మార్కెట్ కూడా మరింత పరుగులు తీసే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. బుధవారం రాత్రి 11.45 గంటలకు అమెరికా మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర రికార్డు స్థాయిలో 3,731 డాలర్లకు చేరింది.

యస్ బ్యాంక్‌లో 13.18% వాటా విక్రయం పూర్తి : ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: యస్ బ్యాంక్ ఈక్విటీలో తన వాటాను భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) 10.8 శాతానికి తగ్గించుకుంది. ఇందులో తనకున్న 23.98 శాతం వాటాలో 13.18 శాతం వాటాను జపాన్ కేంద్రంగా పనిచేసే సుమిటోమో మిట్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్‌ఎంబీసీ)కు విక్రయించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ డీల్ పూర్తయినట్లు ఎస్‌బీఐ తెలిపింది. ఈ అమ్మకం ద్వారా రూ.8,889 కోట్లు సమకూరినట్టు స్టాక్ ఎక్స్ఛేంజీలకు బ్యాంక్ తెలిపింది. 2020 మార్చిలో యస్ బ్యాంక్ కుప్పకూలినప్పుడు ప్రభుత్వం, ఆర్‌బీఐ ఆదేశాలతో ఎస్‌బీఐ రెండు విడతలుగా ఈ బ్యాంక్ ఈక్విటీలో ఈ వాటాలు తీసుకుంది.

అందుబాటులోకి బీమా సుగమ్

న్యూఢిల్లీ: బీమా సుగమ్ ఇండియా ఫెడరేషన్ (బీఎస్ఐఎఫ్) వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) ప్రధాన కార్యాలయంలో మండలి బీమా కంపెనీల సీఈఓలతో కలిసి ఐఆర్‌డీఏఐ ఛైర్మన్ అజయ్ సేథ్ ఈ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. 2047 నాటికి ప్రధాని మోదీ లక్ష్యమైన 'వికసిత్ భారత్'లో అందరికీ బీమా లక్ష్య సాధనకు ఈ వెబ్‌సైట్ తోడ్పడుతుందని సేథ్ తెలిపారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ప్రజలు తమ అవసరాలకు అనుగుణంగా జీవిత, ఆరోగ్య బీమా పాలసీలతో పాటు జనరల్ బీమా పాలసీలను ఎంచుకోవచ్చు.

కమోడిటీస్ మార్కెట్
విస్తరణకు కృషి

సెబీ ఛైర్మన్ పాండే



ముంబై: దేశంలో కమోడిటీస్ మార్కెట్ విస్తరణకు కట్టుబడి ఉన్నట్టు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ తెలిపింది. ఇందులో భాగంగా వ్యవసాయేతర ఉత్పత్తుల డెరివేటివ్స్ ట్రేడింగ్‌లోకి బ్యాంకులు, బీమా కంపెనీలు, పెన్షన్ ఫండ్లను అనుమతించే విషయాన్ని పరిశీలిస్తున్నట్టు సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే వెల్లడించారు. మల్టీ కమోడిటీస్ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్) నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ఈ విషయం వెల్లడించారు. నాన్ క్యాష్ సెటిల్డ్, వ్యవసాయేతర కమోడిటీస్‌లోకి విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)ను అనుమతించే విషయాన్నీ సెబీ పరిశీలిస్తోంది. ప్రభుత్వంతో చర్చించాక వీటిపై నిర్ణయం తీసుకుంటామని పాండే తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కమోడిటీస్ డెరివేటివ్ మార్కెట్లది కీలక పాత్ర అని పాండే చెప్పారు.

కొత్త జీఎస్‌టీ రేట్లతో కస్టమర్లకు వల

తగ్గింపు ధరలతో ఏసీ బుకింగ్‌లు షురూ



న్యూఢిల్లీ: వచ్చే సోమవారం నుంచి అమలులోకి రానున్న జీఎస్‌టీ రేట్ల తగ్గింపును ముందుగానే వర్తింప చేస్తూ ఎయిర్ కండిషనర్ తయారీదారులు, డీలర్లు కస్టమర్ల నుంచి ముందస్తు బుకింగ్‌లు స్వీకరిస్తున్నారు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రభావంతో ఏసీలకు డిమాండు గణనీయంగా పెరుగుతుందన్న అంచనాతో వారు ఈ చర్య తీసుకున్నారు. తాము 10% జీఎస్‌టీ తగ్గింపు ప్రయోజనం మొత్తాన్ని వినియోగదారులకు బదిలీ చేస్తున్నామని, మోడల్‌ను బట్టి ఒక్కో ఏసీపై కస్టమర్‌కు రూ.4,000 వరకు ధర తగ్గుతుందని రూమ్ ఎయిర్ కండిషనర్ తయారీదారులు చెప్పారు. ప్రస్తుతం ఏసీలపై 28% జీఎస్‌టీ విధిస్తుండగా కొత్త విధానం కింద దాన్ని 18 శాతానికి తగ్గించారు. బ్లూస్టార్, హాయర్ వంటి కంపెనీలు ఇప్పటికే ప్రీ బుకింగ్ ప్రారంభించాయి. వేసవి తీవ్రత అధికంగా ఉన్న సమయంలో అకాల వర్షాల కారణంగా జూన్ త్రైమాసికంలో ఏసీల డిమాండు గణనీయంగా తగ్గింది.


అంతేకాకుండా కస్టమర్లను ఆకర్షించేందుకు ఏసీ తయారీదారులు ఈజీ ఫైనాన్సింగ్, ఉచిత ఇన్‌స్టలేషన్, గ్యాస్ చార్జింగ్‌తో ఎక్స్‌టెండెడ్ వారెంటీ, జీరో కాస్ట్ ఈఎంఐ సదుపాయాలను తిరిగి ప్రారంభించాయి. ప్రీ బుకింగ్‌కు స్పందన బాగుందని, కొత్త జీఎస్‌టీ రేట్లు అమలులోకి వచ్చే రోజు అంటే 22వ తేదీన వారికి బిల్లు జారీ చేయనున్నట్లు బ్లూస్టార్ ఎండీ త్యాగరాజన్ చెప్పారు.

టీవీలకు పెరగనున్న డిమాండ్


జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో ఈ దీపావళి సీజన్‌లో తాము అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని సాధించగలమన్న విశ్వాసాన్ని ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం సోనీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ నయ్యర్ ప్రకటించారు. టీవీల ధరలు సగటున 7.5-8 శాతం తగ్గుతాయని ఆయన తెలిపారు. ప్రీమియం సెగ్మెంట్లో ఉన్న సోనీ కంపెనీ మోడల్‌ని బట్టి టీవీల ధర రూ.8,000-70,000 మధ్యలో తగ్గనున్నట్టు తెలిపింది.

అపోలో టైర్ల ధర తగ్గింపు


జీఎస్‌టీ ప్రయోజనాన్ని కస్టమర్లకు బదిలీ చేస్తూ అపోలో టైర్స్ తమ టైర్ల ధరను రూ.300-2000 మధ్యలో తగ్గించినట్టు ప్రకటించింది. ప్రయాణికుల వాహన టైర్లయితే రూ.300-1500 మధ్యలో తగ్గాయని, ట్రక్కు/బస్సు రేడియల్ టైర్ల ధర రూ.2000 వరకు తగ్గించినట్టు తెలిపింది.



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 18వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	118	విజయవాడ	140
వరంగల్	118	గుంటూరు	135
కరీంనగర్	118	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	127
కర్నూలు	118	నెల్లూరు	132
విశాఖపట్నం	134	అనంతపురం	132
గోదావరి	140		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,710 ▼	1,02,400 ▼	1,42,000 ▼
విజయవాడ	1,13,000 ▼	1,06,500 ▼	1,29,000 ▼
విశాఖపట్నం	1,13,770 ▼	1,02,400 ▲	1,42,000 ▼
రాజమండ్రి	1,11,710 ▼	1,02,400 ▼	1,33,000 ▲
ప్రొద్దుటూరు	1,14,200 ▼	1,05,060 ▼	1,32,000 ▼
ముంబై	1,09,733 ▼	1,00,515 ▼	1,25,756 ▼

పెట్టుబడి రూ. 55 కోట్లు.. వచ్చింది రూ. 2,437 కోట్లు

Urban Company
Accel

అర్బన్ ఐపీఓలో 'యాక్సెల్'కు జాక్‌పాట్

ముంబై: అర్బన్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ.. మదుపరులకు భారీ లాభాలను అందించింది. బుధవారం స్టాక్ మార్కెట్లో లిస్టయిన అర్బన్ కంపెనీ ప్రారంభించిన సమయంలో పెట్టుబడులు పెట్టిన మదుపరులకైతే బంపర్ లాభాలు వచ్చాయి. పదేళ్ల క్రితం వెంచర్ క్యాపిటల్ (వీసీ) సంస్థ యాక్సెల్.. అర్బన్ కంపెనీ ఈక్విటీలో ఒక్కో షేరును రూ.3.77 చొప్పున రూ.55 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసింది. తాజాగా బుధవారం కంపెనీ షేరు బీఎస్ఈలో ఇష్యూ ధర రూ.103తో పోల్చితే 56.31% ప్రీమియంతో రూ.161 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో ఏకంగా 73.78% లాభపడి రూ.179 స్థాయిని తాకింది. చివరికి 62.18% లాభంతో రూ.167.05 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.23,986.74 కోట్లుగా నమోదైంది. కాగా ఈ లెక్కన అర్బన్ కంపెనీ ఈక్విటీలో పదేళ్ల క్రితం యాక్సెల్ పెట్టిన పెట్టుబడుల విలువ ప్రస్తుతం ఏకంగా రూ.2,437 కోట్లకు చేరింది. అమెరికాలోని సిలికాన్ వ్యాలీ కేంద్రంగా పనిచేసే ఈ వీసీ గతంలో ఫేస్‌బుక్‌లోనూ పెట్టుబడి పెట్టి భారీ లాభాలు ఆర్జించింది.

రెండో రోజూ మార్కెట్లో ర్యాలీ

భారత-అమెరికా వాణిజ్య చర్చలపై నెలకొన్న ఆశావీచికలు, అమెరికన్ ఫెడ్‌రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాల నడుమ ఈక్విటీ మార్కెట్ బుధవారం వరుసగా రెండో రోజూ ర్యాలీని కొనసాగించింది. సెన్సెక్స్ 313.02 పాయింట్ల వృద్ధితో 82,693.71 వద్ద ముగిసింది. నిఫ్టీ 91.15 పాయింట్లు లాభపడి 25,330.25 వద్ద బలంగా క్లోజైంది. నిఫ్టీ 25,300కన్నా పైన నిలబడడం మార్కెట్లో సెంటిమెంట్ బలంగా ఉందనేందుకు సంకేతమని విశ్లేషకులంటున్నారు.

బెంగళూరులో కిమ్స్ హాస్పిటల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బెంగళూరులో తొలి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్) ప్రకటించింది. 450 పడకల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ హాస్పిటల్‌లో సమగ్ర వైద్య సేవలను అందించనున్నట్లు తెలిపింది. ఈ హాస్పిటల్‌లో 35 మెడికల్, సర్జికల్ స్పెషాలిటీస్, 120కి పైగా అడ్వాన్స్‌డ్ బెడ్స్‌తో పాటు అవుట్ పేషెంట్స్ కోసం ప్రత్యేకంగా 100కు పైగా రూమ్స్ అందుబాటులో ఉన్నాయని కిమ్స్ వెల్లడించింది. అందరికీ నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్న లక్ష్యంతో బెంగళూరులో తొలి హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ భాస్కర్ రావు తెలిపారు. కాగా త్వరలోనే బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీలో రెండో యూనిట్‌ను ప్రారంభించనున్నట్లు భాస్కర్ రావు చెప్పారు.

ఈ ఏడాది ఆదాయంలో రెండంకెల వృద్ధి : తనైరా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టాటా గ్రూప్‌నకు చెందిన ఎథ్నిక్ వేర్ బ్రాండ్ తనైరా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఆదాయంలో రెండంకెల వృద్ధిని అంచనా వేస్తున్నట్లు ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో సంస్థ ఆదాయం రూ.276 కోట్లుగా ఉందని పండగ సీజన్ అమ్మకాలతో వృద్ధి రెండంకెల స్థాయిలో ఉంటుందని భావిస్తున్నట్లు తనైరా చీఫ్ సేల్స్, మార్కెటింగ్ ఆఫీసర్ సోమ్‌ప్రభ్ సింగ్ తెలిపారు. రానున్న పండగల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని కొత్త కలెక్షన్‌తో పాటు వివాహాల వంటి వాటి కోసం ఈఎంఐ ఆధారిత కొనుగోలు ప్లాన్‌ను తీసుకువచ్చినట్లు చెప్పారు. కాగా తనైరా.. హైదరాబాద్‌లో 6 స్టోర్లు, ఏపీలోని విజయవాడలో ఒక స్టోర్‌ను నిర్వహిస్తోందన్నారు. కొత్తగా మరో 2-3 స్టోర్లను ప్రారంభించాలని చూస్తున్నట్లు సింగ్ తెలిపారు. తనైరా ప్రస్తుతం దేశవ్యాప్తంగా 40కి పైగా నగరాల్లో 80 స్టోర్లను నిర్వహిస్తోంది.



ఒంగోలులో లాట్ మొబైల్స్ రెండో స్టోర్

హైదరాబాద్: మొబైల్ ఫోన్ రిటైల్ చెయిన్ లాట్ మొబైల్స్.. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలులో రెండో స్టోర్‌ను ప్రారంభించింది. బుధవారం నాడు ఈ షోరూమ్‌ను టాలీవుడ్ నటి పాయల్ రాజ్‌పుత్, సంస్థ డైరెక్టర్లు యం.సుప్రజ, యం.అఖిల్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ.. షోరూమ్ ప్రారంభం సందర్భంగా నిర్వహించనున్న లక్కీ డ్రాలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, వాషింగ్ మెషిన్, రిఫ్రిజిరేటర్, ఏసీ, స్మార్ట్ టీవీ, స్మార్ట్‌ఫోన్ బహుమతులుగా అందించనుందన్నారు. మొబైల్స్ కొనుగోలుపై రూ.10,000 వరకు మొబైల్ ప్రొటెక్షన్‌తో పాటు 10 శాతం ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్, రూ.6,999 విలువ గల స్మార్ట్ కాలింగ్ వాచీ లేదా రూ.1,999 విలువ గల ఇయర్‌బడ్స్‌ను ఉచితంగా అందించనున్నట్లు డైరెక్టర్ సుప్రజ వెల్లడించారు. ఒంగోలు ప్రజల కోసం ప్రత్యేకంగా జీరో డౌన్‌పేమెంట్ ఫైనాన్స్ పథకం, నో కాస్ట్ ఈఎంఐ వంటి ఆఫర్లు ఈ స్టోర్‌లో అందుబాటులో ఉంటాయని లాట్ మొబైల్స్ డైరెక్టర్ అఖిల్ తెలిపారు.

'పీపీపీ'పై జగన్ విష ప్రచారం

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ అవాస్తవం
- మంత్రులు కొండపల్లి, వాసంశెట్టి ఫైర్

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం 'పీపీపీ' విధానంలో మెడికల్ కాలేజీలను పూర్తి చేయాలని భావిస్తోందని మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాశ్ స్పష్టం చేశారు. కానీ, 11 వైద్య కలాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారంటూ మాజీ సీఎం జగన్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. సచివాలయంలో బుధవారం మీడియాతో మంత్రులు మాట్లాడారు. తొలుత మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. "గత ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేయించి.. కేవలం 5 కాలేజీలకు అరకొరగా భవనాలు మాత్రమే నిర్మించింది. అది కూడా కేంద్రం సొమ్మే. రాష్ట్ర ప్రభుత్వ వాటా రూపాయి కూడా వెచ్చించలేదు. 17 మెడికల్ కాలేజీల్లో 3 కేంద్ర ప్రయోజిత పథకం కింద, 14 కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో చేపట్టారు. అన్నీ పూర్తి చేశామని జగన్ చెబుతున్నా పూర్తిస్థాయిలో ఏవీ జరగలేదు. 3 కాలేజీలకు కేంద్రం ఇచ్చిన రూ.975 కోట్లు మాత్రమే వినియోగించారు. మిగిలిన కాలేజీల నిర్మాణం పునాది దశ కూడా దాటలేదు. 5 కాలేజీలకు రూ.2,563 కోట్లు అవసరమైతే కేంద్రం ఇచ్చిన నిధుల నుంచి రూ.671 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి, మిగతా నిధులు దారిమళ్లించారు. 5 మెడికల్ కాలేజీల్లో మౌలిక వసతులకు ఇప్పుడు రూ.1,900 కోట్లు అవసరమవుతాయి. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్న లక్ష్యంతో పోర్టులు, విమానాశ్రయాల తరహాలోనే వాటిని 'పీపీపీ' విధానంలో పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. వీటిని విజయవంతంగా పూర్తి చేసి.. పేదలపై భారం పడకుండా నిర్వహిస్తాం." అని వివరించారు.

1,150 పీహెచ్‌సీల ఆధునికీకరణ

హైదరాబాద్‌లో ఎయిర్‌పోర్టును ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతోనే నిర్మించారని మంత్రి శ్రీనివాస్ తెలిపారు. అయినప్పటికీ టికెట్ ధరలు పెరగలేదన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తున్నామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న జగన్ మాటలను ప్రజలు నమ్మబోరని చెప్పారు. 'హెల్త్-వెల్త్-హ్యాపీ' నినాదంతో 1,150 పీహెచ్‌సీలను ఆధునికీకరిస్తున్నామని, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు మెరుగుపరచడంతోపాటు 5 కోట్ల మందికి రూ.25లక్షల ఆరోగ్య బీమా అమలు చేస్తున్నట్టు తెలిపారు.

జగన్ బ్యాచ్ ఫేక్ ప్రచారం: సుభాశ్

యూరియా కొరత అంటూ జగన్ అండ్‌కో తప్పుడు ప్రచారం చేశారని మంత్రి సుభాశ్ మండిపడ్డారు. తాజాగా మెడికల్ కాలేజీలపై ఫేక్ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 5 కాలేజీల నిర్మాణానికి రూ.671 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి, 17 కాలేజీలు కట్టామని సిగ్గు లేకుండా చెప్పుకొంటున్నారని విమర్శించారు. వైద్య కళాశాలలు ప్రారంభించాలంటే.. ఎంబీబీఎస్ తరగతి గదులు ఉండాలన్న నిబంధన పాటించకుండా.. 50% సీట్లు ప్రైవేటీకరణ చేసింది జగన్ కాదా? అని నిలదీశారు. 11 సీట్లకే పరిమితం చేసినా జగన్‌కు ఇంకా బుద్ధి రాలేదన్నారు.

నిధులు పక్కదారి పట్టించారు: భూమిరెడ్డి

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న పీజీ మెడికల్ సీట్లకు అవసరమైన వసతుల కోసం కేంద్రం రూ.700 కోట్లు ఇస్తే జగన్ ఆ మొత్తం నిధులనూ దారి మళ్లించారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి రూ.8,500 కోట్లు అవసరం అయితే జగన్ పాలనలో కేవలం రూ.1,451 కోట్లు ఖర్చు చేశారని అన్నారు. ఈ మొత్తంలో కేంద్రం ఇచ్చింది రూ.975 కోట్లు కాగా జగన్ ఖర్చు చేసింది కేవలం రూ.476 కోట్లు మాత్రమేనని వివరించారు.

ఏసీబీ కోర్టు అభ్యంతరాలకు 1నే జవాబిచ్చాం

- వివరాలన్నీ అందుబాటులోనే ఉన్నాయి
- వాటిని న్యాయాధికారి పరిశీలించకుండానే చార్జిషీట్లు అసంపూర్తిగా ఉన్నాయన్నారు
- నిందితులకు డీఫాల్ట్ బెయిల్ ఇచ్చారు
- హైకోర్టుకు సీఐడీ నివేదన
- చార్జిషీటుపై అభ్యంతరాలు లేవనెత్తుతూ ఆఫీస్ మెమోరాండం ఇవ్వడం చట్టంలో లేదు
- సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వెల్లడి
- విచారణ నేటికి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో దాఖలు చేసిన చార్జిషీట్ల విషయంలో ఏసీబీ కోర్టు లేవనెత్తిన అభ్యంతరాలన్నింటికీ దర్యాప్తు సంస్థ ఈ నెల ఒకటో తేదీనే జవాబు ఇచ్చిందని సిట్/సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది హైకోర్టుకు నివేదించారు. వివరాలన్నీ అందుబాటులో ఉన్నప్పటికీ.. చార్జిషీట్లు అసంపూర్తిగా ఉన్నాయంటూ నిందితులు ధనుంజయ్‌రెడ్డి (ఏ-31), కృష్ణమోహన్‌రెడ్డి (ఏ-32), బాలాజీ గోవిందప్ప(ఏ-33)కు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసిందన్నారు. చార్జిషీట్లపై సందేహాలుంటే పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను గానీ, దర్యాప్తు అధికారిని గానీ పిలిచి వివరణ తీసుకుని ఉండాల్సిందని తెలిపారు. సిట్ దాఖలు చేసిన చార్జిషీటు, అనుబంధ చార్జిషీటు అసంపూర్తిగా ఉన్నాయనే కారణంతో పై ముగ్గురికీ ఏసీబీ కోర్టు ఈ నెల 6న పొరపాటున డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసిందని, ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సీఐడీ పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వాటిపై న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి బుధవారం విచారణ జరిపారు. దర్యాప్తు సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. 'దర్యాప్తు సంస్థ నిర్దిష గడువులోగా చార్జిషీటు దాఖలు చేసింది. ఈ ఏడాది జూలై 19న మొదట చార్జిషీటు వేశాం. ఆగస్టు 11న అదనపు వివరాలతో మరో చార్జిషీటు వేశాం. అనంతరం ఏసీబీ ప్రత్యేక కోర్టు నిందితులకు రిమాండ్ పొడిగించింది. చార్జిషీటు వేశాక సీఆర్‌పీసీ 309వ సెక్షన్‌ను అనుసరించి రిమాండ్ పొడిగింపు ఉత్తర్వులు ఉండాలి. నిందితుల తరఫు న్యాయవాదులు చెబుతున్నట్లుగా సెక్షన్ 167(2) ప్రకారం రిమాండ్ పొడిగించినట్లు ఏసీబీ కోర్టు ఉత్తర్వుల్లో లేదు. బీఎన్ఎస్ఎస్ చట్ట నిబంధనల ప్రకారం.. చార్జిషీటు దాఖలు చేసిన అనంతరం అవసరమని భావిస్తే దర్యాప్తు అధికారి (ఐవో) దర్యాప్తును కొనసాగించవచ్చు. మేజిస్ట్రేట్ నుంచి అనుమతి తీసుకోవలసిన అవసరం లేదు. పోలీసు మాన్యువల్, సీఆర్‌పీసీలో ప్రాథమిక నివేదిక అనే పదమే ఎక్కడా లేదు. చట్టంలో పోలీసు రిపోర్టుఅని మాత్రమే ప్రస్తావించారు. చార్జిషీటు అనేది దర్యాప్తు అధికారి అభిప్రాయం మాత్రమే. దానిని పరిశీలించాల్సిన బాధ్యత న్యాయాధికారిదే. చార్జిషీట్లను క్షుణంగా పరిశీలించకుండానే ఏసీబీ కోర్టు న్యాయాధికారి అర్థం లేని అభ్యంతరాలను లేవనెత్తారు. వాటన్నిటికీ ఒకటో తేదీనే జవాబిచ్చాం. వీటిని పరిగణనలోకి తీసుకోకుండానే డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేశారు. అభ్యంతరాలకు మేం సమాధానాలిచ్చిన విషయాన్ని బెయిల్ ఉత్తర్వుల్లో ఎక్కడా ప్రస్తావించలేదు. చార్జిషీటుపై సందేహాలుంటే పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేదా దర్యాప్తు అధికారిని పిలిచి వివరణ తీసుకుని ఉండాల్సింది. అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఆఫీస్ మెమోరాండం ఇవ్వడం చట్టంలో ఎక్కడాలేదు. న్యాయాధికారి చట్టంలో లేని విధానాన్ని అనుసరించారు. ఎఫ్ఎస్ఎల్ నివేదికలు, ప్రభుత్వ అధికారుల విచారణ విషయంలో కాంపిటెంట్ అథారిటీ నుంచి అనుమతి తీసుకోలేదనే కారణంతో చార్జిషీటు అసంపూర్తిగా ఉందంటూ డీఫాల్ట్ బెయిల్ ఇవ్వడానికి వీల్లేదు. చార్జిషీటుకు అనుమతులను జత చేయాల్సిన అవసరం లేదు, ఆతర్వాతైనా ఎఫ్ఎస్ఎల్ నివేదికలు, అనుమతులను కోర్టుకు సమర్పించవచ్చు'అని తెలిపారు. కోర్టు సమయం ముగియడంతో సిట్/సీఐడీ తరఫు వాదనలు కొనసాగింపునకు విచారణను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

యాక్సిస్‌తో పీపీఏపై పూర్తి వివరాలివ్వండి

- కౌంటర్ వేయాలని హైకోర్టు ఆదేశం.. సీఎస్, డిస్కం సీఎండీకి నోటీసులు

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి విద్యుత్ కొనుగోలుకు ఏపీఎస్‌పీడీసీఎల్ చేసుకున్న ఒప్పందాని(పీపీఏ)కి ఏపీఈఆర్‌సీ ఆమోదం తెలుపడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వాజ్యంపై పూర్తి వివరాలివ్వాలని హైకోర్టు రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక సీఎస్, ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ తదితరులకు నోటీసులు జారీ చేసింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ నుంచి విద్యుత్ యూనిట్ రూ.4.68 చొప్పున కొనుగోలుకు ఏపీఎస్‌పీడీసీఎల్ చేసుకున్న ఒప్పందానికి ఆమోదం తెలుపుతూ ఈ ఏడాది మే 2న ఏపీఈఆర్‌సీ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాది గోచిపాత శ్రీనివాసరావు పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా.. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి వాదనలు వినిపించారు. బహిరంగ మార్కెట్‌లో యూనిట్ రూ.3.10-3.60కే లభ్యమవుతుంటే.. ఎస్‌పీడీసీఎల్ రూ.4.68కి కొనుగోలు చేస్తుందన్నారు. 25ఏళ్ల పాటు యాక్సిస్ ఎనర్జీ నుంచి విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకోవడం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరుగుతుందన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుని.. ఏపీఈఆర్‌సీ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే అప్పిలేట్ ట్రైబ్యునల్ వద్ద అప్పీల్ వేసుకోవాలని సూచించింది. ఏపీఈఆర్‌సీ ఉత్తర్వులు హేతుబద్ధంగా లేకపోతేనే తాము జోక్యం చేసుకోగలమని వ్యాఖ్యానించింది. పిల్‌కు విచారణార్హత లేదని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి అన్నారు. ఏపీఈఆర్‌సీ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాల్సి ఉంటుందని తెలిపారు.



ప్రభుత్వాస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరులో ప్రబలిన అతిసార

- ప్రభుత్వాస్పత్రిలో చేరిన 32 మంది.. ప్రైవేటు వైద్యశాలల్లో మరికొందరు

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో అతిసార ప్రబలింది. వాంతులు, విరేచనాలతో పెద్దసంఖ్యలో బాధితులు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. వర్షాల వల్ల తాగు నీటి వనరులు కలుషితమవ్వడమే దీనికి ప్రధాన కారణమని భావిస్తున్నారు. సంగడిగుంట, పాతగుంటూరు, ఆర్టీసీ కాలనీ, రెడ్లబజార్, బుచ్చయ్య తోట, నల్లచెరువు, రెడ్డిపాలెం నుంచి 32 మంది బాధితులు బుధవారం గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చేరారు. కొందరు ప్రైవేటు వైద్యశాలల్లో, మరికొందరు ఇళ్లల్లోనే చికిత్సలు పొందుతున్నారు. గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ప్రభుత్వాస్పత్రికి వచ్చి రోగులను పరామర్శించారు. తక్కెళ్లపాడు వాటర్ హెడ్స్ నుంచి వచ్చే నీటిని రిజర్వాయర్ల వద్ద శుద్ధి చేస్తామని, ఇళ్లకు సరఫరాలో అయ్యాక శాంపిల్స్ తీసుకుంటామని చెప్పారు. వర్షాల కారణంగా నీరు కలుషితమై ఉంటుందని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

సాహిత్య విమర్శకుడు ఆచార్య ఎస్వీ రామారావు కన్నుమూత

- 40కి పైగా విమర్శనా పుస్తకాలు రచించిన ఎస్వీ



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య విమర్శ, అధ్యయనంలో మేటి, ప్రముఖ సాహిత్య విమర్శకులు ఆచార్య ఎస్వీ రామారావు(85) కన్నుమూశారు. కొంతకాలంగా కాలేయ సమస్యతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రితో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. ప్రస్తుతం ఆయన కుటుంబం ఎల్బీనగర్ చిత్ర లేఅవుట్‌లోని సాయి బాలాజీ రెసిడెన్సీలో నివాసముంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా శ్రీరంగాపురంలో 1941 జూన్ 5న జన్మించిన ఎస్వీ పూర్తి పేరు సుగూరు వెంకట రామారావు. 1966లో ఓయూలో తెలుగు అధ్యాపకునిగా చేరి, 1987లో ఆచార్యుడిగా పదోన్నతి పొందారు. ఓయూ తెలుగుశాఖ అధ్యక్షుడిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ సంచాలకుడిగా పని చేశారు. 2001లో ఉద్యోగ విరమణ పొందిన ఆయన ఒకటో తరగతి నుంచి ఎంఏ కోర్సు వరకు తెలుగు పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక భాగస్వామ్యం వహించారు. 40కిపైగా సాహిత్య విమర్శ పుస్తకాలు రచించారు. అందులో తెలుగు సాహిత్య వైశిష్ట్యం, తెలంగాణ సాహిత్య చరిత్ర, సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర, సమగ్ర తెలుగు వాఙ్మయకోశం, పాలమూరు ఆధునిక కవుల చరిత్ర తదితర రచనలు ప్రత్యేక గుర్తింపు పొందాయి. సాహిత్య విమర్శలో ఎస్వీ రామారావు చేసిన కృషికి ఎన్నో పురస్కారాలు ఆయన్ను వరించాయి. సాహిత్య విమర్శను విశ్వవిద్యాలయ స్థాయిలో చారిత్రక దృష్టితో అధ్యయనం చేయడానికి ఆచార్య ఎస్వీ బాటలు వేశారని ఏపీ, తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధులు గుర్తు చేసుకున్నారు. అమెరికాలో స్థిరపడిన ఆయన కుమారుడు సాయి గిరిధర్ గురువారం సాయంత్రానికి హైదరాబాద్‌కు చేరుకోనుండగా, శుక్రవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

ఎట్టకేలకు డిగ్రీ సీట్ల కేటాయింపు

- 1,30,273 సీట్లు భర్తీ, మిగులు సీట్లు 2,51,765

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలి ఎట్టకేలకు డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులకు సీట్లు కేటాయించింది. మొత్తం 1,30,273 మందికి సీట్లు కేటాయించినట్లు బుధవారం రాత్రి తెలిపింది. మొత్తం 1200 కాలేజీల్లో 3,82,038 సీట్లు అందుబాటులో ఉండగా 2,51,765 సీట్లు మిగిలిపోయాయి. ప్రభుత్వ కాలేజీల్లో 70,005 సీట్లకు గాను 27,348 సీట్లు భర్తీ అయ్యాయి. ఎయిడెడ్ కాలేజీల్లో 24,699 సీట్లు ఉంటే 6,931, ప్రైవేటు కాలేజీల్లో 28,1940 సీట్లు ఉంటే 94,051, ప్రైవేటు యూనివర్సిటీల్లో 1,461 సీట్లకు 428, యూనివర్సిటీ కాలేజీల్లో 3,933 సీట్లుంటే 1,551 భర్తీ అయ్యాయి. మొత్తం డిగ్రీ కౌన్సెలింగ్‌కు 1,67,161 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, 1,54,058 మంది దరఖాస్తులు సమర్పించారు. 1,50,410 మంది వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకున్నారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఈనెల 18 నుంచి 22 వరకు కాలేజీల్లో రిపోర్టు చేయాలని ఉన్నత విద్యామండలి స్పష్టం చేసింది. కొందరు విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లు సరిపోలకపోవడంతో వారికి సీట్లు కేటాయించలేదు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ప్రధాని మోదీపై బయోపిక్



ప్రధాని నరేంద్ర మోదీ జీవిత కథ తెరకెక్కనుంది. బుధవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా 'మా వందే' అనే టైటిల్‌తో ఈ చిత్రాన్ని ప్రకటించారు మేకర్స్. 'మార్కో' ఫేమ్ ఉన్ని ముకుందన్ మోదీ పాత్రను పోషించనున్నారు. క్రాంతికుమార్ సీహెచ్ దర్శకత్వంలో ఎమ్ వీర్‌రెడ్డి నిర్మించనున్నారు. 'మోదీ జీవితంలో ని కీలక సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమా ఎన్నో పోరాటాల కంటే తల్లి సంకల్పం గొప్పదని నిరూపిస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తాం' అని మేకర్స్ తెలిపారు. కాగా, ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా ఆయనపై రూపొందించిన ఓ పాటను టీ సిరీస్ సంస్థ పలు భాషల్లో విడుదల చేసింది. తెలుగు వెర్షన్‌కు ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందించడంతో పాటు తన టీమ్‌తో కలసి ఈ పాటను పాడడం విశేషం.


నటి సరోజాదేవి పేరిట 'అభినయ సరస్వతి' పురస్కారం



పంచభాషా నటి, ఇటీవల కన్నుమూసిన బిసరోజాదేవి పేరిట 'అభినయ సరస్వతి' పురస్కారాన్ని ఏర్పాటు చేసినట్లు కర్ణాటక ప్రభుత్వం వెల్లడించింది. కన్నడ సినిమా రంగంలో 25 ఏళ్ళపాటు సేవలందించిన నటీమణులకు ఈ జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేస్తారు. ఈ ఏడాది నుంచే పురస్కారాన్ని ఇస్తామని ప్రకటించారు. ఎంపికైన వారికి రూ.లక్ష నగదు, 100 గ్రాముల బంగారంతో తయారు చేసిన జ్ఞాపికను (షీల్డు) ఇస్తారు. బిసరోజాదేవిని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం 'కర్ణాటక రత్న'గా ప్రకటించింది.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

నా కెరీర్‌లోనే బిగ్గెస్ట్ మూవీ



'మార్గన్' విజయం తర్వాత తమిళ హీరో విజయ్ ఆంటోనీ చేసిన మరో పవర్‌ఫుల్ ప్రాజెక్ట్ 'భద్రకాళి'. అరుణ్ ప్రభు దర్శకత్వంలో రామాంజనేయులు జవ్వాజి నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 19న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో విజయ్ ఆంటోనీ మీడియాతో మాట్లాడుతూ 'భద్రకాళి' ఓ పొలిటికల్ థ్రిల్లర్. రాజకీయాల్లో మీడియేటర్ పాత్ర ఎలా ఉంటుంది, పెద్ద పెద్ద స్కామ్స్‌లో మీడియేటర్ల భాగం ఎంత వరకూ ఉంటుంది అనే విషయాలను ఆసక్తికరంగా చూపించాం. ఇది నాకు 25వ చిత్రం. ఇంతవరకూ నేను చేసిన వాటిల్లో 'భద్రకాళి' బిగ్గెస్ట్ మూవీ. దర్శకుడు అరుణ్ ప్రభు కు నేను అభిమానిని. ఆయన చెప్పిన కథ నాకు బాగా నచ్చి అంగీకరించా' అని చెప్పారు. నిర్మాత సురేశ్‌బాబుతో తనకు మంచి అనుబంధం ఉందనీ, దాదాపు 300 థియేటర్లలో ఆయన ఈ సినిమాను విడుదల చేస్తున్నారనీ విజయ్ చెప్పారు. యాక్టింగ్, నిర్మాణం కారణంగా మ్యూజిక్‌కు ఎక్కువ సమయం కేటాయించలేకపోతనాన్ననీ, ఇకపై సంగీతం మీద కూడా దృష్టి పెడతానని విజయ్ ఆంటోనీ చెప్పారు.

షూటింగ్ పూర్తి

సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కిస్తున్న చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ సంయుక్తంగా నిర్మి



స్తున్నారు. ఇటీవలె విడుదలైన తొలి పాట 'మల్లిక గంధ, టీజర్ ఆకట్టుకున్నాయి. చిత్రం షూటింగ్ పూర్తైంది. ఈ సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకున్న టీమ్, ఫొటోలను షేర్ చేసింది. అక్టోబరు 17న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రానికి డీఓపీ: జ్ఞానశేఖర్ నూలి, సంగీతం: థమన్.



మీకేం కావాలో చెప్పండి!

- సినీ కార్మికులతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌ను హాలీవుడ్ స్థాయికి తీసుకెళదామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తన మద్దతు సినీ కార్మికులకేనని.. వ్యక్తిగత పరిచయాలతో కార్మికుల సమస్యలను ముడిపెట్టనని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డితో సినీ పరిశ్రమ ఉద్యోగుల సమాఖ్య సభ్యులు బుధవారం సమావేశమయ్యారు. సినీ పరిశ్రమ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి సినిమా కార్మికులకు ఏం కావాలో చర్చించుకుని చెప్పాలని, పరిశ్రమలో కీలకమైన కార్మికులను విస్మరించవద్దని నిర్మాతలకు గతంలోనే చెప్పానన్న విషయాన్ని గుర్తు చేశారు. కళాకారులు, సాంకేతిక నిపుణుల్లో నైపుణ్యాల పెంపునకు సహకరించాలని నిర్మాతలకు సూచించారు. చిన్న సినిమా నిర్మాతలకు తోడ్పాటు ఇవ్వాలని, పరిశ్రమలో పని వాతావరణాన్ని చెడగొట్టుకోవద్దన్నారు. ఈ ప్రభుత్వం కార్మికుల పక్షపాతి అని, సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదని, తాను కార్మికుల వైపే ఉంటానని చెప్పారు. సినిమా కార్మికులకు ఆరోగ్య బీమా అందించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు, తెలుగు సినీ పరిశ్రమ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు కానుమల్లి, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

అభివృద్ధిలో వేగం

సమర్థ నాయకత్వంతో ముందుకు

» ఏపీ-యూకే బిజినెస్ ఫోరం రోడ్‌షోలో లోకేశ్

» విశాఖ భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానం

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సమర్థ నాయకత్వం, ప్రభుత్వ నిర్ణయాల్లో వేగం, యువ నేతల ఉత్సాహంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని మంత్రి లోకేశ్ చెప్పారు. స్పీడ్ ఆఫ్ బిజినెస్‌ను స్లోగన్లకే పరిమితం చేయకుండా చేతల్లో చూపుతున్నామన్నారు. ఈ ఏడాది నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు జరగనున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి లండన్‌లో ఏపీ-యూకే బిజినెస్ ఫోరం రోడ్‌షో జరిగింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్, పాల్‌మాల్ కన్వెన్షన్ వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి టెక్-మహీంద్రా యూరప్ బిజినెస్‌హెడ్ హర్షుల్ అస్నానీ సంధానకర్తగా వ్యవహరించారు. ప్రముఖ కంపెనీలైన హిందూజా గ్రూప్, రోల్స్ రాయిస్, అపోలో టైర్స్, ఆర్సెలార్ మిట్టల్, కోవెంట్రీ యూనివర్సిటీ ప్రతినిధులతో లోకేశ్ ద్వైపాక్షిక చర్చలు చేశారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా సీఐఐ ఆధ్వర్యంలో పారిశ్రామిక భాగస్వామ్య సదస్సును నిర్వహిస్తున్నామని లోకేశ్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో గ్లోబల్ పార్టనర్స్‌తో రోడ్‌షోలను నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో లోకేశ్ ఇంకా ఏం మాట్లాడారంటే.. "గడిచిన 15 నెలల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థనాయకత్వం వల్ల రూ. 10 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ వేగంగా అభివృద్ధి చెందడానికి మూడు కారణాలు ఉన్నాయి. ఇందులో మొదటిది, గట్టి ట్రాక్ రికార్డు ఉన్న లీడర్‌షిప్. రాష్ట్రానికి సుస్థిరమైన నాయకత్వం. చంద్రబాబు క్రెడిబిలిటీ, లీడర్‌షిప్ క్వాలిటీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రపంచమంతటికీ ఆయన సమర్థనాయకత్వం గురించి తెలుసు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు అద్భుతంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు కొత్త రాష్ట్రాన్ని కూడా అదేతరహాలో అభివృద్ధి చేస్తున్నారు.

పెద్ద సంస్థలను రప్పించాం


రాష్ట్రం వేగవంతంగా అభివృద్ధి చెందడానికి రెండో కారణం.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ అమలు. ప్రాజెక్టు ఆరునెలలు ఆలస్యమైతే మొత్తం బిజినెస్ ప్లాన్ దెబ్బతింటుంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మాటల్లోనే కాకుండా చేతల్లో అమలు చేస్తున్నామన్న సంకేతాలను ప్రపంచానికి ఇస్తున్నాం. భారత్‌లో అతి పెద్ద ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ రాష్ట్రంలో ఏర్పాటు కాబోతోంది. ప్రతిపాదనలపై చర్చల సమయంలో ఆ స్టీల్ ప్లాంట్ మూడు ప్రధానాంశాలను ప్రభుత్వం ముందుంచింది. వాటిని కేవలం పన్నెండు గంటల్లోనే పరిష్కరించాం. ఈ నవంబరు నుంచే ఆర్సెలార్ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభం కాబోతున్నాయి. దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ విశాఖకు త్వరలోనే రాబోతోంది. టీసీఎస్ లాంటి పెద్ద సంస్థలను రప్పించడం ద్వారా రాష్ట్ర ప్రతిష్ఠను పెంచేందుకే ఎకరా 99 పైసల చొప్పున ఇస్తున్నాం.

అభివృద్ధి తపనతో యువనాయకత్వం

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి వేగవంతం కావడానికి ఉత్సాహంగా పనిచేసే యువ నాయకత్వం మూడో కారణం. అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా 50 శాతం మంది గెలిచారు. మంత్రివర్గంలోని 25 మందిలో 17 మంది కొత్తవారే. రాష్ట్రం స్టార్టప్ స్టేజ్‌లో ఉన్నందున.. వారందరిలోనూ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న తపన ఉంది. విజనరీ లీడర్ చంద్రబాబు అధ్యక్షతన పారిశ్రామిక సంస్థలతో అవగాహన ఒప్పందాలతోనే సరిపుచ్చకుండా ప్రాజెక్టులన్నింటినీ వాస్తవ రూపంలోకి తీసుకొచ్చి ఉత్పత్తి చేపట్టేలా చర్యలు చేపడుతున్నాం. రాబోయే ఐదేళ్లలో పారిశ్రామికరంగంలో 20 లక్షల ఉద్యోగాలను కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ధ్యేయం.

సాంకేతిక ప్రగతి ముఖచిత్రం మారుతోంది

దక్షిణాసియాలో తొలి 158 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ జనవరిలో అమరావతికి రాబోతుంది. ప్రధాని మోదీ ప్రారంభించిన క్వాంటమ్ మిషన్‌ను ముందుండి నడిపించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. దీని ద్వారా అమరావతిలో అద్భుతమైన ఎకో సిస్టమ్ ఏర్పాటు కాబోతోంది. విశాఖలో డేటా సిటీ నిర్మాణంతో అక్కడ కేబుల్స్ ల్యాండ్ అవుతాయి. ముంబై కన్నా రెట్టింపు సామర్థ్యంతో 1.5 గిగావాట్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కాబోతోంది. రాబోయే మూడేళ్లలో ఆ పనులన్నీ పూర్తవుతాయి. ఇది ఆరంభం మాత్రమే. ఇంకా ఎన్నో ప్రతిష్ఠాత్మక సంస్థలతో చర్చలు జరుపుతున్నాం. ఇవన్నీ ఫలప్రదమైతే.. రాష్ట్ర సాంకేతిక ప్రగతి రూపురేఖలు సమూలంగా మారిపోతుంది. క్వాంటమ్ వ్యాలీ, డేటా సిటీలతో ఆంధ్రప్రదేశ్ ఐటీ ముఖచిత్రం ప్రపంచస్థాయికి చేరుకుంటుంది. ఐటీ విప్లవంతో భారతదేశం లబ్ధి పొందింది. ఏపీ బలపడింది. కృత్రిమ మేధ ద్వారా వచ్చే అవకాశాలు అందిపుచ్చుకునేందుకు స్కిల్ అప్‌గ్రేడేషన్‌ను అమలు చేస్తున్నాం. రాబోయే రోజుల్లో ఏఐ గేమ్ చేంజర్ కాబోతోంది. పారిశ్రామిక ప్రగతికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలతో కూడిన పాఠ్యాంశాలను విద్యలో అమలు చేస్తున్నాం. విజన్-2047 లక్ష్యంతో ప్రధానమైన 2.4లక్షల ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోవడానికి ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధించాలి. ఈ దిశగా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. మాప్రయాణంలో ప్రపంచ భాగస్వాములను జత చేసుకుంటున్నాం. స్పేస్ సిటీ నిర్మించబోతున్నాం." అని వెల్లడించారు. ఎరిక్సన్, సియెంట్, ఇవాంటే గ్లోబల్,ఏఐ ఓపెన్‌సెక్, బ్యాంక్ ఆఫ్ అమెరికాతో పాటు అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్, ఫైనాన్స్, ఇంధన, టెక్నాలజీ, లండన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా లండన్‌లోని ఇస్కాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి లోకేశ్

మోదీకి సీఎం జన్మదిన శుభాకాంక్షలు

» లండన్ ఇస్కాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంపూర్ణ ఆరోగ్యంతో మరికొన్ని సంవత్సరాలు దేశానికి సేవ చేయాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. బుధవారం మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రధానికి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. వికసిత్ భారత్ కోసం మోదీ కృషి శ్లాఘనీయమన్నారు. కాగా, ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా మంత్రి లోకేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. లండన్ పర్యటనలో ఉన్న లోకేశ్ అక్కడ ఇస్కాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మోదీ మార్గదర్శకత్వంలో వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధిస్తామనే నమ్మకం ఉందన్నారు.

బెంగళూరుకు బ్లాక్‌బక్ బైబై

(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వానించారు. ఈ పరిణామం కర్ణాటక ప్రభుత్వ, పారిశ్రామికవర్గాల్లో కలకలం రేపింది. తక్షణమే దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాలని పారిశ్రామికవేత్తలు సీఎం సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారుకు సూచించారు. ముఖ్యంగా బెంగళూరు నగరాభివృద్ధి మంత్రిగా ఉన్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ దీనిపై స్పందించాలని కోరారు. వివరాల్లోకి వెళ్తే.. బెంగళూరు ఔటర్ రింగ్ రోడ్డు, కాడుబీసినహళ్ళి ప్రాంతంలో రహదారులు నాసిరకంగా, గుంతలమయంగా ఉన్నాయి. ఔటర్ రింగ్ రోడ్డులోని బెళ్లందూరులో తన ఇల్లు, కార్యాలయం ఉన్నాయని.. ఈ ప్రాంతం నుంచి ఎటు వెళ్లాలన్నా కష్టంగా ఉందని.. తమ ఉద్యోగులు కార్యాలయానికి వచ్చేందుకు గంటన్నరకు పైగా పడుతోందని రాజేశ్ తన పోస్టులో ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డంతా గుంతలు పడ్డాయని, దుమ్ము రేగుతోందని, కనీస నిర్వహణ కూడా లేదన్నారు. తొమ్మిదేళ్లగా బాధలు పడుతున్నామని.. మరో ఐదేళ్లయినా ఈ సమస్య పరిష్కారమవుతుందన్న నమ్మకం లేదని తెలిపారు. అందుకే కంపెనీని తరలించాయని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే బెంగళూరు నుంచి ఎక్కడకు తరలించేదీ ఆయన తెలుపలేదు. బ్లాక్‌బక్ లాజిస్టిక్స్ టెక్ కంపెనీలో బి-కేపిటల్, ఆసీల్, గోల్డ్‌మ్యాన్ సాక్స్ లాంటి సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. సంస్థలో 1,500 మంది ఉద్యోగులు ఉన్నారు. రాజేశ్ యవాజీ పోస్టుపై లోకేశ్ తక్షణమే స్పందించారు. 'హాయ్ రాజేశ్.. మీ కంపెనీని మా విశాఖపట్నానికి తరలించండి. దేశంలోని స్వచ్ఛ నగరాల్లో అది ఐదోస్థానంలో ఉంది. అక్కడ గుణాత్మకమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. మహిళలకు సురక్షితమైన నగరమన్న రేటింగ్ కూడా పొందాం. మీ కంపెనీని ఇక్కడికి మార్చే విషయాన్ని పరిశీలించండి..' అని కోరారు.

ప్రభుత్వం స్పందించాలి: పారిశ్రామికవేత్తలు

రాజేశ్ పోస్టు.. లోకేశ్ స్పందనపై బెంగళూరులోని ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలు మోహన్‌దాస్ పాయ్, కిరణ్ మజుందార్ షా తీవ్రంగా స్పందించారు. బెంగళూరులో పాలనా వైఫల్యానికి ఇది నిదర్శనమని పాయ్ 'ఎక్స్'లో ధ్వజమెత్తారు. డీకే శివకుమార్‌కు ట్యాగ్ చేశారు. 'పరిస్థితి ఏమీ బాగాలేదు. కంపెనీలు బెంగళూరు ఔటర్ రింగ్ రోడ్డు నుంచి తరలిపోవాలని భావిస్తున్నాయి. జోక్యం చేసుకోండి' అని ఆయనకు విన్నవించారు. ఇది తీవ్రమైన సమస్యని, పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు అవసరమని బయోకాన్ ఎండీ కిరణ్ మజుందార్ షా 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. రాజేశ్ యవాజీ ప్రకటన తమకు బాధ కలిగిస్తోందని గ్రేటర్ బెంగళూరు ఐటీ కంపెనీల సంఘం జనరల్ సెక్రటరీ కృష్ణకుమార్ గౌడ అన్నారు. పారిశ్రామికవేత్తల పోస్టులపై డీకే శివకుమార్ కూడా 'ఎక్స్'లో స్పందించారు. నగరంలోని అన్ని గుంతలను నవంబరులోగా పూడుస్తామని.. ఈ మేరకు కాంట్రాక్టర్లకు గడువు విధించామని తెలిపారు.



విజయవాడలో నిర్వహించిన స్వచ్ఛ సేవ కార్యక్రమంలో రోడ్డు ఊడుస్తున్న మంత్రి నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్, తదితరులు

నాలుగైదు రోజుల్లో పాత చెత్త శుభ్రం

» మునిసిపల్ ఎన్నికలకు సిద్ధమవుతున్నాం: మంత్రి నారాయణ

ఏలూరు, రాజమహేంద్రవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీ, కార్పొరేషన్‌ల్లో లెగసీ వ్యర్థాల(పేరుకుపోయిన చెత్త కుప్పలు)ను నాలుగైదు రోజుల్లో శుభ్రం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పి.నారాయణ తెలిపారు. బుధవారం ఏలూరు నగరంలోని డంపింగ్ యార్డును, టిడ్కో ఇళ్లను స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలసి పరిశీలించారు. అనంతరం రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌లో గోదావరి పుష్కరాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరితో కలసి అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ రెండు సందర్భాల్లో మంత్రి మీడియాతో మాట్లాడారు. 'పేరుకుపోయిన 85 లక్షల టన్నుల వ్యర్థాలను శుభ్రం చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఇప్పటి వరకు 83 లక్షల టన్నులను మిషన్ల ద్వారా శుద్ధి చేశాం. వర్షాల వల్ల ఆలస్యమైంది. అక్టోబరు 2 నాటికి అంతా క్లీన్‌గా ఉంటుంది. రోజుకు సగటున 35 మెట్రిక్ టన్నుల చెత్తను రాష్ట్రవ్యాప్తంగా శుభ్రం చేయిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 430 చదరపు అడుగుల టిడ్కో ఇళ్లను ఈ ఏడాది డిసెంబరు నాటికి, 360 చదరపు అడుగుల టిడ్కో ఇళ్లను మార్చి నెలాఖరుకు పూర్తి చేయడానికి అన్ని చర్యలు చేపట్టాం' అని తెలిపారు. 'మునిసిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. 17 నగర పంచాయతీల్లో ఎన్నికలపై స్టే ఎత్తివేతలను ఆయా ఎమ్మెల్యేలు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని కోరాం. రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తాం. పురపాలక శాఖ పనితీరుపై సీఎం అసహనం వ్యక్తం చేయలేదు.' అని తెలిపారు.

సచివాలయ అసిస్టెంట్ సెక్రటరీల పదోన్నతులకు సై

» గత ప్రభుత్వ రివర్షన్ జీవో ఉపసంహరణ

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలోని 50 మంది అసిస్టెంట్ సెక్రటరీల పదోన్నతులను నిర్ధారిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫలితంగా పదోన్నతులకు మార్గం సుగమమైంది. 2023లో 50 మంది సెక్షన్ ఆఫీసర్లకు అసిస్టెంట్ సెక్రటరీలుగా పదోన్నతులు కల్పించేందుకు వీలుగా ఏపీ సబార్డినేట్ సర్వీస్ నిబంధనల్లో అప్పటి ప్రభుత్వం మార్పులు చేసింది. ఇలా ఇచ్చిన పదోన్నతులను హైకోర్టు ఆదేశాల మేరకు అప్పుడే రివర్షన్ చేశారు. దీంతో ఏఎస్‌వోల నుంచి ఎస్‌వోలు, ఎస్‌వోల నుంచి ఏఎస్‌ల పదోన్నతులు నిలిచిపోయాయి. ఇప్పుడు ఆనాటి రివర్షన్ ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కి తీసుకుని, ప్రమోషన్లకు అనుమతి ఇచ్చింది. కాగా, ఉద్యోగుల సమస్యను పరిష్కరించినందుకు అప్సా మాజీ జనరల్ సెక్రటరీ జి. రామకృష్ణ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

వక్ఫ్ స్థలాల్లో అభివృద్ధి పనులకు ఓకే

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వక్ఫ్ స్థలాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు బోర్డు అంగీకరించిందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. విజయవాడలోని రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో 6వ బోర్డు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రవేశపెట్టిన అజెండాలపై ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా పలు మేనేజ్‌మెంట్ కమిటీలను, ముతవల్లీలను నియమించినట్లు అజీజ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 28 ప్రదేశాల్లో తాలిం-ఏ-హునర్ పేరుతో స్కిల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు

బార్లకు నేడు రెండో విడత లాటరీ

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బార్ పాలసీలో రెండో విడత లాటరీ ప్రక్రియ గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేసింది. రెండో విడతలో 428 బార్లకు నోటిఫికేషన్ జారీచేశారు. దరఖాస్తులకు ఈనెల 14 వరకు గడువు ఇవ్వగా, ఆశించినన్ని రాకపోవడంతో గడువు పొడిగించారు. అయినప్పటికీ వంద బార్లకు కూడా 4 దరఖాస్తులు రాలేదు. నిబంధనల ప్రకారం 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తారు. బార్ పాలసీ నిబంధనలను సవరించాలని కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు సూచించారు. అందువల్లే ఈ మాత్రం దరఖాస్తులైనా వచ్చాయి. అప్పటి వరకు 30లోపే దరఖాస్తులు అందాయి. కాగా, బార్లకు సరఫరా చేసే మద్యంపై అదనంగా విధించిన ఏఆర్‌ఈటీ పన్ను తగ్గింపునకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం 15శాతం ఏఆర్‌ఈటీ ఉండగా, దానిని 6శాతం చేయాలని ఆలోచన చేస్తోంది. మిగిలిన 9శాతం ఏఆర్‌ఈటీని షాపులకు సర్దుబాటు చేస్తుంది.

ఏపీఈఆర్‌సీ చైర్‌పర్సన్, లోకాయుక్త పోస్టుల భర్తీకి ఇబ్బందేంటి?: హైకోర్టు

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీఈఆర్‌సీ, లోకాయుక్త, తదితర సంస్థల అధిపతుల(హెడ్స్) నియామకంలో జరుగుతున్న జాప్యంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ధర్మాసనం నిలదీసింది. ఆ పోస్టుల భర్తీ చేయడానికి మీకున్న ఇబ్బంది ఏంటని ప్రశ్నించింది. ఓ దశలో చీఫ్ సెక్రటరీ హాజరవ్వాలని ఆదేశించేందుకు సిద్ధమైంది. తదుపరి విచారణ నాటికి పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచుతామన్న ఎస్‌జీపీ విజ్ఞప్తితో విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఏపీఈఆర్‌సీ చైర్‌పర్సన్ పోస్టును భర్తీ చేసేలా ఆదేశించాలని కోరుతూ డాక్టర్ దొంతిరెడ్డి నరసింహారెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై పిటిషనర్ తరఫు న్యాయవాది బుధవారం వాదనలు వినిపించారు. ఏపీఈఆర్‌సీలో సభ్యుడి పోస్టు భర్తీకి ఈ ఏడాది జూన్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. చైర్‌పర్సన్ పోస్టు భర్తీకి చర్యలు తీసుకోలేదు' అని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. ఈఆర్‌సీ సభ్యుడి నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చినట్టు వివరించారు.

ఉద్యోగ భద్రత కావాలి: కాంట్రాక్టు పాలిటెక్నిక్ లెక్చరర్లు

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు ప్రభుత్వాన్ని కోరారు. పాలిటెక్నిక్‌లలో ఖాళీల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీచేయడంతో తమ భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందన్నారు. కాంట్రాక్టు లెక్చరర్ల పోస్టుల సంఖ్యను మినహాయించి మిగిలిన పోస్టులను మాత్రమే ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని కోరుతూ బుధవారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో, మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో వినతిపత్రాలు ఇచ్చారు. ఏపీపీఎస్సీ చర్యల వల్ల 82 మందికి సమస్య తలెత్తుతుందని కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం నేతలు ఏఆర్ గోవర్ధన్ నాయుడు, బి.కృష్ణ, పి.సాయిరాజు వివరించారు.

'పీఎం విశ్వకర్మ' ద్వారా 237 కోట్ల రుణాలు: లంకా

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): చేతివృత్తులను వంశపారంపర్యంగా స్వీకరించి, వాటినే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న వారందరికీ 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ విశ్వకర్మ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మాట్లాడారు. విశ్వకర్మ జయంతిని అన్ని జిల్లాల్లో అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద 31 వేల మందికి రూ.237 కోట్ల మేర రుణాలు అందజేసినట్లు తెలిపారు. వాగ్గేయకారుడు త్యాగయ్య జన్మించిన ప్రకాశం జిల్లా, కాకర్లలో ఆయన పేరిట ఆడిటోరియాన్ని టీటీడీ ద్వారా నిర్మించనున్నట్లు తెలిపారు.



విజయవాడ నగరంలో పగలు రోడ్లపై టిప్పర్లు

టిప్పర్.. హారర్!

» వాహనదారుల పాలిట మృత్యుశకటాలు

» అధిక లోడు, మితిమీరిన వేగంతో హడల్

» రోడ్లపై అడ్డూ అదుపూ లేకుండా భయోత్పాతం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

పరిమితికి మించిన లోడు.. మితిమీరిన వేగం.. అడ్డూ అదుపూ లేదన్నట్టుగా రోడ్లపై టిప్పర్లు దూసుకెళ్తున్నాయి. ఇక ఖాళీ బండి అయితే పట్టపగ్గాలుండవు. డ్రైవర్లకు పూర్తి స్థాయిలో శిక్షణ లేకపోవడం, నిర్లక్ష్యం, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం, మితిమీరిన వేగం కారణంగా టిప్పర్లు మృత్యుశకటాలుగా మారుతున్నాయి. రాష్ట్రంలో ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎందరో అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. తాజాగా నెల్లూరు జిల్లాలో టిప్పర్ రాంగ్ రూట్‌లో వెళ్లి ఓ కారును ఢీకొట్టడంతో ఏడుగురు మరణించారు. రోడ్డుపై టిప్పర్ కనపడగానే వాహనదారులు, పాదచారులు బెంబేలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. టిప్పర్ డ్రైవర్లు అందరూ నిర్లక్ష్యంగా ఉంటారని కాదు కానీ చాలా వరకు రోడ్లపై భయానక వాతావరణం సృష్టిస్తున్నాయి. ఇసుక, మట్టి, గ్రావెల్ వంటి వాటిని తరలించడానికి టిప్పర్లు వాడుతారు. కొండలు, క్వారీల్లోకి వెళ్లి రావాల్సి ఉన్నందున టిప్పర్లకు ఎక్కువ పవర్ ఉంటుంది. లోడు బండ్లు కూడా చాలా వేగంగా వెళ్తాయి. ఖాళీ బండ్లు అయితే ఇక చెప్పనవసరం లేదు. డ్రైవర్లకు ట్రిప్పులను బట్టి డబ్బులు ఇస్తుండటంతో ఎన్ని ఎక్కువ ట్రిప్పులు తోలితే అంత డబ్బు వస్తుందనే ఆశతో మితిమీరిన వేగంతో వెళ్తున్నారు. తమకు దారి ఇవ్వకపోతే ఇతర వాహనదారుల చెవులకు చిల్లులు పెడుతున్నారు. మామూలు రహదారులపై మోటారు సైకిల్‌ను తిప్పినట్టుగా తిప్పేసి ప్రజల ప్రాణాలు తీసేస్తున్నారు. టిప్పర్లు వస్తున్నాయంటే పక్కకు పారిపోయే పరిస్థితి రహదారులపై కనిపిస్తోంది. వాటికి అడ్డుకట్ట వేయాల్సిన ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నాయి. టిప్పర్ యజమానులకూ కాసులపై ఉన్న ధ్యాస ప్రజల ప్రాణాలపై ఉండడం లేదు.

రాష్ట్రంలో 70 వేల టిప్పర్లు

రాష్ట్రంలో ఉన్న భారీ వాహనాల్లో లారీల తర్వాత టిప్పర్ల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. మొత్తం 70 వేల టిప్పర్లు ఉన్నాయి. ఇవి కాకుండా 4 లక్షల లారీలు ఉన్నాయి. వాటిలో 2.75 లక్షలు నేషనల్ పర్మిట్ ఉన్నవి ఉన్నాయి. లారీలు సరుకు రవాణాకు మాత్రమే వెళ్తుంటాయి. మట్టి, ఇసుక, సిమెంట్, కంకర వంటి రవాణాకు టిప్పర్లను ఉపయోగిస్తున్నారు. ఇసుక రీచ్‌లు, గ్రానైట్, గ్రావెల్ క్వారీలు ఉన్న ప్రాంతాల్లో ఈ టిప్పర్ల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతోంది. ఈ టిప్పర్లు ఎక్కువగా ప్రజాప్రతినిధుల చేతుల్లో ఉన్నట్టు తెలుస్తోంది. అధికారంలోకి రాగానే ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో టిప్పర్లను కొనుగోలు చేస్తున్నారు. వాటిని నియోజకవర్గాల్లో జరిగే మైనింగ్‌లో కాంట్రాక్టుకు ఇస్తున్నారు. ఇసుక రీచ్‌లు ఉన్న జిల్లాలో ఇసుక తరలింపునకు ఉపయోగిస్తున్నారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల్లో ఇసుక రీచ్‌లు ఎక్కువగా ఉండడంతో టిప్పర్ల కొనుగోలు పెరుగుతోంది. సాధారణంగా ఆరు చక్రాల టిప్పర్‌కు 12 టన్నులు, 10 చక్రాల వాహనానికి 20 టన్నులు, 12 చక్రాల టిప్పర్‌కు 25 టన్నులు, 14 చక్రాల వాహనానికి 30 టన్నులు, 16 చక్రాల వాహనానికి 35 టన్నులు లోడ్ వేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనలను టిప్పర్లు, లారీలు పాటించడం లేదన్నది బహిరంగ రహస్యం. టిప్పర్ బాడీని దాటేసి పైకి కనిపించేలా ఇసుక, గ్రావెల్‌ను నింపుతున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా దానిపై టార్పాల్‌ను గట్టిగా కట్టాలి. అయితే లోడింగ్ పూర్తవ్వగానే పైపైన టార్పాల్ కట్టి వదిలేస్తున్నారు. టిప్పర్లు వేగంగా వెళ్లినప్పుడు ఈ టార్పాల్ పైకి ఎగిరిపోవడంతో ఇసుక, గ్రావెల్ బయటకు వస్తున్నాయి. ఇవి రోడ్లపై పడటం, ద్విచక్ర వాహనదారుల కళ్లలో పడటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం 5 టన్నుల అధిక లోడ్ లేకుండా ఏ ఒక్క టిప్పర్ రోడ్డు పైకి రావడం లేదని అధికారులు చెబుతున్నారు. హెవీ లోడ్‌తో వేగంగా వెళ్లే టిప్పర్‌కు బ్రేక్ వేసినా వాహనం అదుపులోకి రాదని, కొంత దూరం వరకు బ్రేక్ పని చేయదని చెబుతున్నారు.

రాజకీయ గండం

బిల్డర్లు, కాంట్రాక్టర్లు టిప్పర్ల యజమానులుగా ఉంటున్నారు. ఇసుక రీచ్‌లు, క్వారీలు నడిపేవారు, రోడ్డు నిర్మాణం చేసే కాంట్రాక్టర్లు రవాణా నిమిత్తం వాటిని కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారంలో వచ్చే ఇబ్బందుల నుంచి తప్పించుకుని, అక్రమార్జనను పెంచుకునేందుకు పార్ట్‌టైమ్ పొలిటీషియన్ అవతారం ఎత్తుతున్నారు. పదవులను దక్కించుకుని అధికారం అండతో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు.

అనుభవం లేకుండా డ్రైవింగ్

భవన, రహదారుల నిర్మాణ సామగ్రిని అత్యధికంగా టిప్పర్లు రవాణా చేస్తున్నాయి. యజమానులు బాగానే సంపాదిస్తున్నా డ్రైవర్ల జీతాల విషయంలో కక్కుర్తి పడుతున్నారు. తక్కువ జీతానికి పని చేసే యువత చేతికి యజమానులు స్టీరింగ్ ఇస్తున్నారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని క్వారీల్లోని కంకర, డస్ట్‌ను తరలించేందుకు అనుభవం లేని యువకులను డ్రైవర్లుగా నియమించుకుంటున్నారు. కొన్ని క్వారీల్లో మైనర్లు డ్రైవర్లుగా ఉంటున్నారు. పరిమితికి మించిన వేగం, రోడ్డు ప్రమాదకర మలుపుల్లోనూ అతివేగం, రాంగ్ రూట్‌లో టిప్పర్లను తిప్పుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.



నుజ్జునుజ్జయిన కారులో ఉన్న మృతదేహం

చిదిమేసిన టిప్పర్

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఘోరం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...నెల్లూరు సిటీలో తాళ్లూరు శ్రీనివాసులు (40) అనే వ్యక్తి తన భార్య రాధమ్మతో (38) కలిసి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. వీరు ఇటీవల మారుతి కంపెనీకి చెందిన ఫ్రాంక్స్ మోడల్ కారు కొన్నారు. రాధమ్మ బంధువు ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకుని వారు... తమ బంధువులు శేషం సారమ్మ (40) బాలవెంగయ్య, చల్లగుండ్ల శ్రీనివాసులు, లక్ష్మి (35) దంపతులతో బయలుదేరారు. తమ వద్ద పనిచేసే బ్రహ్మయ్య అనే వ్యక్తికి కారు డ్రైవింగ్ తెలిసి ఉండటంతో కారు ఎక్కించుకున్నారు. ఇలా ఏడుగురు బుధవారం ఉదయం 10.30 గంటలకు బయలుదేరారు. నెల్లూరు దాటి ముంబై హైవే మీదుగా ఆత్మకూరు దిశగావెళుతూ.. సంగం కొండ దిగి పెరమన సమీపానికి 11.30 గంటలకు కారు వచ్చింది. ఇంతలో రాంగ్‌రూట్‌లో వచ్చిన ఇసుక టిప్పర్... ఆ కారును ఢీకొంది. వేగం ధాటికి కారు ముందు భాగం నుజ్జునుజ్జయి 20 మీటర్ల వెనక్కి వచ్చిఆగింది. అందులోని ఏడుగురూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. టిప్పర్ డ్రైవర్ ప్రసాద్‌రెడ్డి పోలీసులకు లొంగిపోయాడు.

మద్యం మత్తా? ఓవర్‌టేకా?

టిప్పర్ డ్రైవర్ మితిమీరిన వేగమే నిండు ప్రాణాలను బలితీసుకొంది. ఆ సమయంలో అతడు మద్యం మత్తులో ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. టిప్పర్ ఇసుక లోడుతో ఆత్మకూరు నుంచి సంగం వైపు వెళుతుండగా, కారు ఆత్మకూరు వైపు పోతోంది. అది రెండు లేన్ల హైవే...మధ్యలో డివైడరు లేదు. అప్పటివరకు ఎడమ వైపు సవ్యంగానే వెళుతున్న టిప్పర్ ఒక్కసారిగా బాగా కుడి వైపునకు వచ్చింది. అతి వేగానికి తోడు ఓవర్‌టేక్ కోసం డ్రైవర్ ప్రయత్నించాడా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే, ఓవర్ టేక్ చేయడానికి ముందు ఎటువంటి వాహనాలు లేవని హైవే పక్కన ఉన్న పశువుల కాపర్లు చెబుతున్నారు. ఇలా... రాంగ్‌రూట్‌లోకి వచ్చేసిన టిప్పర్ ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. టిప్పర్ ఢీకొట్టిన ధాటికి కారు ముందుభాగం నుజ్జునుజ్జయి టిప్పర్ బంపర్ కిందకు దూసుకుపోయింది. కారు ఇంజన్‌తోపాటు ముందుభాగం వెనుక సీటు వరకు నుజ్జునుజ్జయ్యింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కారులో ఇరుక్కున్న మృతదేహాలను బయటకు తీసేందుకు శతవిధాలా ప్రయత్నించారు. కారు డోర్‌లు తెరుచుకోకపోవడంతో మృతదేహాలను వెలికి తీయడం కష్టమైంది. పోలీసులు రెండు క్రేన్‌లు, ఒక జేసీబీని రప్పించి ఒకదానికొకటి ఇరుక్కున్న కారు, టిప్పర్‌ను ఎట్టకేలకు వేరుచేశారు.

విశ్వకర్మ ఆశీస్సులతో ప్రపంచస్థాయిలో అమరావతి: మాధవ్

» రాజధాని శంకుస్థాపన ప్రదేశంలో ఘనంగా విశ్వకర్మ జయంతి

తుళ్లూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ ఆశీస్సులతో ప్రపంచస్థాయి నగరంగా రాజధాని అమరావతి అవుతుందని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. రాజధాని అమరావతికి శంకుస్థాపన చేసిన గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని ఉద్దండ్రాయునిపాలెంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. హోమాలు చేసి, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, 'రాజధానిలో విశ్వకర్మ విగ్రహ ఏర్పాటుకి కృషి చేస్తా. సర్వప్రాణులు భగవంతుని స్వరూపాలు. ఆర్‌ఎస్‌ఎస్ దేశ అస్తిత్వాన్ని, మూలాలను సరిచేస్తుం ది. మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియాలను ప్రధాని మోదీ తీసుకొచ్చారు. దేశం గురించి ఆలోచించే పార్టీ బీజేపీనే' అని మాధవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, ఎమ్మెల్సీ పోతుల సునీత, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపికృష్ణశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రాజధాని శంకుస్థాపన ప్రదేశంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్న మాధవ్

మహిళలను పారిశ్రామికవేత్తల్ని చేస్తాం: కొండపల్లి

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ఏపీమహిళా పారిశ్రామికవేత్తల మండలి(ఎలీప్), సెర్ప్‌మధ్య బుధవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ర్యాంప్ కార్యక్రమం కింద కృష్ణా జిల్లాలో ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎలీప్ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 35 మందికి బిజినెస్ డెవలప్‌మెంట్ సర్వీస్ ప్రొవైడర్స్‌కు మంత్రి సర్టిఫికెట్లు అందజేశారు.



రాష్ట్ర రాజధాని అమరావతిలో నిర్మించబోయే ప్రభుత్వ కాంప్లెక్స్ సూక్ష్మ నమూనాలివి. ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహించనున్న అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్‌లో దీనిని ప్రదర్శనకు ఉంచనున్నారు. అమరావతిలో నిర్మాణంలో ఉన్న అసెంబ్లీ, 50 అంతస్తుల సచివాలయం, హైకోర్టు, 42 అంతస్తుల శాఖాధిపతుల టవర్లు, పాలనా భవంతులు, మెట్రో మార్గాలు, వంతెనలు, ప్రధాన రవాణా సదుపాయాలను వివరించేలా ఈ నమూనాలను రూపొందించారు

అమరావతి 'అసైన్డ్' రైతులకు శుభవార్త

- ల్యాండ్ ఓనర్‌షిప్ సర్టిఫికెట్‌లో ఆ పదం తొలగింపు
- ఇకపై పట్టా భూమిగా పేర్కొనాలని మునిసిపల్ శాఖ ఉత్తర్వులు
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో తొలగిన కష్టాలు

తుళ్లూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి భూమిలిచ్చిన రైతులకు భారీ ఊరట లభించింది. ల్యాండ్ పూలింగ్ విధానంలో సీఆర్డీఏకు భూములిచ్చిన రైతులు, భూ యజమానుల 'అసైన్డ్' కష్టాలు తొలగిపోయాయి. అసైన్డ్ భూములను రాజధానికి ఇచ్చిన రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్ల ఓనర్‌షిప్ సర్టిఫికెట్‌లో 'అసైన్డ్' అని ఉంటుంది. దీనివల్ల తమ భూములకు సరైన ధర రావడం లేదని, తక్కువ రేట్లకు విక్రయించుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. దీనిపై ఎప్పటి నుంచో రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. సీఆర్డీఏ అధికారులకు కూడా పలుమార్లు వినతులు సమర్పించుకున్నారు. దీంతో రైతులు, భూ యజమానుల ఇబ్బందిని సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ల్యాండ్ పూలింగ్ ఓనర్‌షిప్ సర్టిఫికెట్‌లో 'అసైన్డ్' పదం తొలగించి, పట్టా భూమి అని పేర్కొనాలని సీఎం ఆదేశించారు. ఈ మేరకు ల్యాండ్ పూలింగ్ చట్టం 9.24లోని కాలమ్ నంబర్ 7, రూల్ నంబర్ 11(4) క్లాజ్‌ను సవరిస్తూ ప్రభుత్వం బుధవారం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. ల్యాండ్ పూలింగ్ ఓనర్‌షిప్ సర్టిఫికెట్‌లో 'అసైన్డ్' పదానికి బదులు 'పట్టా భూమి' అని పేర్కొనాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ జీవో ఎం.ఎస్.నంబర్ 187ను విడుదల చేశారు.

మీరు ఫుల్ నాలెడ్జ్ ఉన్నోళ్లు కదా..!

- అసెంబ్లీకి రండి.. ఏ అంశంపైనైనా చర్చిద్దాం
- జగన్, వైసీపీ నాయకులకు మంత్రి సవిత సవాల్
- మెడికల్ కాలేజీలపై నిజం చెబితే భయమెందుకు?
- తప్పుడు ప్రచారాలతో వికృతానందం
- నా ఫొటో మార్ఫింగ్‌పై ఫిర్యాదుచేశా: మంత్రి



అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'మీరంతా ఫుల్ నాలెడ్జ్ కలిగిన వాళ్లే కదా.. సోషల్ మీడియాలో మార్ఫింగ్ ఫొటోలు పోస్టు చేయడం, అబద్ధపు ప్రచారాలు చేయడమెందుకు? అసెంబ్లీకి రండి.. యూరియా, ఉల్లి, మెడికల్ కాలేజీలు.. ఏ అంశంపైనైనా చర్చిద్దాం' అని మాజీ సీఎం జగన్, వైసీపీ నాయకులకు బీసీ సంక్షేమ మంత్రి ఎస్.సవిత ఎద్దేవా చేస్తూ సవాల్ విసిరారు. తన ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి జగన్ ఓర్వలేక విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ అబద్ధాలంటూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని.. యూరియా, ఉల్లి, మెడికల్ కాలేజీలు, తిరుమలపై తప్పుడు ప్రచారాలు చేస్తూ జగన్ వికృతానందం పొందుతున్నారని విమర్శించారు. తనపై మాజీ మంత్రులు రోజా, ఉషశ్రీచరణ్ విమర్శలపై ఆమె స్పందించారు. 'టీటీడీ లెటర్లు అమ్ముకున్నదెవరో నగరి, కల్యాణదుర్గంలో ఎవరిని అడిగినా చెబుతారు. చెరువులు మాయం చేసి లే అవుట్లు వేసుకున్నదెవరో అందరికీ తెలుసు. మెడికల్ కాలేజీలపై నిజం చెబితే భయమెందుకు' అని వ్యాఖ్యానించారు.

విద్వేషాలు రెచ్చగొట్టడమే జగన్ అజెండా: మంత్రి కొల్లు



అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దిగజారుడు రాజకీయాలకు వైసీపీ చిరునామాగా మారిందని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సొంత బాబాయ్ హత్య జరిగితే దానిని నారాసుర రక్త చరిత్ర అని సీఎం చంద్రబాబు మీదకు నెట్టడానికి ప్రయత్నించారని, తర్వాత వాస్తవాలు వెలుగులోకి వస్తే బాబాయ్ కూతురు సునీత, ఆమె భర్త మీదకు నెట్టేశారన్నారు. సొంత చెల్లి గురించీ సోషల్ మీడియాలో దారుణమైన పోస్టులు పెట్టించారని విమర్శించారు. జగన్ కంటే నీచమైన వ్యక్తులు ప్రపంచంలో ఎవ్వరూ ఉండరని అన్నారు.

డబుల్ ధమాకా!

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నేతృత్వంలో విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో బుధవారం నిర్వహించిన జీసీసీ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ప్రధాని మోదీ దేశానికి గొప్ప ఆస్తి అని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులను గుర్తించడమే కాకుండా గౌరవిస్తున్నారని అన్నారు. తలసరి ఆదాయం ఎక్కువ సాధించే వారిలో ప్రపంచంలో భారతీయులే ఎక్కువగా ఉన్నారని చెప్పారు. 2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీతో భారతదేశం ఆర్థికంగా మొదటి స్థానంలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం



విశాఖలో నిర్వహించిన జీసీసీ సదస్సులో బాబు, నిర్మల

చేశారు. ఏపీకి ప్రధాన ఆర్థిక వనరుగా వేయి కి.మీ. కోస్తా తీరం ఉందన్నారు. రాష్ట్ర విభజన తరువాత వచ్చిన ఇబ్బందులను అధిగమించినా, గత వైసీపీ ప్రభుత్వం వల్ల రాష్ట్రం చాలా అవకాశాలను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతగల ప్రభుత్వం ప్రస్తుతం అధికారంలో ఉందన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు ఎవరైనా ముందుకువస్తే కేవలం రెండు నుంచి మూడు రోజుల్లోనే గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నామని తెలిపారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

విశాఖకు మెట్రోరైలు ప్రాజెక్టు

"వచ్చే నెలలోనే విశాఖపట్నానికి గూగుల్ డేటా సెంటర్ వస్తుంది. అదేవిధంగా భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టులో వచ్చే ఆగస్టు నుంచి కార్యకలాపాలు మొదలవుతాయి. విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టు కూడా వస్తుంది. ఏపీలో విశాఖ బెస్ట్ నగరం. రాష్ట్రంలో ప్రతి 50 కి.మీ.కు ఒక పోర్టు నిర్మిస్తున్నాం. గంట ప్రయాణిస్తే సమీపంలోని నగరానికి చేరుకునేలా ఎక్కడికక్కడే విమానాశ్రయాలు నిర్మించాం.. ఇంకా కొన్ని నిర్మాణంలో ఉన్నాయి. హైదరాబాద్ కంటే మిన్నగా అమరావతిలో మరో విమానాశ్రయం నిర్మిస్తున్నాం. రహదారులు, రైళ్ల కనెక్టివిటీ కూడా పెంచుతున్నాం. అమరావతికి బుల్లెట్ రైలు తీసుకువచ్చే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. రాష్ట్రంలో లాజిస్టిక్స్ సౌకర్యాల పెంపుపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాం. అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నాం. అమరావతి చక్కటి గ్రీన్‌ఫీల్డ్ సిటీగా మారుతుంది. అంతా అక్కడకి వచ్చి సెటిల్ కావాలి. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నాం. ఆధార్ డేటాతో పథకాల పంపిణీకి మైక్రో ప్లానింగ్ చేస్తున్నాం. బిల్‌గేట్స్ ఫౌండేషన్ సాయంతో 'సంజీవిని' పథకం అమలు చేయబోతున్నాం. ప్రతి పౌరుడి ఆరోగ్య రికార్డ్ ప్రభుత్వం వద్ద ఉంటుంది. రియల్ టైమ్ డేటాతో పరిపాలన సాగుతోంది. వాట్సాప్ ద్వారా 725 సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చాం. 'ఒక కుటుంబం.. ఒక ఉద్యోగం నినాదం' నుంచి 'ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త'కు మారాం. ఉద్యోగాలు కల్పించే స్థాయికి యువత ఎదగాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా కొత్త ఆలోచనలకు రూపం ఇస్తాం" అని సీఎం చెప్పారు. మహిళలకు భద్రత కల్పించే నగరాల్లో విశాఖపట్నం మొదటి స్థానాన్ని పొందిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు.

పెట్టుబడులపై ఫ్రాన్స్ బృందంతో సీఎం చర్చలు

ఫ్రాన్స్‌కు చెందిన ప్రతినిధులతో చంద్రబాబు విశాఖపట్నంలో భేటీ అయ్యారు. ఫ్రాన్స్ కౌన్సిల్ జనరల్ మార్క్‌లేమి బృందంతో పెట్టుబడులపై సీఎం చర్చించారు. ఏపీలో కీలక రంగాలైన ఏరోస్పేస్, రక్షణ, పునరుత్పాదక ఇంధన, పోర్టులు, మారీటైమ్ లాజిస్టిక్స్, ఉన్నత విద్య, కోల్డ్ చెయిన్, లైఫ్-సైన్సెస్, మెడికల్ టెక్నాలజీ రంగాలతో పాటు స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

సొంత భూమిలోనూ ఐటీ పార్కులకు అనుమతి

- రాష్ట్ర ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్

రాష్ట్రంలో ఎవరైనా వారి సొంత భూమిలో ఐటీ పార్కు ఏర్పాటు చేయడానికి ముందుకువస్తే ప్రభుత్వం అనుమతులు ఇస్తుందని ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ తెలిపారు. జీసీసీ బిజినెస్ సమ్మిట్‌లోని చర్చా కార్యక్రమంలో ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం భాస్కర్ మాట్లాడుతూ, సొంత భూముల్లో ఐటీ పార్కుల ఏర్పాటును స్వాగతిస్తామన్నారు. కొంత ప్రైవేటు భూమి ఉండి, పక్కన ప్రభుత్వ భూమి కూడా అవసరమైతే దానిని కూడా సమకూరుస్తామన్నారు. జీసీసీలకు అవసరమైన పూర్తి సహకారం ఇస్తామన్నారు. జీసీసీ నిర్వాహకులు మాట్లాడుతూ, ఎయిర్ కార్గో ద్వారా రాష్ట్రంలోకి ఎలక్ట్రానిక్స్‌ను దిగుమతి చేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు.

జీసీసీలు అంటే గుర్తొచ్చేది భారతీయులే

- ఇదే భావన ప్రపంచ వ్యాప్తంగా ఉంది.. ప్రధాని గుర్తించారు
- వీటి అభివృద్ధికి ఏపీ అనుకూలం
- విశాఖలో సదస్సు నిర్వహించాలని చంద్రబాబు కోరారు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

విశాఖపట్నం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జీసీసీలు అంటే బ్యాక్ ఆఫీసులు కాదని, ఫ్యూచర్ రెడీ సెక్టార్ అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. విశాఖలో జీసీసీ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో ఆమె ప్రసంగిస్తూ, ప్రపంచంలోని జీసీసీల్లో 50 శాతం మనదేశంలోనే ఉన్నాయన్నారు. ఇతర దేశాల్లోని జీసీసీల్లో సైతం భారతీయులే కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. జీసీసీ అనగానే భారతీయులు అనే భావన ఉందన్నారు. వీటి ప్రాధాన్యాన్ని ముందే గుర్తించిన ప్రధాని మోదీ ప్రత్యేక పాలసీకి ఆదేశించారని గుర్తు చేసుకున్నారు. సీఐఐతో కలిసి జీసీసీలపై తొలుత ఢిల్లీలో జాతీయ సదస్సు నిర్వహించామని చెప్పారు. తరువాత ఎక్కడ? అని ఆలోచిస్తే.. విశాఖపట్నంలో నిర్వహించాలని సీఎం చంద్రబాబు కోరారన్నారు. అరకు కాఫీని పారిస్‌కు తీసుకువెళ్లిన ఘనత చంద్రబాబుది అంటూ ప్రశంసించారు. జీసీసీల అభివృద్ధి చెందడానికి అవసరమైన మౌలిక వసతులతో పాటు కీలక అంశాలు ఇక్కడికి రప్పించాయన్నారు. ఏపీని క్వాంటమ్ వ్యాలీగా మారుస్తున్నారని, శ్రీహరి కోటలో అంతరిక్ష పరిశోధన కేంద్రం అభివృద్ధి చేస్తున్నారని, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ కూడా ఏర్పాటు కానుందని, అవన్నీ జీసీసీల అభివృద్ధికి దోహదపడతాయన్నారు. జీసీసీలు అభివృద్ధి చెందాలంటే మూడు కీలకమైన అంశాలపై దృష్టిపెట్టాలని సూచించారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో పెట్టుబడులు పెంచాలని, విద్య, నైపుణ్య రంగాల్లో మానవ వనరులను తీర్చిదిద్దాల్సి ఉందని, పరిపాలనా పరమైన వసతులు సమకూర్చాలని సూచించారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ సహకరించినప్పుడే జీసీసీలు అనుకున్న లక్ష్యాలు చేరుకుంటాయని చెప్పారు. కార్పొరేట్ల కోసం సి-పేస్, కంపెనీ ఇన్‌కార్పొరేషన్ కోసం స్పైస్ ప్లస్ వంటి విధానాలు అమలులోకి తెచ్చామన్నారు.

ఏపీలో వేగవంతమైన పాలన

సీఎం చంద్రబాబు చాలా వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ చక్కటి పాలన అందిస్తున్నారని నిర్మలా సీతారామన్ ప్రశంసించారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో గూగుల్‌తో డేటా సెంటర్ ఏర్పాటుకు చర్చలు జరిపినట్టు తనకు బాగా గుర్తుందని, కేవలం నాలుగు నెలల్లోనే ఒక అతి పెద్ద సంస్థను ఇక్కడకు రప్పిస్తున్నారని అన్నారు. ఎంతో వేగంగా పనిచేస్తే తప్ప ఇది సాధ్యం కాదన్నారు. అదేవిధంగా క్వాంటమ్ వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారన్నారు.

ఫీజు కడితేనే సర్టిఫికెట్!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకో నినాదంతో ఒత్తిడి పెంచుతున్నాయి. నాగార్జున, ఆర్జీయూకేటీ, ఎస్వీ యూనివర్సిటీలు సహా పలు ఉన్నత విద్యాసంస్థలు ఇదే అనుసరిస్తున్నాయి. దీంతో చదువు పూర్తయి ఉద్యోగాల వేటలో ఉన్నవారికి, ఇప్పటికే ఉద్యోగం వచ్చి సర్టిఫికెట్లు సమర్పించాల్సిన వారికి, మరింత ఉన్నత స్థాయి విద్యను అభ్యసించాలని అనుకున్నవారికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోనీ ఆర్జీయూకేటీ, నాగార్జున, శ్రీవెంకటేశ్వర వర్సిటీల పరిధిలోని కాలేజీలు ప్రైవేటు విద్యాసంస్థలా అంటే కాదు. ప్రభుత్వ పరిధిలో ఉన్న కాలేజీలే. అయినప్పటికీ విద్యార్థులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఓ వైపు ప్రభుత్వం ఆరు క్వార్టర్ల ఫీజులు బకాయిపెట్టింది. మరోవైపు ప్రభుత్వ పరిధిలోనే ఉన్న యూనివర్సిటీ కాలేజీలు ఫీజులు కట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు అల్లాడిపోతున్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో బీటెక్ పూర్తిచేసిన ఓ విద్యార్థి తనకు ప్రముఖ కంపెనీలో ఉద్యోగం వచ్చిందని, సర్టిఫికెట్లు ఇవ్వాలని వేడుకున్నాడు. కానీ, నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ అధికారులు నిరాకరించారు. మొత్తం పెండింగ్ ఫీజు కట్టి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉద్యోగాలు సాధించిన కొందరు విద్యార్థులకు కూడా ఇదే అనుభవం ఎదురైంది. దీంతో వారు చేసేది లేక.. అప్పు చేసి ఫీజులు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకున్నారు. ఇక, ఫీజులు చెల్లించే స్తోమత లేనివారు.. "మా గోడు వినిపించుకోండి." అంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం సకాలంలో ఫీజులు విడుదల చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా చెబుతున్నారు.

నాడు నేడు కలిపి 6

ఫీజురీయింబర్స్‌మెంటు సొమ్ములో గత వైసీపీ ప్రభుత్వం మూడు క్వార్టర్ల ఫీజు పెండింగ్ పెట్టింది. ప్రస్తుత ప్రభుత్వం మరో 3 క్వార్టర్లు బకాయి పెట్టింది. మొత్తం 6 క్వార్టర్ల ఫీజులను విడుదల చేయాల్సి ఉంది. ఇది రూ.4,200 కోట్లుగా ఉంది. ఏళ్లు గడిచినా విడుదల చేయడం లేదు. దీంతో తమ భవిష్యత్తు కోసం విద్యార్థులే తమ ఫీజులు చెల్లించే పరిస్థితి ఏర్పడింది. గతంలో రీయింబర్స్‌మెంట్ సొమ్మును నేరుగా కాలేజీల ఖాతాలకు జమ చేసేవారు. జగన్ వచ్చాక జనం మెప్పుకోసం.. ఆ సొమ్మును విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేయడం ప్రారంభించారు. అయినప్పటికీ ఆయన దిగిపోయే సమయానికి 3 క్వార్టర్ల సొమ్ము బకాయి పెట్టారు. అప్పటికే తల్లుల ఖాతాల్లో జమ చేసిన సొమ్మును కొందరు కాలేజీలకు చెల్లించలేదు. వైసీపీ పెండింగ్ పెట్టిన 3 క్వార్టర్ల సొమ్మును ఇప్పుడు కూడా తల్లుల ఖాతాల్లోనే జమ చేయాలి. దీంతో ఆ సొమ్మును తమకు చెల్లిస్తారో లేదో అన్న బెంగతో కాలేజీలు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నాయి. దీనికితోడు నేరుగా ప్రభుత్వం తమ ఖాతాల్లో వేసే సొమ్ము విషయంలోనూ మెలిక పెట్టి.. పెండింగ్‌లో ఉన్న బకాయిలు కూడా మీరే కట్టాలని వర్సిటీల అధికారులు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారు. ఒకట్రెండు క్వార్టర్ల ఫీజులైతే ఎలాగోలా కట్టగలమని, ఆరు క్వార్టర్ల ఫీజులు ఎక్కడి నుంచి తేవాలని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల మౌనం

విద్యార్థుల ఇబ్బందులపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఆర్జీయూకేటీ ఇన్‌చార్జ్ చాన్సలర్ కె. మధుమూర్తి, నూజివీడు ఇన్‌చార్జ్ డైరెక్టర్ అమరేంద్రకుమార్‌ల దృష్టికి విద్యార్థుల సమస్యలు వెళ్లినా ఎలాంటి పరిష్కారం లభించలేదు. మరోవైపు ఉన్నత విద్యాశాఖ అధికారులు, మంత్రి నారా లోకేశ్ పేషీ అధికారులు ఈ సమస్య తమ పరిధిలో లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటికే అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యలో అడ్మిషన్లు కోల్పోయారు.

ఆ అధికారులతోనే అడ్డంకి!

ఆర్జీయూకేటీ క్యాంపస్‌లలో ఇప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో నియమించిన అధికారులే కీలక హోదాల్లో ఉన్నారు. ఇప్పుడు వారే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ఉన్నతాధికారులు సర్టిఫికెట్లు ఇవ్వాలని చెబుతున్నా వినిపించుకోవడం లేదు. కొందరు యూనివర్సిటీల అధికారులు కూడా ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా సర్టిఫికెట్లు నిలిపివేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు విద్యార్థులకు ఎక్కడా సర్టిఫికెట్లు ఆపడానికి వీల్లేదని మంత్రి లోకేశ్ ఇచ్చిన ఆదేశాలను కూడా వర్సిటీల అధికారులు బేఖాతరు చేస్తున్నారు.



'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మల, రాష్ట్ర మంత్రులు పయ్యావుల, డోలా, సత్యకుమార్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభగౌర్, కమిషనర్ వీరపాండియన్, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధర్ ప్రసాద్

ఇల్లాలి ఆరోగ్యం ఇంటికి సౌభాగ్యం

- 'స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్'లో సీఎం చంద్రబాబు

> "రాష్ట్రంలో డ్వాక్రా, మెప్మా సంఘాలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. కార్పొరేట్ రంగంలో కూడా లేనట్టుగా తీసుకున్న అప్పులు ఠంచనుగా చెల్లిస్తున్నది డ్వాక్రా సంఘాలే. ఈ ఏడాది లక్ష మంది మహిళలను లక్షాధికారులను చేసే కార్యక్రమం చేపడతాం."
> - చంద్రబాబు

విశాఖపట్నం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన మహిళలే కుటుంబానికి పునాది అని, మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఇంటిల్లిపాదీ బాగుంటారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మహిళలే ప్రతి ఇంటికి బెస్ట్ ఫైనాన్స్ మినిస్టర్‌లని వ్యాఖ్యానించారు. వెల్తీ, హెల్దీ, హ్యాపీ సొసైటీగా రాష్ట్రాన్ని మార్చాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. విశాఖలోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో 'స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని ఆన్‌లైన్‌లో వారు వీక్షించారు. అనంతరం మహిళలనుద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడారు. "పేదలు, ఆడపిల్లల ఆరోగ్యం కాపాడేందుకు మోదీ 'స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభించారు. ఇందులో భాగంగా బుధవారం నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు నిర్వహించే శిబిరాలకు ప్రతి మహిళా భయ సంకోచాలు లేకుండా హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. క్యాన్సర్ సహా పలురకాల ఆరోగ్య పరీక్షలను నిపుణుల ఆధ్వర్యంలో అక్కడ చేపడతారు" అని తెలిపారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని సీఎం పేర్కొన్నారు. "ఒక వ్యక్తి నెలకు 750 మిల్లీలీటర్ల నూనె, 300 గ్రాముల చక్కెర, 150 గ్రాములలోపు ఉప్పు వినియోగిస్తే ఆరోగ్యంగా ఉంటారు. ఈ మూడింటిని సరైన మోతాదులో వాడితే ఆరోగ్యం మన సొంతం. ప్రతిరోజు అరగంట పాటు యోగా లేదా నడవడం చేయాలి. ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్రంలో రూ.20 వేల కోట్లు (ఆరోగ్యశాఖ బడ్జెట్) కేటాయించాం. యూనివర్సల్ హెల్త్ కార్డుద్వారా రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ రూ.2.5 లక్షల వరకు బీమా సదుపాయం కల్పిస్తున్నాం. ఎన్టీఆర్ హెల్త్ స్కీమ్ కింద పేదలకు రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం లభిస్తోంది. సంజీవని ద్వారా టెక్నాలజీ వినియోగించి వైద్య సేవలు అందించేలా చేసిన పైలట్ ప్రాజెక్టు విజయవంతమైంది. రాష్ట్రంలో ఐదు కోట్ల మందికి ఆరోగ్య కార్డులు తయారుచేస్తున్నాం. విశాఖ మెడ్‌టెక్ పార్కులో వైద్య పరికరాలు తయారుచేసి ప్రపంచానికి ఎగుమతి చేస్తున్నాం' అని తెలిపారు. ఆరోగ్య బీమాకు జీఎస్టీ మినహాయింపు ఇచ్చారని పేర్కొంటూ వేదికపై ఉన్న నిర్మలా సీతారామన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం 75వ జన్మదినం జరుపుకుంటున్న మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'సరైన సమయంలో ప్రధానిగా వచ్చిన సరైన నాయకుడు మోదీ అని ప్రశంసించారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

దేశీయ వస్తువులే కొందాం..

"నేను పీజీలో ఆర్థికశాస్త్రం చదివాను. నిర్మలా సీతారామన్ కూడా ఆర్థికశాస్త్రంలో పట్టా తీసుకున్నారు. ప్రతి ఇంటికి బెస్ట్ ఫైనాన్స్ మినిస్టర్ మహిళలే. జీఎస్టీ సంస్కరణలు 22వ తేదీ నుంచి అమలులోకి వస్తాయి. దీంతో ధరలు తగ్గి ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. మన ఉత్పత్తులు ప్రపంచ ప్రమాణాలతో అంతర్జాతీయ బ్రాండ్‌లుగా ఎదగాలి. దేశీయ వస్తువులనే అందరం కొనుగోలు చేయాలి. రాష్ట్రంలో అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేశాం. మహిళలకు ఆస్తి హక్కు కల్పించింది ఎన్టీఆర్. ఇప్పుడు ప్రధాని మోదీ చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్లతో ఎంపీలు, ఎమ్మెల్యేలుగా మహిళలకు పెద్దపీట వేయనున్నారు. దేశంలో మహిళలకు సురక్షిత నగరం విశాఖ. అభివృద్ధి చెందుతున్న విశాఖకు గూగుల్, ఇతర ఐటీ కంపెనీలు వస్తున్నాయి. భవిష్యత్తులో గొప్ప నగరంగా తయారు చేస్తాం. విశాఖ వాసులు ఎంతో మంచివారు. హుద్‌హుద్ విపత్తు సమయంలో వారుచూపిన చొరవ, మంచితనం నేను మర్చిపోలేను. నేను ఎక్కడకు వెళ్లినా విశాఖ గురించి చెబుతాను" అని తెలిపారు. కాగా, కన్వెన్షన్ హాలు ప్రాంగణంలో సాగరిక హాలులో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి అక్కడ అందించే సేవలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.

140 కోట్ల మందికి జీఎస్టీ లబ్ధి

(మొదటి పేజీ తరువాయి)

నిర్మలా సీతారామన్ పాల్గొని ప్రసంగించారు. దేశంలో నాలుగు స్లాబ్‌లలో ఉన్న జీఎస్టీని రెండు స్లాబ్‌లకు పరిమితం చేయడం ద్వారా ప్రజలపై భారాన్ని తగ్గించామన్నారు. ఈ సంస్కరణలు వికసిత్ భారత్‌కు పునాదులు వేసేందుకు దోహదం చేస్తాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి కొత్త జీఎస్టీ అమలులోకి వస్తుందని, దానికంటే ముందే చాలామంది అమలు చేసేందుకు సిద్ధపడుతున్నారన్నారు. ప్రస్తుతం 12 శాతం జీఎస్టీ ఉండే వస్తువుల్లో 99 శాతం ఐదు శాతం జీఎస్టీలోకి, 28 శాతంలో ఉన్న వస్తువుల్లో 90 శాతం వరకూ 18 శాతం స్లాబ్‌లోకి వెళతాయని వివరించారు. దీనివల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఖర్చు తగ్గి, కొనుగోలు శక్తి పెరుగుతుందని, చేతుల్లో డబ్బులు కూడా ఉంటాయన్నారు. నిర్మలా సీతారామన్ ఇంకా ఏమన్నారంటే..

జీఎస్టీ ఫలాలు అనుభవిస్తున్నాం..

"జీఎస్టీ పేరుతో ప్రజలను దోచుకుని ఇప్పుడు తగ్గించారని చాలామంది విమర్శిస్తున్నారు. కానీ గతంలో 17 రకాల ట్యాక్స్‌లు, 8 రకాల సెస్‌ల పేరుతో దేశంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా పన్నులు వసూలు చేశారు. వాటన్నింటినీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి నాలుగు స్లాబ్‌లను దేశమంతా అమలు చేసేలా జీఎస్టీ విధానం తీసుకువచ్చాం. దాని అమలుకు ముందు దేశంలో 65 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉండేవారు. జీఎస్టీ వచ్చాక 1.5 కోట్ల మందికి పెరిగారు. స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటివరకు ఏర్పాటైన రాజ్యాంగ వ్యవస్థ ఏదైనా ఉందంటే అది జీఎస్టీ కౌన్సిల్ మాత్రమే. జీఎస్టీ ద్వారా వచ్చిన ఆదాయంతో దేశంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రజలకు సంక్షేమ పథకాలను అందించాం. ఎయిర్‌పోర్టులు పెరిగాయి. 60 శాతం జాతీయ రహదారులు నిర్మాణమయ్యాయి. డిఫెన్స్ రంగంలో 34 శాతం ఎగుమతులు పెరిగాయి."

బోగస్ ఏరివేతతో రూ.3లక్షల కోట్లు ఆదా

"తాజా జీఎస్టీ సంస్కరణలతో ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసర వస్తువులు, అవసరమైన సామగ్రి, రైతులకు అవసరమైన వస్తువులు, ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు ఉపయుక్తమయ్యే వస్తువులు, దేశానికి ఉపయోగపడే సెక్టార్లకు వినియోగమయ్యే పరికరాలు, వస్తువులపై జీఎస్టీని తగ్గించడం ద్వారా ఆయా వర్గాలకు మేలు చేసే ప్రయత్నం చేశాం. బోగస్ లబ్ధిదారులను ఆధార్ ద్వారా ఏరివేయడం ద్వారా మూడు లక్షల కోట్ల రూపాయలను అనర్హులకు అందకుండా మిగిల్చాం. పన్ను చెల్లింపుదారుల డబ్బు సరిగా వినియోగించాలనుకునే ప్రభుత్వం మాది. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా జీఎస్టీ తీసుకువస్తామని చెప్పి తేలేదు. ప్రతిపక్షాలకు అప్పట్లో సర్దిచెప్పలేకపోయారు" అని నిర్మలా సీతారామన్ అన్నారు. అనంతరం నూతన స్లాబ్‌ల ప్రకారం ఏయే వస్తువులు జీరో, ఐదు శాతం, 18 శాతం స్లాబుల్లోకి వచ్చాయో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సదస్సుకు హాజరైన మంత్రి వివిధ వర్గాలకు చెందిన ప్రతినిధులు అడిగిన ప్రశ్నలు సమాధానాలు ఇవ్వడంతోపాటు ప్రతినిధుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. జీఎస్టీ సంస్కరణలు అకస్మాత్తుగా తీసుకొచ్చినవి కావని, రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో పెద్ద ఎత్తున కసరత్తు జరిగిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. మోదీ నిర్మాణాత్మక చర్యల వల్ల ప్రపంచంలో భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని ఆరోగ్య మంత్రి సత్యకుమార్ అన్నారు.

మహిళల గురించే మోదీ ఆలోచనలు..

మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని నిర్మలా సీతారామన్ అన్నారు. విశాఖ ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో 'స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. "ప్రధాని మోదీకి మహిళలంటే ప్రత్యేక అభిమానం. సీఎంగా ఉండగా గుజరాత్‌లో బాలికా విద్యను ఆయన ప్రోత్సహించారు. ఆయనకు వచ్చిన అనేక బహుమతులకు బహిరంగ వేలం వేసి వచ్చిన సొమ్మును బాలికల చదువుకు కేటాయించేవారు. ప్రధానిగా బాధ్యతలు తీసుకున్న తరువాత ప్రతి మహిళ పేరిట బ్యాంకుల్లో జనధన్ ఖాతాలు తెరిపించిన ఘనత ఆయనదే. కేంద్రం మహిళలకు ఇచ్చిన పథకాల సొమ్ములు అదే ఖాతాలో పడ్డాయి. ఉజ్వల పథకం ద్వారా ఎనిమిది కోట్ల మందికి నేరుగా గ్యాస్ సబ్సిడీ జమ అవుతోంది. స్టార్టప్‌ల ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలను ప్రోత్సహించారు.గ్రామీణ ప్రాంతంలో బ్యాంకు కరస్పాండెంట్లుగా రెండు లక్షల మంది మహిళలకు ఉపాధి దొరికింది." అని తెలిపారు. రాష్ట్రంలోని 10,572 ఆరోగ్య కేంద్రాల్లో 'స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని సత్యకుమార్ వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, విశాఖ ఎమ్మెల్యేలు, ఎన్టీఆర్ వైద్య సేవా వైస్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభగౌర్, కమిషనర్ వీరపాండియన్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జీఎస్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, బీఎస్ఐ, స్టీల్, క్రెడాయ్, పన్ను చెల్లింపుదారులు, వాణిజ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'స్వస్త్ నారీ అభియాన్'ను ప్రారంభించిన గవర్నర్

విజయవాడ (వన్‌టౌన్), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : 'స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్'ను గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ప్రారంభించారు. మహిళల ఆరోగ్యం, సంక్షేమం కోసం మొదలుపెట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి మధ్యప్రదేశ్‌లోని ధార్ నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ వేదిక వద్ద ఏర్పాటుచేసిన మోడల్ హెల్త్‌కేర్ కియోస్క్‌లను సందర్శించి వైద్య నిపుణులు, రోగులతో సంభాషించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ జి.రఘునందన్, గవర్నర్ జాయింట్ సెక్రెటరీ పీఎస్ సూర్యప్రకాశ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచే అసెంబ్లీ



గురువారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మండలి చైర్మన్ మోషేన్‌రాజు

అమరావతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి మొదలవుతున్నాయి. ఉదయం 9 గంటలకు శాసనసభ, 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రశ్నోత్తరాలతో ప్రారంభమవుతాయి. అనంతరం స్పీకర్ అధ్యక్షతన సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) సమావేశం జరుగుతుంది. ఈ సందర్భంగా సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలో తుది నిర్ణయం తీసుకుంటారు. ఏడు నుంచి పది రోజులు జరిపే అవకాశం ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు 15 రోజులు జరిగిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ సమావేశాలపై సభాపతి అయ్యన్నపాత్రుడు, మండలి చైర్మన్ మోషేన్ రాజు బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమావేశాల సందర్భంగా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. సభ్యులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలని స్పీకర్ అధికారులను ఆదేశించారు. ప్రశ్నోత్తరాల్లో సభ్యులకు సమాధానాలు సకాలంలో చేరాలని స్పష్టం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలందరూ రావాలని మళ్లీ మళ్లీ విజ్ఞప్తి చేస్తున్నానని, తమ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి దీనిని సదవకాశంగా తీసుకోవాలని సూచించారు. 'అయ్యన్నపాత్రుడిగా నాకు గౌరవం ఇవ్వాలని కోరడం లేదు. సభాపతి స్థానానికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత వైసీపీ ఎమ్మెల్యేలపై ఉంది. సభకు వస్తే ప్రజాసమస్యలు చర్చించేందుకు అందరికీ అవకాశం కల్పిస్తాం. వారు అసెంబ్లీకి రాకుండా బయట తిరగడం మంచిది కాదు.' అని అన్నారు.

వెంకటపాలెంలో నేడు ఎన్టీఆర్ విగ్రహానికి సీఎం నివాళి

శాసనసభ సమావేశాలకు వెళ్లే ముందు సీఎం చంద్రబాబు వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పిస్తారు. మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా హాజరవుతారు. ఈ కార్యక్రమం తర్వాత అసెంబ్లీకి పయనమవుతారు.

అహం అడ్డొచ్చే అసెంబ్లీకి డుమ్మా!

(మొదటి పేజీ తరువాయి)



ప్రాధాన్యమిస్తాయి. జగన్ దానిని పక్కనపెట్టి.. ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాల్సిందేనని.. సీఎం ఎంతసేపు మాట్లాడితే తనకూ అంతే సమయం ఇవ్వాలని షరతులు పెట్టడానికి ప్రధాన కారణమే ఉందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. కేవలం ఒక వ్యక్తి వల్ల అంత కఠిన నిర్ణయం తీసుకున్నారని పేర్కొంటున్నాయి. ఆ వ్యక్తి సీఎం చంద్రబాబు గానీ.. మంత్రి లోకేశ్ గానీ.. స్పీకర్ అయ్యన్నపాత్రుడు గానీ కాదని.. సాక్షాత్తూ శాసన మండలిలో ప్రతిపక్ష నేతగా ఉన్న తమ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కారణమని అంటున్నాయి. 58 మంది సభ్యుల మండలిలో వైసీపీ ఎమ్మెల్సీల సంఖ్యాబలం 34. అధికార కూటమి (13) కంటే ఎక్కువగా ఉండడంతో వైసీపీ పక్ష నేతగా ఆయనకు ప్రతిపక్ష నాయకుడి హోదా లభించింది. అధికారికంగా క్యాబినెట్ ర్యాంకు కూడా దక్కింది. అవసరమైనప్పుడు సభలో కాస్త ఎక్కువ సమయమే మాట్లాడే అవకాశం ఉంటోంది. జగన్ శాసనసభ్యుడు మాత్రమే. పొరుగు సభలో బొత్స ప్రతిపక్ష నేత హోదాలో ఉంటే.. తాను కేవలం ఎమ్మెల్యేగా ఉండడంతో అహం అడ్డొచ్చి జగన్ అసెంబ్లీకి రానంటున్నారని వైసీపీ నేతలు బాహాటంగానే గుసగుసలాడుతున్నారు. వాస్తవానికి మండలిలో ప్రతిపక్ష నేతగా బొత్స ఉన్నప్పటికీ.. మిగతా వైసీపీ ఎమ్మెల్సీలు కూడా ప్రజా సమస్యలపై చర్చల్లో పాల్గొంటున్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాదనలు గట్టిగానే జరుగుతున్నాయి. విపక్షానికి ఎక్కువ సమయం దొరుకుతున్నా.. ప్రభుత్వం కూడా అభ్యంతరపెట్టకుండా చర్చలు సాగిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో సింగిల్ డిజిట్‌లో ఉన్నప్పటికీ వామపక్ష సభ్యులు ప్రజా సమస్యలను సమర్థంగా లేవనెత్తేవారు. ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసి సమాధానాలు రప్పించేవారు. జగన్ మాత్రం ఇలాంటి వాస్తవాలను పట్టించుకోకుండా.. తనకు ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానంటూ పట్టుబడుతున్నారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో.. ఒక ట్రెండు రోజులు తన తాడేపల్లి ప్యాలెస్‌లో సొంత, సానుకూల మీడియా ప్రతినిధులను పిలిపించుకుని.. గంటల కొద్దీ ధర్మప్రసంగాలు చేస్తారు. తన సహాయకులు సబ్జెక్టుకు సంబంధించిన ఇన్‌పుట్స్ ఇస్తుంటే.. జగన్ దర్జాగా కూర్చుని ఎంతసేపైనా మాట్లాడతారు. చెప్పాల్సింది చెప్పేశాక.. నిమిషమైనా అక్కడ ఉండకుండా వెళ్లిపోతారు. ఏ అంశంపైనా ఆయన్ను ప్రశ్నలడిగే అవకాశం ఉండదు. ప్రసంగం మధ్యలో ఎవరైనా అడిగినా ఆయన జవాబు చెప్పరు.

అభ్యంతరమెందుకు?

ప్రతిపక్ష నాయకుడు కాకపోయినా జగన్‌కు పోలీసులు జడ్ ప్లస్‌కు మించిన భద్రత కల్పిస్తున్నారు. ఇలాంటప్పుడు అసెంబ్లీకి రావడానికి.. సభలో కూర్చోడానికి అభ్యంతరం ఏమిటని రాజకీయ వర్గాలు ఆక్షేపిస్తున్న సంగతి తెలిసిందే. అసెంబ్లీ సంప్రదాయం ప్రకారం మొత్తం సభ్యుల్లో పది శాతం మంది ఎమ్మెల్యేలు ఉంటేనే ఆ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా, ఆ పార్టీ నేతకు విపక్ష నేత పదవి దక్కుతాయి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1994 ఎన్నికల్లో మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు గాను కాంగ్రెస్‌కు 26 సీట్లు మాత్రమే దక్కాయి. కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) నేతగా ఎంపికైన పి.జనార్దన్‌రెడ్డి (పీజేఆర్)కి ప్రతిపక్ష నేత హోదా రాలేదు. అయినా ఆయన ప్రజా సమస్యలను లేవనెత్తి చర్చించేవారు. ప్రతిపక్ష నేత హోదా ఇచ్చినా.. సభలో మాట్లాడేందుకు గంటల గంటలు టైమివ్వరు. గౌరవమర్యాదలు మాత్రమే ఉంటాయి. సభలో మాట్లాడేందుకు ఏ సభ్యుడికి ఎంత సమయం ఇవ్వాలన్నది ఆ పార్టీకి ఉన్న సభ్యుల సంఖ్య ఆధారంగా నిర్ణయిస్తారు. వైసీపీకి ఉన్నది 11 మంది ఎమ్మెల్యేలే కాబట్టి ఆ మేరకే సమయం కేటాయిస్తారు. ఇది తెలిసినా జగన్ పేచీ పెడుతున్నారని వైసీపీ ఎమ్మెల్యేల్లో కొందరు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.



అలిపిరి వద్ద శనైశ్చర విగ్రహం

- 2003 నుంచీ అక్కడే పడివున్న అసంపూర్ణ శనైశ్చర ప్రతిమ
- చేతిలో బాలుడు, కపాల పాత్ర, కాళ్ల వద్ద సింహం బొమ్మలు
- ఎడమవైపు రెండోచేతిలో విల్లు, కుడివైపు రెండోచేతిలో బాణం
- విగ్రహానికి శంఖుచక్రాలు ఉన్నప్పటికీ నుదుటిపై నామాల్లేవు
- రెండేళ్ల కిందటే గుర్తించిన టీటీడీ శిల్ప కళాశాల యంత్రాంగం

అది విష్ణుమూర్తి విగ్రహం కాదు!

తిరుపతి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సాక్షాత్తూ శ్రీమహావిష్ణువుకే అపచారం జరిగిందంటూ వైసీపీ నాయకుడు భూమన కరుణాకరరెడ్డి చూపించిన విగ్రహం అసలు విష్ణుమూర్తిదే కాదని తేలిపోయింది. తిరుపతిలోని అలిపిరి సమీపంలో పడివున్న విగ్రహాన్ని చూపుతూ ఇది నేరం, ఘోరం, ద్రోహం అని మంగళవారం ఆయన వాపోయారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, హిందూ సంఘాలన్నీ ఉద్యమించాలని పిలుపునిచ్చారు కూడా. ఇంతకీ అది విష్ణుమూర్తి విగ్రహమా? కాదా? అనేదానిపై 'ఆంధ్రజ్యోతి' వివరాలు సేకరించింది.



విగ్రహం ఎడమ వైపు నాలుగో చేతిలో బాలుడి ప్రతిమ

రెండేళ్ల కిందటే గుర్తించాం: శిల్ప కళాశాల ప్రిన్సిపాల్

ప్రస్తుతం వివాదానికి కారణమైన విగ్రహం తమ కళాశాల పక్కనే ఉందని, దాన్ని రెండేళ్ల కిందటే గుర్తించామని టీటీడీ శిల్ప కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి చెప్పారు. అప్పట్లో తాము కూడా అది విష్ణుమూర్తి విగ్రహమై ఉంటుందనుకున్నామని, దోషాలు లేకుండా ఉంటే తెచ్చుకుని కళాశాలలో ఉపయోగించుకోవాలని భావించామని చెప్పారు. తీరా దగ్గరకు వెళ్లి పరిశీలించాక విష్ణుమూర్తి విగ్రహం కాదని తేలడంతో అక్కడే వదిలేశామన్నారు.

విగ్రహం అక్కడ ఎందుకుంది?

1970వ దశకంలో తిరుమలలో ఆలయాల పునరుద్ధరణ, నడక దారి మెట్ల పునరుద్ధరణ వంటి పనులను టీటీడీ చేపట్టింది. ఇందుకోసం తమిళనాడు నుంచి పలువురు శిల్పులను పిలిపించారు. అలిపిరిలో టీటీడీ శిల్ప కళాశాల వద్ద వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. వారికోసం ప్రస్తుతం విగ్రహం పడివున్న చోట తాత్కాలిక షెడ్లు వేశారు. ఈ విధంగా వచ్చిన శిల్పుల్లో పట్టు కన్నన్ ఆచారి ఒకరు. ఆయన టీటీడీకి సంబంధించిన పనులు చేస్తూనే రాయలచెరువు వద్ద స్థలం కొనుగోలు చేసి అక్కడ ప్రైవేటుగా శిల్పాలు తయారు చేసేవారు. కర్ణాటకకు చెందినవారు శనైశ్చరుడి విగ్రహం కావాలంటూ రూ.2లక్షలు అడ్వాన్సు చెల్లించారు. నమూనా ఫొటో కూడా ఇచ్చి దాని ఆధారంగా విగ్రహాన్ని రూపొందించాలని కోరారు. దీంతో తమిళనాడులోని కాంచీపురం వద్ద పటిమలకుప్పం నుంచి తెప్పించిన కృష్ణశిలపై విగ్రహం చెక్కడం మొదలుపెట్టారు. ఈలోపు ఆర్థిక సమస్యలతో కన్నన్ ఆచారి వర్క్‌షాపు మూసేశారు. స్థలం ఇతరులకు విక్రయించేశారు. విగ్రహం చెక్కమని కోరిన వారు ఎన్నేళ్లయినా రాలేదు. అసంపూర్ణంగా మిగిలిన ఆ విగ్రహాన్ని 2003లో టీటీడీ కాంట్రాక్టర్లు అలిపిరిలో తమకు కేటాయించిన షెడ్లున్న ప్రాంతానికి తీసుకొచ్చి పడేశారు. అదే ఏడాది అక్టోబరులో సీఎం చంద్రబాబుపై అలిపిరి వద్ద నక్సలైట్లు క్లైమోర్ మైన్లతో దాడికి పాల్పడ్డారు. దీంతో అక్కడి తాత్కాలిక షెడ్లను పోలీసులు తొలగించారు. విగ్రహం పెద్దది కావడంతో ఎవరూ తీసుకువెళ్లలేదు. ముళ్లపొదల్లో అలాగే ఉండిపోయింది. తర్వాత కన్నన్ ఆచారి అనారోగ్యంతో మరణించారు. భూమన రెండుసార్లు టీటీడీ చైర్మన్‌గా ఉన్నపుడూ ఆ విగ్రహం అక్కడే పడివుంది. ఆ ప్రదేశాన్ని 6నెలల కిందట చదును చేసి టైల్స్‌తో కూడిన ఫ్లోరింగ్ పనులు మొదలు పెట్టారు. పొదల్లో ఉన్న విగ్రహాన్ని పక్కకు తరలించి టైల్స్ అమర్చాక తిరిగి అక్కడే పెట్టారు. విగ్రహం చెక్కిన కన్నన్ ఆచారి వద్ద పనిచేసిన వారు ఇపుడు టీటీడీ శిల్ప కళాశాలలో ఉద్యోగులుగా ఉన్నారు. విగ్రహం గురించిన సమాచారం వీరందరికీ తెలుసు. ఇవేవీ విచారించకుండానే టీటీడీపై బురద చల్లడానికి అవకాశం దొరికిందనే హడావుడిలో భూమన నానా యాగీ చేయడం శ్రీవారి భక్తులను ఆశ్చర్యపరిచింది.

భూమనకు 41ఏ నోటీసులు

శ్రీమహావిష్ణువుకు అపచారమంటూ భూమన తీవ్ర విమర్శలు చేయడాన్ని టీటీడీ సీరియ్‌సగా తీసుకుంది. టీటీడీపై, దేవుళ్లపై అసత్య ప్రచారాలతో వీడియో పోస్టు చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారంటూ డీఈఈ గోవిందరాజులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణకు గురువారం తిరుపతిలోని డీఎస్పీ ఆఫీసుకు రావాలంటూ భూమనకు ఎస్‌ఐ పూజిత బుధవారం 41ఏ నోటీసు అందజేశారు. తాను బిజీ అని భూమన చెప్పడంతో, వీలు చూసుకుని రావాలంటూ ఎస్‌ఐ సూచించారు. ఈ నెల 23న వస్తానంటూ భూమన పోలీసులకు తెలిపారు.

విష్ణుమూర్తి ఎందుకు కాదంటే..



ముఖంపై స్పష్టంగా కనిపిస్తున్న మీసాలు, నుదుటిపై భాగంలో నామాలు లేని దృశ్యం

భూమన ఆరోపిస్తున్న అలిపిరిలోని విగ్రహానికి మీసాలు ఉన్నాయి. ఎడమవైపున్న నాలుగో చేతిలో బాలుడు, కుడివైపున మూడో చేతిలో కపాల పాత్ర, పాదాల వద్ద సింహం ప్రతిమ ఉన్నాయి. విష్ణుమూర్తి విగ్రహానికి ఇవేవీ ఉండదగినవి కావని వెంకటరెడ్డి చెప్పారు. విగ్రహానికి ఇరువైపులా శంఖుచక్రాలు ఉన్నప్పటికీ నుదుటిపై నామాలు లేవని తెలిపారు. దీనిని శనైశ్చరుడి అసంపూర్తి విగ్రహంగా భావిస్తున్నామన్నారు. శంఖుచక్రాలు చెక్కించడమనేది విగ్రహ తయారీకి ఆర్డర్ ఇచ్చిన వ్యక్తుల విశ్వాసానికి, ఇష్టానికి సంబంధించిన విషయమని పేర్కొన్నారు. అవి ఉన్నంత మాత్రాన విష్ణుమూర్తిగా భావించడానికి వీల్లేదన్నారు. భూమన విడుదల చేసిన వీడియోలో ఆగమ శాస్త్రాన్ని ఉదహరిస్తూ శనైశ్చరుడికి ఒక చేతిలో విల్లు, మరో చేతిలో బాణం ఉంటుందన్నారు. అలిపిరి విగ్రహానికి కూడా ఎడమ వైపు రెండో చేతిలో విల్లు, కుడివైపు రెండో చేతిలో బాణం ఉన్నాయి. అయినా కూడా ఆయన హడావుడి చేశారు.



విగ్రహం ఎడమ వైపు రెండవ చేతిలో విల్లు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.